REL(G)/14 C

గీత

స్వతంత్ర పరిశీలన

అనువాదకర్త :

శ్రీ జి. వి. శివరామరాజు

మూలకర్త :

యోగేశ్వర మునీశ్వర శ్రీ శివముని



తెలుగు సాహితీ సమాఖ్య
(రిజిష్టరు నెం. 116/76)
తాడేపల్లిగూడెం.

CI

REHBOQ486
REL(G)/14

గీత

స్వతంత్ర సమీక్ష

అనువాదకర్త :

శ్రీ జి. వి. శివరామరాజు

మూలకర్త :

యోగేశ్వర మునీశ్వర శ్రీ శివముని



తెలుగు సాహితీ సమాఖ్య

(రిజిష్టర్డు నెం. 116/76)

తాడేపల్లిగూడెం.

ప్రతులు 1000

అక్టోబరు – 1978

తెలుగు సాహితీ సమాఖ్య ఆరవ కుసుమము.

సర్వస్వామ్యములు అనువాదకర్తవి.

ముద్రణ : శ్రీ వైష్ణవ ప్రెస్,

పెంట పాడు.

ప్రాప్తిస్థానము :-


జి. వి. శివరామరాజు

అలంపురము.

తాడేపల్లిగూడెం. ప. గో. జిల్లా.

TRANSLATED

BY




SRI G. V. SIVARAMA RAJU

of. Alampuram [W. G. District, A. P.]

27

DEDICATED

TO



SRI YOGESWARA MUNEESWARA

SRI SIVAMUNI

Founder of Akhila Bhumandaleeya Siromani Munisamaj
of Gorakpur (U. P.)
And
Author of 'Gita Pur Swatantra Vichar'

07.

సుహృదభినందనములు

Dr. N. V. R Krishnamacharya,
M A.,Ph D.,
Emiritus Professor, Osmania University,
Hyderabad. A. P.

హిందీలో, యోగీశ్వర శ్రీ శివమునిగారు "గీతా పర్ స్వతంత్ర విచార్" – అనేగ్రంథం ప్రవాసియున్నారు. దానిని శ్రీ జి.వి. శివరామరాజుగారు చేట తెలుగులో హృదయంగమంగ మృదుమధురశైలిలో అనువదించియున్నారు.

భగవద్గీతపై ఇంతవరకు వేలకొలది వ్యాఖ్యానాలు వెలసియున్నవి. అయితే – గీతావాఙ్మయములో ఈ గ్రంథమునకు విశిష్టస్థానమున్నది. ఇది–"స్వతంత్ర సమీక్ష". నిజమైన స్వతంత్రసమీక్ష.

స్వతంత్రముగా ఆలోచించువారిపై గౌరవమున్న వారందరు ఈ గ్రంథమును అవశ్యము చదివి తీరవలెనని నా అభిప్రాయము. శ్రీ శివరామరాజుగారు చేసిన కృషి మెచ్చదగినది. గీతను కేవలము పారాయణ గ్రంథముగా భక్తులు వాడుట కద్దు. అనుష్ఠాన వేదాంతులు వేరు. ఆలోచనచేసి హృదయములో ఒక క్షీరసాగర మథనము చేసుకొనువారు ఒకరిద్దరు మాత్రమే.

శ్రీ శివరామరాజుగారి అనువాదము చదివిన ఆంధ్ర సహృదయుల హృదయంలో ఒక క్షీరసాగర మథనం ఏర్పడ గలదనీ అందుండి వేదాంత కామధేనువులు – కల్పవృక్షాలు చింతామణులు ఆవిర్భవింపగలవని నమ్ముచున్నాను. ఇది కేవలము ఒక వ్యాఖ్యాన గ్రంథముకాదు. ఇది ఒక విసూత్న పరిశోధక గ్రంథము. ఈ గ్రంథమును తెలుగు వారికి అందించిన శ్రీ శివరామరాజుగారికి నా సుహృదభినందనలు.

ఆచార్య డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్య.

ప్రస్తావిక

శ్రీమద్భగవద్గీత వేదాంత ప్రస్థానత్రయమున సుప్రసిద్ధమైనది. భారతీయులీ గీతను భగవతోక్తమనియు శ్రుతిసమానముగ భావించుచున్నారు. ఈ గీతాకర్తయగు పురుషోత్తముని హృదయమును వ్యక్తీకరించుటకు అనేకులు ప్రయత్నించుచుండిరి. నిరంతర సత్యారాధనత్వము, నిశ్చల ధ్యాననిష్ఠయున్నప్పుడు మాత్రమే గీతార్థము సువ్యక్తమగుననియు గీతా భాష్యకారులు పేర్కొనుచున్నారు. మతదృష్టిగల భారతీయులకు "చతుర్వేద సారమును రూపుదాల్చిన దివ్యాకృతియే" భగవద్గీత.

ప్రస్తుత రచనము "గీతపై ఒక స్వతంత్ర సమీక్ష. దీని హిందీ మూలకర్త యోగేశ్వర మునీశ్వర శ్రీ శివమని. ఆంధ్రీకరణకర్త శ్రీ గోరింట వెంకట శివరామరాజు. ఈ రచనయందు – గీతను రచించిన దెవరు? గీతయందు చెప్పబడిన "మామ్" "అహమ్" అను శబ్దముల కర్థమేమి? గీత మతమీశ్వరునంగీకరించుచున్నదా? గీతయందలి ఈశ్వరుడెవ్వడు? గీతయందు యోగసాధనమునకెట్టి ప్రాధాన్యమీయబడినది? గీతారచయితకు ఒక సిద్ధాంతముకలదా? గీతాకర్త స్వవచోవ్యాఘాతమునకు తలపడినాడా? – అను విషయములు ప్రస్తావింపబడినవి. ఈ విషయములను విపులీకరించుటయందు మూలకర్త గీతయందలి శ్లోకముల నెత్తిచూపుటయేకాక, ఉపనిష

వ్యాక్యములనుగూడ ప్రదర్శించినారు. హేతువాద దృష్టితో, వివేచనతో ఆలోచింపవలసినదిగా పాఠకుని ప్రబోధించినారు.

ఈ రచనమున మతమనునదే సరికాదనియు, మతము కల్పించిన ఈశ్వరుడే లేడనియు, ఈ వాదము మూర్ఖతాయుత మనియు చెప్పబడినది. అంతియేకాదు "అహమ్, మామ్" శబ్దములకు వ్యాకరణ కార్యసాధనమొనర్చి జీవుడే పరబ్రహ్మ మనియు, ఆత్మయనియు నిరూపించినారు. హేతువాద దృష్టితోడ, తార్కిక దృక్పథముతోడ పరిశీలించిన నిది సరియగునేమో పరిశీలనార్హము. శ్రీ రాధాకృష్ణ పండితుడొకచోట "గీతారచన సల్పిన కాలమున హిందూజీవితమునం బరస్పర విరోధము గలిగియున్న వివిధభావములను, సమగ్రము, సర్వతో ముఖము, నిగూఢము, వివేక విలసితమునైన సమన్వయ మొనర్చి, గీత ప్రవచించినది. యజ్ఞప్రాధాన్యముగల వైదిక మతమును, పరబ్రహ్మోపదేశ మొనర్చిన ఉపనిషత్తత్వమును, మృదుమధుర భక్తిభరితమగు భాగవత ధర్మమును, సాంఖ్య ద్వైతమును, యోగధ్యానమును, గీతాచార్యుడు సంస్కరించి సమన్వయించినాడు. హిందూజీవితములోని సజీవమునైన యీ భిన్నాంశములను నాతడేక తత్త్వముగా నిర్మించినాడు. దేనిని దిరస్కరించు పద్ధతి ననుసరింపక అన్నిటియందుఁజేరి, గమ్య స్థానమన్నిటి కొక్కటేయని నిరూపించినాడు" అని చెప్పియుండిరి. (భగవద్గీత-ఉపోద్ఘాతము-పుట 5)

అసలు గీతారచయిత యెవరో ఇతమిత్థముగ తెలియదు.

కాని వ్యాసుడే గీతను రచించెనని చెప్పుదురు. గీతయందలి పదు
నెనిమిది యధ్యాయములు మహాభారత భీష్మపర్వాంతర్గతములు.
గీతను ఉపదేశించినవాడు శ్రీకృష్ణుడు. ఈ శ్రీకృష్ణుడు రణ
రంగమున నేడు వందల శ్లోకములను చెప్పెనాయని కొందరు
సందేహింపగా, అతడేమో కొన్ని ముఖ్య విషయములనుచెప్పగా
వ్యాసుడు వానిని ప్రపంచీకరించెనని కొందఱు చెప్పిరి. అనగా
ప్రస్తుతము వ్యాప్తియందున్న భగవద్గీత వ్యాసలేఖినీ జనితమని
నిస్సంశయమగుచున్నది. ఈ భగవద్గీత యావిర్భావమును గుఱించి,
పెంపునుగుఱించి కార్చే పండితులని "ఆదిలో భగవద్గీత సాంఖ్య
యోగతత్త్వదీపికయనెయు, కృష్ణవాసుదేవ మతశాఖ దానితో
మిశ్రిమమైనదనియు, క్రీస్తుపూర్వము మూడవ శతాబ్దిలో
వైదిక సంప్రదాయము ననుసరించి విష్ణువే కృష్ణుడను భావ
ముతో సమన్వయమందినదను భావము సమంజసమే. అందుచే
గీతలో అచ్చటచ్చట స్వవచోవ్యాఘాతములు కన్పించుట సహ
జము. గీతయందు కన్పించు మతసంబంధమగు సిద్ధాంతవాక్య
ములు ప్రక్షిప్తములని చూడోల్ఫు ఆటో భావించినాడు. శంక
రుడుకూడ జ్ఞానకర్మ సముచ్చయభావమును తిరస్కరించెను.
అజ్ఞానకామోపహతులయినవారికే వైదికకర్మలుద్దేశింపబడెనని
శంకరుని యభిప్రాయము.

"అవిద్వాంసకామవతా ఏవ సర్వాణి శ్రౌతాదీనిదర్శితాని"
అని శంకరుడు ఈ యభిప్రాయమునే శ్రీ శివమునికూడ వ్యక్తీ
కరించెను. అయితే ప్రస్తుత రచనమున ఆత్మయే ఈశ్వరుడనియు.

పురాణములందు చెప్పబడినట్లుగ సాకారుడు, సగుణుడుసగు ఈశ్వరుడు ప్రత్యేకముగ లేడనియు చెప్పబడినది. కాని తర్కము పరమార్థ సత్యమును సమస్యను పరిష్కరించదు. కావున వ్యక్తి గతానుభవము లేని తర్కము సత్యమును ఆవిష్కరింపదు. ఈ రచయిత పేర్కొనినట్లు ఆత్మానుభవమే అట్టి సత్యమును ఆవిష్కరింపగలదు. నిజమే, కర్మయొక్క ఫలితమును ఆత్మయే అనుభవించును. మరణము శరీరమునకుగాని ఆత్మకులేదు. దీనిని హేతువాదులు, మతవాదులు ఇరువురును అంగీకరించుచున్నారు మరణించిన పిదప ఆత్మ ఎచ్చటకు పోవుచున్నది? అట్లు పోయిన ఆత్మ ఎంతకాల మెచ్చట తిరుగుచున్నది? తిరిగి నూతన శరీరము నెట్లు చేరుచున్నది? మరణమనఁగా ఉచ్ఛ్వాస నిశ్వాసము లాగుటయేనా? లేక ఇంతకంటె అన్యమేదియైన గలదా? "మతవాదులు సృష్టించిన భగవంతుడు సర్వజ్ఞుడు. అయినచో పాపుల హృదయములందుకూడ అతడు కలడుకదా. ఆ పాపమును నాతడు నిర్మూలించవచ్చునుగదా?" యను హేతువాదుల ప్రశ్నలకు సమాధానమేమి? పాపకర్మను గావించి భగవదర్పణమన్నిన ఆ పాపము నశించునా? లౌకికదృష్టిలోను, ప్రభుత్వము భగవదర్పణదృష్టితో హత్యనొనర్చిన ఒక హంతకుని క్షమించునా? యను లౌకిక హేతువాద దృష్టికి సమాధాన మేమి? ఈ ప్రశ్నలన్నియు అనాదినుండి వచ్చుచునేయున్నవి. లౌకిక, అలౌకిక దృష్టిభేదమును మతవాదులు కల్పించుచునే యున్నారు. ఈ ప్రశ్నలకు ఆ సమాధానములకు సంఘర్షణము

తప్పటలేదు. ఏదిఏమైనప్పటికి వివేకవంతుడగు మానవుడు ఆలోచింపకుండగ నుండలేడు. ఆ తార్కిక సత్యాన్వేషణలో ఏదోయొకనాడు సామాన్య మానవునకు సత్యము గోచరింపక మానదు. ఆనాడే విశ్వశ్రేయము. ఆ ప్రయత్నములో నీ రచ నముకూడ నొక భాగము.

యోగేశ్వర మునీశ్వర (శ్రీ) శివముని ఉపనిషత్ప్రతిపాద ధర్మవ్యాపనము కావలయునని వారు. ఆ సిద్ధాంత వ్యాప్తి కొఱకు తార్కిక దృష్టితో అనేకములగు రచనములను గావిం చినారు. ఆ రచనములలో "శాంతిదాయి విచార్" అను గ్రంథ మును "శాంతిసోపానము" అను పేరుతోడను, "సృష్టి విజ్ఞాన శాస్త్ర" మను గ్రంథమును "సృష్టి విజ్ఞాన శాస్త్రము"ను పేరు తోడను (శ్రీ) గోరింట వెంకట శివరామరాజుగారు అనువదించి నారు. ఆ గ్రంథముల అనువాదముల యోగేశ్వర మునీశ్వర శ్రీ శివముని అనుయాయుల ఆమోదము నందగలిగినవి. ప్రస్తుతము "గీతా పర్ స్వతంత్ర విచార్" అను శ్రీ శివముని కృతరచనమును ఆంధ్రీకరించిరి ఈ రచనము భావానువాదము. భాష సరళము. సామాన్యులకుకూడ సులభముగ అర్థమగు సరళశైలిలో రచనము సాగినది. తార్కిక హృదయముకల ప్రతి మానవుడు ఈ యభిప్రాయములతో చాలవఱకు నేకీభ వింపగలదనుటలో సందేహమిసుమంతయు లేదు.

(శ్రీ) శివరామరాజుగారు బహుగ్రంథ పరిశీలనాదక్షులు.

తత్పలితమే ఈ రచనకు వారు ఉపోద్ఘాతప్రాయముగ వ్రాసిన సుదీర్ఘమైన "స్వీయ ప్రసక్తి". ఈ స్వీయప్రసక్తిలో వీరు ఆస్తికులెవ్వారు? నాస్తికులెవ్వారు? అను విషయమును విపుల ముగా చర్చించినారు. కనీసము కొంతమంది లోనైన మానసిక పరిణామము కలిగినచో వీరి శ్రమ ఫలించినట్లే భావింపవచ్చును.

శ్రీ శివరామరాజుగారి లేఖినినుండి ఇంకను శ్రీ శివముని రచనము లాంధ్రీకరింపబడి, ఆంధ్రదేశమున తార్కిక దృక్పథము వృద్ధిచెందుటకు తోడ్పడునుగాక.

రామచంద్ర భవనమ్
కృష్ణాయపాలెం
30-9-78

భవదీయ,
డాక్టరు నండూరి వేంకట సత్యరామారావు
ఎం. ఏ., పిహెచ్. డి.
ఆంధ్రోపన్యానకులు, ప్రభుత్వ కళాశాల, తాడేపల్లిగూడెం

—0—

స్వీయ ప్రపత్తి

గీతను నిష్పక్షపాతదృష్టితో అధ్యయనము చేసినయెడల సంప్రదాయవాదులు, మతవాదులు తమ కనుకూలించునట్లు అందనేక శ్లోకములు, అధ్యాయములు ప్రక్షిప్తము (చేర్చుట కూర్చుట) చేసియున్నట్లు ధ్వనపడుచున్నది. కొందరు విద్వాంసులు సమస్త గీతను ప్రక్షిప్తమని చెప్పుచున్నారు.

గీతను మహాభారతముతో కలిపి చదివినయెడల తరువాత సంప్రదాయవాదులు గీతను మహాభారతమందు ప్రక్షిప్తము చేసియున్నట్లు గోచరింపగలదు. మహాభారతమందు గీత ప్రక్షిప్తమైనట్లు సప్రమాణముగ నిర్ణయింపబడినది. ఇంతియే గాకుండ గీతయందలి శ్లోకముల నాధారము జేసికొని విమర్శక దృష్టితో చూచినయెడల ఈ విషయము ధ్వనపడగలదు. శ్రీ శివముని రచితమగు నీ గ్రంథమందిదియే ననుసరింపబడినది. ఖిల్లి ప్రక్షిప్త శ్లోకములను వ్యాసప్రోక్తములని యంగీకరించుట అసంభవముగ తోచకమానదు!

మహాభారత మొక ఇతిహాస గ్రంథము. చాలమంది విద్వాంసులు భారతము సత్యమని నిర్ణయించుటకు తమ శక్తి యుక్తుల నుపయోగించి ప్రయత్నించియున్నారు. ఇంచు బుద్ధికి స్థానమియ్యలేదు. శ్రద్ధావిశ్వాసములతో విషయగ్రహణము చేయవలయునని వీరి భావము. ఇది ఈ యుగమునకు సరిపడని విషయము! అట్లని మహాభారతమందలి సమస్త విషయములను

త్రోసిపుచ్చరాదు. ఎక్కడెక్కడ జనసామాన్యముసందు అంధ విశ్వాసము, పాషండత్వము నుద్భవింపజేయుచుండునో అక్కడక్కడ శిక్షిత ప్రజాహృదయ క్షేత్రములందు నాస్తికత్వ బీజాంకురము లుదయింప జూచుచుండును.

మహాభారతమందలి అప్రాకృతికములు, సృష్టినియమ విరుద్ధములైన అనేక సంఘటనలను సత్యములని మనమంగీకరింప గలమా? ఉదాహరణకు – తేజోగోళమగు సూర్యునివలన కుంతి గర్భవతియగుట, కర్ణుడుద్భవించుట అసంభవము! మరియు వ్యభి చారముకూడనైయున్నది.

మహాభారత రచయితయగు వేదవ్యాసుని జన్మచరిత్రకూడ ప్రకృతి నియమవిరుద్ధమైనదే! మహాభారత కథానుసారముగ – అవివాహితయగు మత్స్యగంధిని పరాశరుడు మోహించి, పగ టిని రాత్రిగజేసి అమె ననుభవింపగ, సద్యోగర్భమున యువ కుడై సమస్త విద్యాపారంగతుడైన వ్యాసుడు జన్మించెనట!

పగటివేళను రాత్రిగ మార్చుట, వేదశాస్త్ర పారంగతు డైన వ్యాసుడు యువకుడుగనే జన్మించుట వానిని సత్యములని యంగీకరింపగలమా?

మహాభారతము ఇత్యాద్యనేక గాథలతోను, ఉపాఖ్యా నములతోను నిండియున్నపుడు అందలి ప్రత్యక్షరమును, ప్రతి శబ్దమును బ్రహ్మవాక్యముగ విశ్వసించుటెట్లు? ప్రతి మత్రగ్రం థములందును ఇట్టి అవిశ్వసనీయములగు అనేక గాథలుండియే

యున్నవి. మహాభారతమందు సుజనగ్రాహ్యములగు అనేక సద్విషయములుగూడ లేకపోలేదు!

ప్రఖ్యాత పాశ్చాత్య విద్వాంసుడగు "వింటర్ విట్జు" "భారతీయ నాహిత్యేతిహాసము" అను ఒక గ్రంథమును రచించెను. అందు మహాభారతకాలమునాటి కులమత సాంఘిక వ్యవస్థలను నిశితముగ విమర్శించెను. "మహాభారతము చాలవఱకు ప్రక్షిప్తమని, ఏకవ్యక్తి రచనగాదని"గూడ విమర్శించెను.

పాపమీ పాశ్చాత్య క్రైస్తవ పండితులకు "బైబిలు" నందలి తత్తుల్యములగు అసంభవగాథలు గోచరింపలేదు! ప్రతివానికి స్వమతమందలి దోషములు అసంగతములుగ గోచరింపకపోవుట సహజమే! అంధవిశ్వాసమే దానికి కారణము!

ఆర్యమత వ్యవస్థాపకుడగు శ్రీ స్వామి దయానందుడుకూడ "మహాభారతము, గీత చాలవఱకు ప్రక్షిప్తము; వేదవ్యాసుడొక్కడే వానిని రచింపలేదు"అని ప్రకటించియున్నారు.

రామాయణకాలమందు అప్పటి క్షత్రియ ప్రభువుల యొద్ద బ్రాహ్మణులు ఉన్నతములగు స్థానములను, గౌరవమును పొందియుండిరి; పరిపాలనాయంత్రాంగమందు ప్రభువులతో పాల్గొనుచుండెడివారు. భారతకాలమునాటికి బ్రాహ్మణుల ప్రాభవము తరిగి, బ్రహ్మక్షత్రియులమధ్య సహకారభావము కొంతవఱకు లుప్తమైనట్లు కనుపించుచున్నది; బ్రహ్మర్షులగు బ్రాహ్మణులయొక్క మార్గదర్శకత్వము లోపించినందున, భారతకాలమునాటి క్షత్రియవర్గము పదభ్రష్టులై స్వేచ్ఛగ విహ

రింపసాగిరి; అప్పటి బ్రాహ్మణులయందుగూడ సద్విద్యాత్యాగ భావములు లోపించిపోయినవి. ఇందువలన భారతకాలమందు బ్రహ్మక్షత్రియులమధ్య బ్రాహ్మణపదవికొరకు పరస్పర ఘర్షణ ప్రారంభమైనట్లు కనుపించుచున్నది. భారతయుద్ధమునకు ఇది కూడ ఒక కారణమైయున్నది.

మహాభారతమందలి బ్రహ్మవిద్యోపదేశకులందరు బ్రాహ్మణులుకారు. క్షత్రియులుకూడ గలరు! గీతయందు శ్రీకృష్ణునికి సర్వోత్తమ స్థానమీయబడినది; ఇతడు బ్రహ్మవిద్యకు ఉపదేష్టయే గాకుండ సాక్షాత్తు పరబ్రహ్మగ పరిగణింపబడియున్నాడు. భీష్ముడు, యుధిష్ఠిరుడు, విదురుడు ఆదిగాగల బ్రహ్మవిద్యామర్మజ్ఞులందరు క్షత్రియవంశోద్భవులే!

ఈ పరస్పర సంఘర్షణ బౌద్ధ, జైనకాలమునాటికి ఉగ్ర రూపము ధరించినది. "బుద్ధుడు" జైనమతస్థాపకుడగు "మహావీరుడు" వారిరువురు క్షత్రియులే! ఈ ఉభయ మతసాంప్రదాయకులు బ్రాహ్మణులయందు విముఖత చూపసాగిరి.

పౌరాణికకాలమందు శ్రీరాముని. శ్రీకృష్ణుని పూర్ణావతార పురుషులుగ అంగీకరించియున్నారు. దశావతారములయందు శ్రీ వామన పరశురామావతారములుతప్ప మిగిలిన యవతారములన్నియు క్షత్రియ వంశజాతములై యున్నవి.

ఇందువలన భారతకాలమునందు, తదనంతరకాలమునందు రాజదర్బారులలో బ్రహ్మవిద్యాపారంగతులగు సద్బ్రాహ్మణులు లోపించిరి; రాజాస్థానములందు – పురోహితులు,

భట్టుమూర్తులు, వందిమాగధులు ఆశ్రితులై అవకాశములను పొందగలిగిరి. ఇట్టి సమయమున, మహాభారతమందు, భగవద్గీత యందు అనేక భాగములు ప్రక్షిప్తములు కాబడినట్లు గోచరించుచున్నవి. ఈ చేర్పులు, కూర్పులు అనేకులు చేసియున్న కారణమున మిక్కిలి అసమంజసముగ కనుపించుచున్నది; పురాణ రచనయందుకూడ వారి హస్తముండియున్నది. తరువాత హైందవ పండితులు తమ తమ మతములకనుకూలించునట్లు అనేక శ్లోకములను భారతమందు, భగవద్గీతయందు చేర్చి తదనుకూలముగ వాడింపసాగిరి. గీతయొక్క ఉపదేష్ట శ్రీకృష్ణుడని, రచయిత వ్యాసుడని ప్రచురించిరి. తమచే ప్రక్షిప్తము చేయబడిన శ్లోకములుకూడ వ్యాసప్రోక్తములని వ్యవహరింపచేయసాగిరి.

భగవద్గీత గొప్ప ఆధ్యాత్మికగ్రంథమనుటలో సంశయము లేదు. ఇందనేక ప్రక్షిప్తములు చేరియున్న కారణమున సమన్వయము కుదరక నిశ్చయాత్మకబుద్ధియందు వివర్శకు తావిచ్చుచున్నది.

అర్జునునకు యుద్ధమందు కలుగు హింసాత్మక దృశ్యము మనోనేత్రములకు గోచరించినపుడు విషాదభావము కలిగియుండవచ్చును. ఇది సహజమే! అపుడు శ్రీకృష్ణుడు కొన్నిమాటలు చెప్పి అర్జునుని యుద్ధోన్ముఖునిజేసి యుండవచ్చును. కాని కురుక్షేత్ర రణరంగమున, ఉభయసేనామధ్యమున పదునెనిమిది అధ్యాయములు గీతనుపదేశించుట అసంభవము!

"గీతయంతయు ప్రక్షిప్తమే!" అని వాదించువారి కిది

యొక ఆధారభూతమగుచున్నది. ఇంతటి దీర్ఘమగు ఆధ్యాత్మి
కోపదేశము మహాభారతమందే ఘట్టమునందు ప్రవచింపబడి
నదో విజ్ఞులు గమనింపవలసియున్నది.

భగవద్గీత సాంప్రదాయికవిష మిళితమైన ఒక ఆధ్యాత్మిక
రసపాత్రవంటిది! ఇందలి రసమునకు, విషమునకు మధ్యగల
వ్యత్యాసమును నిష్పక్షపాతులగు వివేకవంతులు సులభముగ
గ్రహింపగలిగియుందురు. ఇట్టి పక్షపాతరహిత సమీక్షయే ఈ
గ్రంథరూపమును ధరించినది. యోగేశ్వర శ్రీ శివముని గీతను
ఈ గ్రంథమందు, సునిశితములగు సత్యసిద్ధాంతముల నాధారము
జేసికొని విమర్శించియున్నారు. విజ్ఞులు గమనింతురుగాక!

ఒకానొక సమయమందు హైందవులు పురాణములందలి
ప్రకృతివిరుద్ధములగు విచిత్రగాథలను నమ్ముచుండిరి. క్రమక్రమ
నాగరికులగు విద్వాంసులు పై విచిత్రేతిహాసములను విశ్వసింప
జాలకపోయిరి. వాని విమర్శలు ప్రజాసామాన్యమందుకూడ
ప్రచారము కాసాగినవి. అప్పుడు పురోహితులు, మతపండితులు
కొంతవఱకు సంస్కరించుకొని, తమతమ సిద్ధాంతములను ప్రచా
రము చేయు నుద్దేశ్యముతో భారతమును, భగవద్గీతను వీలై
నంతవఱకు "ప్రక్షిప్తము" చేసెయున్నట్లు గోచరించుచున్నది.

ఆధ్యాత్మిక గ్రంథమగు గీత ద్వార తమ సిద్ధాంతముల
ప్రచారముచేయు నుద్దేశ్యముతోనే చేర్పులు, కూర్పులు చేయ
బడినట్లు తోచుచున్నది. ఈ సమయమున పురాణములందు
ప్రజాసామాన్యమునకు నమ్మకము కొంతవఱకు తరిగిపోవుట

గూడ ఇందుకు కారణమై యుండవచ్చును. గీతయొక్క మూల రచనయందిట్టి అసంగత విషయములు లేకపోవచ్చును. ఈ చేర్పులు, మార్పులు చేసిన వర్గమునకు హైందవధర్మ తత్వ మందు వాస్తవిక జ్ఞానము లోపించియున్న కారణమున భావ సామ్యత, సందర్భశుద్ధి కుదిరియుండ లేదు. గీతయందిట్టి ఘట్ట ములు స్పష్టముగ గోచరించుచున్నవి; వానిని సమీక్షించు టయే ఈ గ్రంథ రచన యొక్క ముఖ్యోద్దేశము.

ఇట్టి అవాస్తవిక వాదములనుండి రక్షింపబడవలయుననిన ఇతరకార్యములందువలెనే ధర్మమందు, మతమందుకూడ మన తర్కబుద్ధిని బాగుగ నుపయోగింపవలసియున్నది. మతవిశ్వా సులగ్ను మానవులు "ధర్మము"నకు "సంప్రదాయము"నకు విప రీతార్థములు కల్పించి ప్రజల నమ్మించుచుందురు. వారు "ధర్మము"నకన్న "సంప్రదాయము"నకే ఎక్కువ ప్రాధాన్య మిచ్చుచుందురు. ఉపనిషత్ప్రతిపాదితమగు మతమునకు "ధర్మ ము" అని పేరు. ఇందలి నియమనిష్ఠలు కష్టసాధ్యములై కను పించినప్పటికి సాధకులకు సులభసాధ్యములే! నిజమగు మోక్ష ప్రదాత ఈ ధర్మమే!

ఈ ధర్మమును చక్కగ గ్రహించుటకు తర్కయుక్త మగు బుద్ధిని బాగుగ నుపయోగింపవలసియుండును. ఈ విష యమే షడ్దర్శనములందుగూడ ధృవపర్చబడినది. ఇట్టి సనాతన ధర్మమిపుడు ప్రపంచమందలి సమస్తమతములందును లోపించి పోయినది!

ఇప్పుడు ప్రతి మతము రాజకీయమే ప్రధానముగ గలిగి యున్నది. వీటైనంత జనసమూహమునకు తమతమ మతము లందు ప్రవేశించు నవకాశమును కలుగజేయుచున్నవి. ప్రవే శించువారి అర్హతా నర్హతలను బొత్తిగ గమనించుటలేదు! ఆధ్యాత్మిక ధర్మమే ప్రధానముగగల మతములకిది గర్హణీయమే! ఇందువలన ప్రతిమతమునందు ఆధ్యాత్మికసాధనా విభాగము లోపించి, సాంప్రదాయికాచారములు ప్రబలిపోయి నవి. సంప్రదాయమన నేమి ? – గురుపరంపరగాను, వంశపరం పరగాను వచ్చిన యాచారములు. ఈ సంప్రదాయములు కాల క్రమమున ఆధ్యాత్మికధర్మ సంపర్క విహీనమునై అంధవిశ్వాస యుక్తముగ మిగిలియున్నవి. వానికి మతవాదులు తమ పరి భాషలో "శ్రద్ధ" "భక్తి" అని నామకరణముచి వ్యవహరిం చుచున్నారు. ఆధ్యాత్మిక విద్యలో ప్రాచీన కాలమున ప్రపరిచ మునకు మనదేశము ఆచార్యస్థాన మలంకరించియున్నది. ప్రస్తు తము మనమతమందుకూడ సాధనావిధానము చాలవఅకు లోపిం చిపోయినది. ఎన్ని పాపముల జేసినను గుడికిగాని, చర్చికిగాని, మసీదుకుగాని పోయి దేవుని ప్రార్థించినయెడల పాపపరిహార మగునను మిథ్యాభావమిపుడు ప్రతి మతమందును బ్రబలి యున్నది. ప్రక్షిప్త విభాగమున గీతయందుకూడ ఇట్టి భావ ములు గోచరించుచున్నవి. కర్మఫలమును ప్రతి వ్యక్తి అనుభ వించి తీరవలసినదియే! ఏ ఖుదాగాని, ఈశ్వరుడుగాని దానిని తప్పింపజాలడు; ఇది నిశ్చయము! ఆత్మకన్న భిన్నమగు భగ

వంతుడు వేరుగ లేనపుడు పాపముల పరిహరించునదెవరు ? సత్కర్మాచరణంతో ఆధ్యాత్మిక సాధనా తత్పరులుమాత్రమే పాపదూరులై జీవన్ముక్తులగుదురు.

ధర్మవిషయములు, మతవిషయములు తర్కబుద్ధితో విమర్శింప తగనివని సాధారణముగ ప్రజలు భావించుచుందురు. ఇది సరియైనదిగాదు! మను స్మృతి ప్రమాణమిట్లు చెప్పుచున్నది.

శ్లో॥ ప్రత్యక్షం చానుమానం చ శాస్త్రం చ వివిధాగమమ్।
త్రయం సువిదితం కార్యం ధర్మసిద్ధి మభీప్సితా॥
(అ. 12–105)

శ్లో॥ అర్షధర్మోపదేశం చ వేదశాస్త్రాఽవిరోధినా।
యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేదనేతరః॥
(గీ అ. 12–106)

ధర్మతత్వమును తెలిసికొనగోరువాడు – ప్రత్యక్ష ప్రమాణమ్ము, అనుమాన ప్రమాణము, ధర్మశాస్త్ర ప్రమాణము ఈ మూడింటిని బాగుగ నవగాహన జేసికొనవలసియున్నది. (105)

ఎవడు ఋషిప్రోక్తమగు ధర్మోపదేశమునకు, వేదశాస్త్రములకు విరుద్ధముగాకుండ తర్కబుద్ధిని సంధానము జేయుచున్నాడో అతడే నిజమగు ధర్మవేత్త ఇతరుడుకాడు! (106)

ఇదేవిధముగ నిరుక్తకారుడు – "తర్క ఏవ ఋషిః" తర్కమే ఋషితుల్యము! ఋషియనగ ప్రకాశింపజేయువాడని భావము. ఈ క్రింది శ్లోకమును గమనింపుడు.

శ్లో॥ యస్య నాస్తి స్వం ప్రజ్ఞాశాస్త్రం తస్యకరోతికిమ్।
లోచనాభ్యాం విహీనస్య దర్పణః కిం కరిష్యతి॥

ఎవనికి సదసద్వివేక బుద్ధి లేకుండునో అతనికి శాస్త్ర మేమియు సహాకరింపదు అంధునికి అద్దమేవిధముగ నుపయోగ పడగలదు ?

ప్రాచీన వైదికకాలమందలి ప్రజలు ధర్మమును తాము స్వాయముగ, ఆలోచనాపూర్వకముగ తెలిసికొనగలిగి ఆచరించు చుండెడివారు. కొన్నిపేల సంవత్సరములనుండి ఈ పని ఇతరు లకు విడువబడిన కారణమున జాతి తమనుగురించి తాను ఆలో చింపజాలకపోయినది. అప్పుడితరుల మోసమున కవకాశము చిక్కినది. నేటి శిక్షిత సమాజమునకు ధర్మగ్రంథ స్వాధ్యాయ మందు అభిరుచి కొరవడిపోయినది. అభిరుచి గలవారైనను, ధర్మమును తర్కవస్తువుగ నుపయోగింపకుండ విశ్వాసవస్తువుగ భావించుచున్నారు. ఇందువలన వారుకూడ ధర్మముయొక్క వాస్తవిక స్వరూపమును తెలిసికొనజాలకపోవుచున్నారు. ధన వంతులయొక్క, వ్యాపారులయొక్క, కర్షకులయొక్క పరిస్థితి కూడ ధర్మవిషయికముగ పై విధముగనే యున్నది. తమతమ కార్యక్రమములందు సక్తులై తీరిక లేకయున్నందున ధర్మవిష యికమగు ఆలోచనయే చేయజాలకున్నారు. తత్ఫలితముగ పురో హితులచేత, సాధువులచేత, మహంతులచేత, బాబాలచేత ప్రజలు బాగుగ మోసగింపబడుచున్నారు. ప్రజలకు నిజముగు ఆధ్యా త్మిక సాధన కొరవడినది.

ఈ అవకాశము నుపయోగించుకొని పూజారులు, పురో హితులు విగ్రహారాధన వైపునకు, వ్రతాదుల వైపునకు ప్రజ లను మళ్ళించిరి; వానివలననగూడ పాపపరిహారముకలిగి మోక్ష ప్రాప్తి గలుగునని వారిని నమ్మించిరి. అప్పటినుండి ప్రభువుల చేత, ప్రజలచేత విగ్రహారాధన, వ్రతపూజాదులు అనుసరింప బడుచు వచ్చినవి. ఇందువలన నిజమగు అధ్యాత్మిక సాధన లోపించి, పై విధమగు మిథ్యాచారములు ప్రబలిపోయినవి. బ్రహ్మవిద్యకన్న కూటవిద్యలు తేలికయేగదా!

వ్రతములు నాచరింపజేయుట, తన్మంత్రములను పురోహి తులు పఠించుట, తత్ఫలితము వ్రతకర్తలకు, పూజాకర్తలకు చెందగలవని వారిని నమ్మించి తద్విధానముల నాచరింపజేయుట— ఇది సమంజసమా? ఇది అనాచారముగాదా? ఇది పాండాల, పురోహితుల ప్రచారము మాత్రమే! ఒకడు భుజించుచుండ మరియొకనికి ఆకలి తీరునా? ఒకడు నీరము ద్రాగుచుండ మరి యొకనికి దాహము తీరగలదా? ఇట్లైనట్టికిని జరుగజాలదు. ఇట్టి వ్రతపూజావిధానములు మంత్రసహితముగ పురోహితుల చేత, పాండాలచేత నిర్వహింపబడుచుండును; మంత్రోచ్చారణ చేయుచున్న పూజారులకుకూడ తత్ఫలము సంక్రమింపదు. కార ణము ఏమి? వ్రతాదుల నిర్వహించుటలో పురోహితులయొక్క లక్ష్యము వ్రతకర్త చేయబోవు ఆర్థిక బహుమానముపైన మాత్రమే యుండును!

నేటి పురోహితులలో అత్యధికశాతము మంత్రార్థమే

తెలియనివారున్నారు. అర్థభావనలేని మంత్రోచ్చారణ వృథా ప్రయాసమాత్రమే! "పతంజలి యోగదర్శన శాస్త్ర"మందు "తజ్జపస్తదర్థ భావనమ్" అని ప్రవచింపబడియున్నది. అనగ - మంత్రమును జపించుచు, తదర్థమును భావింపవలయునని భావము. జపము మానసికమై కేంద్రస్థమైనపుడు "ధ్యానము"గ మార్పుజెందును. "జపాచ్చతగుణం ధ్యానం ధ్యానాచ్చతగుణం లయః" జపముకన్న నూరురెట్లధికఫలదాయకమైనది ధ్యానము; ధ్యానముకన్న నూరురెట్లు లయము ఫలప్రదమైనది. లయమనగ తన్మయమగుట, తల్లీనమగుట (తన్ను తాను మరిచిపోవుట) అని యర్థము. దానినే సమాధియందురు. సాధకులకు దాని నిజమగు ముక్తి లభింపజాలదు; నిత్యసాధకులకిది సులభసాధ్యమే కాగలదు! ఎవరికివారు జపించునది, ఎవరికివారు ధ్యానించునదియే ఆత్మపూజ కాగలదు. ఇది ఇతరులవలన సంక్రమింపజాలదు. అర్థరహితముగ, భావరహితముగ, శుకరామస్మరణ బాహ్య మంత్రోచ్చారణాది పూజావిధానమువలన - మంత్రపాఠకుల్లకు గాని, వ్రతకర్తలకుగాని ఇసుమంతయు ఫలితముండదు.

ఎంతవఱకు ధర్మము గుర్తింపబడక, పూజాపఠన వస్తువుగ గ్రహింపబడుచున్నదో, ఎంతవఱకు అది బుద్ధికి విషయము గాకుండ కేవలము విశ్వాస వస్తువుగ తయారగుచున్నదో అంతవఱకు "ధర్మము" మానవ సమాజమునకు హితము సమకూర్చజాలదు. ఇట్టి వ్యావహారిక ధర్మము ఉపనిషత్తులయందు, వైదిక సాహిత్యమందు మాత్రమే గోచరింపగలదు; కాని పురాణము

లందు కానరాదు. ఇవి కల్పిత గాథలతోను, అతిశయోక్తుల తోను పాఠకులకు హృదయానందమును కలుగజేయుటకై రచింపబడిన ఇతిహాసగ్రంథములైయున్నవి. దురదృష్టవశమున ప్రజలు వానిని నిజమని భ్రమించుచున్నారు. ఇప్పుడీ "దోష గ్రహణము" అన్ని మతములను పట్టిపీడించుచున్నది.

మహాభారత భగవద్గీతలయొక్క ప్రక్షేపణములగురించి కొంతవఱకు చర్చించుకొందము.

మహాభారతమును సునిశితదృష్టితో పరిశీలించినయెడల చాలవఱకు తదనంతరమందు ప్రక్షిప్తాంశముల ప్రవేశపెట్టినట్లు స్పష్టముకాగలదు. ఇందువలన మూలగ్రంథమందలి ఇతిహాసిక మహత్త్వమే కొంతపఱకు తరిగిపోవుచున్నది. ఈ అవకాశమును గ్రహించి దేశీయవిదేశీయ పండితులు కొందరు భారతమును ఇతిహాసగ్రంథముగ నంగీకరింపక, కాల్పనికకావ్య గ్రంథముగ అంగీకరించుచున్నారు. మన దేశమున మధ్యకాలీనయుగమందు మహాభారతము విశేష ఖ్యాతిని సూచించినది. అప్పుడు మన దేశపు సాంప్రదాయిక విద్వాంసులు తమతమ సుతసిద్ధాంతముల ప్రచారముచేయు నుద్దేశముతో ఉచితానుచితముల నాలోచింపకయే భారతమందు తమ తమ మతసిద్ధాంతానుకూలముగ ప్రక్షేపణముల జొరిపియుండిరి; ఇందువలన ఈ గ్రంథమునొక్క మూలరూపమే వికృతమైపోయినది.

ప్రఖ్యాత భారతీయ పండితుడగు "శ్రీ రాజేంద్ర పండితులు" మహాభారతమందలి ప్రక్షేపణములను భారతమునే ఆధా

రముగ జేసికొని కొన్నిటిని నిరూపించియున్నారు. వానిలో కొన్నిటిని దిజ్మాత్రముగ ఈ దిగువ నుదహరించుచున్నాను.

గీతాప్రెస్ (గోరఖపూర్) యొక్క మహాభారత ప్రతి "హరివంశము" గాకుండ ఉత్తరభారతీయ దాక్షిణాత్య పాఠములతోసహా ఒక లక్షా రెండు వందల పదిహేడు (100217) శ్లోకముల గలిగియున్నది.

ఇది ఇట్లుండ మహాభారతమందలి రెండవ అధ్యాయమందు – పర్వముల అధ్యాయముల శ్లోకములయొక్క సంఖ్య ఈ క్రింది విధముగ వివరింపబడినది.

హరివంశముతోసహా పర్వములు 19 అనియు, శ్లోకములు 96638 అనియు నుదహరింపబడినవి. హరివంశ పురాణము మహాభారతమందలి భాగము కాదని తెలియుచున్నది. ఆదిపర్వమందలి రెండవ అధ్యాయపు 82వ శ్లోకమును చూడుడు.

శ్లో॥ హరివంశ స్తతః పర్వపురాణం ఖిలసంజ్ఞితమ్।
విష్ణుపర్వ శిశోశ్చర్యా విష్ణోః కంసవధ స్తథా॥ (82)

దీని తరువాత హరివంశపర్వమున్నది; దీనినే ఖిల (పరిశిష్ట) పురాణమనికూడ చెప్పచున్నారు. ఇందు విష్ణుపర్వమందు శ్రీకృష్ణుని బాల్యక్రీడలు, కంసవధ మొదలగువానియొక్క వర్ణన గలదు.

ఇందువలన హరివంశపురాణము భారతమందు పరిశిష్ట పర్వముగ తరువాత చేర్చబడియున్నట్లు గోచరించుచున్నది.

కావున మహాభారతము 18 పర్వములు మాత్రమే గలిగియు న్నట్లు స్పష్టపడుచున్నది. ఈ క్రింది శ్లోకములు జూడుడు.

శ్లో॥ భవిష్యపర్వ చాప్యుక్తం ఖిలేష్వేవాద్భుతం మహత్।
ఏతత్పర్వశతం పూర్ణం వ్యాసేనోక్తం మహాత్మనా॥
(ఆ-ప-అ2-శ్లో 83)

ఈ ఖిలపర్వము భవిష్యపర్వమనికూడ చెప్పబడుచున్నది. ఇది చాల అద్భుతమైనది. మహాత్ముడగు శ్రీ వ్యాసమహర్షి చే ఈ విధముగ నూరు పర్వములు రచింపబడెను.

శ్లో॥ యధావత్ సూతపుత్రేణ లో మహర్షిణా తతః।
ఉక్తాని నైమిశారణ్యే పర్వాణ్యష్టాదశైవతు॥
(ఆ-ప-అ2-శ్లో 84)

సూతవంశ శిరోమణియగు లోపహర్షణ పుత్రుడు ఉగ్ర శ్రవుడు వ్యాసుని రచన పూర్తియైన తరువాత నైమిశారణ్య క్షేత్రమందు ఈ నూరు పర్వములను పదునెనిమిది పర్వములుగ సంక్షిప్తపరచినట్లు ఋషులతో చెప్పెను.

కనుక ఇపుడు ప్రచారమందున్న మహాభారతము 19 పర్వములుగాక, 18 పర్వములు మాత్రమే కలిగియున్నట్లు స్థిర పడుచున్నది. హరివంశ పురాణము సాధారణముగ 12000 శ్లోక ములు కలిగియున్నది, గీతాప్రెస్ మహాభారత ప్రతియందలి హరివంశము 16000 శ్లోకములు కలిగియున్నది.

శ్లో॥ చతుర్వింశంతి సహస్రీం చక్రే భారత సంహితామ్।
ఉపాఖ్యానై ర్వినా తావత్ భారతం ప్రాహ్యతే బంధైః
ఇదం ద్వైపాయనః పూర్వం పుత్ర మధ్యాపయచ్ఛుకం॥
(ఆ-ప-అ1-శ్లో 102-104)

వ్యాసుడు ముందు తన కుమారుడగు శుకునకు భారతము నధ్యయనము చేయించెను. అపుడు భారతము 24000 శ్లోకములు కలిగియున్నట్లు స్పష్టమగుచున్నది. ఇపుడు ప్రచారమందున్న భారతమందు 18 పర్వములు, 1893 అధ్యాయములు కనుపించు చున్నవి. కాని గీతాప్రెస్ భారతమందు 2118 అధ్యాయములు గోచరించుచున్నవి.

ఈ గ్రంథమునకు క్రమక్రమముగ నామకరణమందుగూడ మార్పుకలిగినది. దీనికి ప్రథమమున "జయ" అను పేరుం డెను; తరువాత "భారతము" అనియు, "మహాభారతము" అనియు ప్రచారము కాసాగెను.

ఈ క్రింది శ్లోకమును గమనింపుడు.

శ్లో॥ ఆకర్ణ్య భక్త్యా సతతం జయాఖ్యం భారతం మహత్।
శ్రీశ్చకీర్తిస్తథా విద్యా భవంతి సహితా స్సదా॥
(స్వ-ప-అ5-శ్లో 49)

ఈ జయాఖ్యమైన భారతేతిహాసమును ఎల్లపుడు భక్తితో వినుచుండువానికి - లక్ష్మి, కీర్తి విద్య సంప్రాప్తింపగలవు.

ఈ యుద్ధమందు సత్యమునకు జయము లభించినందున "జయ" అను పేరును, సాధారణ నామధేయము "భారతము"

అను పేరు కలిగినట్లును సర్వత్రా గోచరించుచున్నది. "మహా భారతము" అను పేరు ఎందుకు కలిగెనో ఈ క్రింద వివరింప బడెను.

శ్లో॥ పురా కిల సురైః సర్వైః సమేత్య తులయా ధృతమ్।
చతుర్భ్యః సరహస్యేభ్యో హ్యధికం యదా॥
తదా ప్రభృతి లోకేఽస్మిన్ మహాభారత ముచ్యతే।
మహత్వే చ గురుత్వే చ ధ్రియమాణం యతోధికమ్॥
(ఆ-ప-అ1-శ్లో 272-273)

ప్రాచీనకాలమందు సమస్త దేవతలు కలిసి, వ్యాసుని దలి ఒక సిబ్బియందు నాల్గువేదములను మరియొక సిబ్బియందు మహాభారతమును ఉంచి తూచిరి. రహస్యోపేతములైన నాల్గు వేదములకంటె బరువైయున్న కారణమున అప్పటినుండియు దీనికి "మహాభారతము" అను పేరు కలిగెను. వ్యాసునందు తూయబడినందున ఈ గ్రంథము - మహత్వమునందు, గౌరవమునందు, గంభీరతయందు వేదములకన్న నధికమైనట్లు స్థిర పడినది.

"జయ" "భారతము" "మహాభారతము" ఈ పేర్లు మూడు ఈ గ్రంథమునకే వర్తించినవి. ప్రథమమున వ్యాసుడు తన కుమారునితోసహా అయిదుగురికి ఈ మహాభారతమును అధ్యయనము చేయించెను. వీరు మహాభారతమును వేర్వేరు సంహితలుగ రచించిరి.

శ్లో॥ వేదా నధ్యాపయామాస మహాభారత పంచమాన్।
సుమంతం జైమిని పైలశుకంచైవ స్వమాత్మజమ్॥
ప్రభుర్వరిష్ఠో వరదో వంశంపాయన మేవచ॥
సంహితాస్తైః పృధక్త్వేన భారతస్య ప్రకాశితాః॥
(ఆ-ప-అ 63-శ్లో-89-90)

సర్వశ్రేష్ఠుడు వరదాయకుడునగు వ్యాసుడు చతుర్వేద ములను పంచమవేదమగు భారతమును - సుమంతునకు, జైమి నికి, పైలునకు, తన పుత్రుడగు శుకునకు, వైశంపాయనుడనగు నాకును అభ్యసింపజేసెను. మిగిలిన వారందరు వేర్వేరుగ మహాభారత సంహితలను రచించిరి.

పై నుదహరించిన అయిదు సంహితులందు ఇప్పుడు ప్రచారమందున్న భారత సంహితకు రచయిత ఎవరో తెలిసి కొనవలసియున్నది. ఇప్పటి మహాభారతము వైశంపాయనుని చేత చెప్పబడుచున్నట్లు ఉదాహరింపబడియున్నందున ఇప్పుడు ప్రచారమందున్న మహాభారతమునకు వైశంపాయనుడే రచ యిత అని చెప్పుట యుక్తియుక్తముగ నుండగలదిని తోచు చున్నది.

(శ్రీ) రాయబహద్దూర్ చింతామణిరావు వైద్య తన మహాభారతటీకయందు ఈక్రింది విధముగ విమర్శించియున్నారు.. "భారతము" "మహాభారతము"గ రూపాంతరములను పొంది యుండెను. ఇట్లంతిమ స్వరూపమును పొందిన గ్రంథమే ఇప్పటి

మన మహాభారతము. ఇట్టి మహాభారతకర్తలు మూలగీతను కూడ ఏమియు మార్పుచేసియుండరని చెప్పజాలను"

(గీ. ర. 524-525)

పై ఉదాహరణలనుబట్టి చూచినయెడల మహాభారత మందు అసాధారణములగు పరివర్తనలు జరిగియున్నట్లు తోచు చున్నది. గీత మహాభారతాంతర్గతమైనదైయున్న కారణమున దాని లక్షణములే గీతకుకూడ సంక్రమింపక తప్పదు.

సాంప్రదాయికమను విషయమును ధర్మరూపమగు అమృతరసమందు కలిపి మతగ్రంథముల ద్వార మానవజాతిచే మతవాదులు త్రాగించియున్నారు. ఇది మానవజాతియొక్క రక్తమందు ప్రవేశించి పేరుకొనిపోయినది; దీనిని వెలువరించుట కష్టసాధ్యమేకాదు, అసాధ్యముగకూడ కాన్పించుచున్నది!

గీతాప్రక్షేపణము- మహాభారతమునకు సంబంధించిన విషయములన్నియు అంతర్భాగమగుటవలన "గీత"కు కూడ వర్తించును. అయినప్పటికి గీతపై భారతీయ విద్వాంసుల అభి ప్రాయముకూడ క్రోడీకరింపవలసియున్నది. గీతాసంబంధమగు సమీక్షలను మూడు వర్గములుగ విభజింపవచ్చును.

మొదటివర్గము- మహాభారతము, గీత కూడ అక్షరశః వ్యాసప్రోక్తమనియు, వీనియందు చేర్పులు, కూర్పులు ఏమియు జరిగియుండలేదనియు ఈ వర్గీయుల అభిప్రాయము; వీరు ధర్మ భీరువులు, పౌరాణికమతావలంబులునైయున్నారు. వీరు వానిని వేదవాక్యములుగ కండ్లుమూసుకొని విశ్వసించుచున్నారు.

వేదములకన్న గీతకే ఎక్కువ ప్రాధాన్యమిచ్చుచున్నారు. వేద విజ్ఞానము ఋషులవలన, బ్రహ్మవలన బహిర్గతమైనదని, గీత స్వయముగ ఈశ్వరముఖతః వెలువడియున్నదని వీరి భావము.

రెండవ వర్గము– మహాభారతమునందువలెనే గీతయందు కూడ కొన్ని అధ్యాయములుగాని, శ్లోకములుగాని ప్రక్షేపణము జరిగియుండునని వారు భావించియున్నారు. ఇందు శ్రీ దయానంద సరస్వతి, 2. శ్రీ చింతామణిరావువైద్య, 3. శ్రీ లోకమాన్య బాలగంగాధరతిలక్ ఇత్యాది ప్రముఖులు గలరు.

మూడవ వర్గము– మహాభారతమందు అన్యప్రక్షేపణ ములవలె గీతకూడ తదనంతర ప్రక్షేపణాంశముగ వాగు భావించుచున్నారు. వారిలో 1. బెంగాల్ ప్రసిద్ధ విద్వాంసుడు బంకించంద్రుడు, 2. డా॥ ఫణిక్కర్, 3. గొప్ప వైదిక సాహిత్యవేత్త పండిత రఘునందనశర్మ ఇత్యాదులు గలరు.

ప్రసిద్ధ సాహిత్యవేత్త, విమర్శకుడు శ్రీ రాంధారీసింహా దినకర్ – "సంస్కృతి కే చార్ అధ్యాయ్" అను తన గ్రంథమందిట్లు వ్రాసియున్నాడు – "గీత మొదట ఉపనిషద్రూపములోనే ఉండియున్నది. కొంతకాలము గతించిన తరువాత బౌద్ధ ధర్మసూత్రములను కొన్నిటిని మేళవించి గీతకు ప్రస్తుతరూపమును సంతరించియున్నారు" ఇది కొంతమంది విద్వాంసుల అభిప్రాయము.

శ్రీ దయానంద సరస్వతి సమకాలికుడగు శ్రీ విద్వాన్ సాధు బాబా బాలకృష్ణ అను ఉత్తరప్రదేశ పండితుడు–

మహాభారతమునకు 32000 శ్లోకములను మాత్రము నిర్ణయించి టీక వ్రాసియుండెను; సమస్త గీతను ప్రక్షిప్తమని భావించి అందు చేర్చలేదు.

శ్రీ దయానందబుషి గీతయందు కొన్ని అధ్యాయను లను, శ్లోకములను ప్రక్షిప్తములని అంగీకరించియుండెను. 1924 సంవత్సరమందు శ్రీ దయానందుడు "కర్ణవాసము" అను ప్రదేశమందు వైదికధర్మోపదేశములను చేయుచుండెను. అప్పుడు లాలా కే సరీలాల్ అనునతడు శ్రీ దయానందునిట్లు ప్రశ్నించెను – "స్వామి! నేను నిత్యము గీతాధ్యయనము చేయుచున్నాను. ఇందుపై తమ అభిప్రాయమును వినగోరుచున్నాను" అని పలికెను. అప్పుడు శ్రీ దయానందుడిట్లు త్తరమిచ్చెను. "గీతయందు వ్యతిసాంప్రదాయకులు అనేక శ్లోకములను చేర్చియున్నారు. 7, 9, 10, 11, 12 అధ్యాయములు పూర్తిగ ప్రక్షిప్తములే! గీతయందు అక్కడక్కడ 17 శ్లోకములు ప్రక్షిప్తములు. మిగిలిన గీతయంతయు పరిశుద్ధమైనదే!"

అయినప్పటికి గీతాగ్రంధమునకు భారతదేశమందే గాకుండ; ప్రపంచమంతటియందు ఇంతటి ప్రాముఖ్యము, ప్రచారము ఎందువలన కలిగినది ? అను ప్రశ్న ఉదయించుచున్నది. కొన్ని వ్యత్యాసములున్నను "గీత" ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కారణములు ఈ క్రింద ఉదహరింపబడుచున్నవి.

(1) గీతారచనయందు విశేషముగ ఉపనిషత్సారమును సమకూర్చియుండుటయే దీనికి మొదటి ముఖ్యకారణము.

శ్లో॥ సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః।
పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతమ్ మహత్॥

"శ్రీకృష్ణుడు అర్జునుని వత్సగజేసి ఉపనిషత్తులను గోవ్రులనుండి గీతారూపమగు పాలను పిండెను" ఇది గీతారచనకే! కనుక గీత కింత మహత్తు, గౌరవము కలుగుటకు ఉపనిషత్తులే కారణభూతములైనవి.

ఇట్టి గోదుగ్ధమందెంత సాంప్రదాయిక రూపమగు నీరు కలిసియున్నదో ఉపనిషద్రసాస్వాదనజేసిన మహోమహులకే తెలియగలదు! నీరు కలిసిన పాలుగూడ తెల్లగనే యుండును; వానికి పాలరుచికూడ చాలవరకుండును; శుద్ధదుగ్ధమందుగల పౌష్టికపదార్థముండకపోవచ్చును. కావున ఉపనిషద్రూపమందున్న గోవులనే శరణుపొందుట శ్రేయస్కరమని శ్రీ రాజేంద్ర పండితుని అభిప్రాయము!

ఉపనిషత్సాహిత్యము సమస్త మతములకు సన్నిహితమైయుండును. కనుకనే ద్వైతాద్వైత విశిష్టాద్వైత మతస్థాపకులగు శంకర రామానుజ మధ్వాచార్యులు, తమతమ మతముల కనుకూలించునట్లు గీతను వ్యాఖ్యానించుకొనియున్నారు. భారతీయ సాంప్రదాయకుల కందరికి అనుకూలమగు సామగ్రి ఇందధికముగ లభ్యమగుచుండును.

(2) భారతీయ విద్వాంసులు సర్వమత సమన్వయమందు విశ్వాసము కలిగియుందురు. హిందూజాతి ఎన్నడు ఒకే మత

మును కలిగియుండలేదు కావున "గీత" అన్నిమతములకు అనుకూల గ్రంథమగుచున్నది. "గీత" బహుజన వ్యాపకమగుట కిదియొక కారణము.

(3) భగవద్గీతకు మునుముందు వ్యాఖ్య వ్రాసినది శ్రీ శంకరాచార్యులని తెలియుచున్నది. తదనంతరము గీతను ప్రస్థానత్రయమందుచేర్చి శ్రీ శంకరుడు దీనికొక ప్రముఖస్థాన మిచ్చియున్నారు. భగవద్గీతకు ప్రతి అధ్యాయాంతమున- "ఇది భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే కృష్ణార్జున సంవాదే" అని సంకల్పము చెప్పబడియున్నది. ఈ విధముగ భారతమున అధ్యాయాంతమందు సంకల్పము కనుపించుట. ఇందువలన గీత ప్రక్షిప్తమైనట్లు గోచరించుచున్నది. ఈ సంకల్పమువలన గీత ఉపనిషత్సారమైనట్లు తెలియబడుచున్నందున బహుజనవ్యాప్తికి ఇదియొక కారణమైయున్నది.

(4) ప్రాచీన భారతీయ సాహిత్యమందు భగవద్గీతకు మించి గౌరవస్థానమున్నమాట వాస్తవమే! ఒక శతాబ్దమునుండి దీని గౌరవము పరదేశములందుగూడ బాగుగ విస్తరించినది. దీనికి చాలవఱకు కారణము "మిసెస్ అనిబిసెంటు" అయి ఉన్నది. ఈమె డెబ్బది సంవత్సరముల క్రితమే గీతాశ్లోకములను ఇంగ్లీషులోనికి అనువదింపజేసి పాశ్చాత్య దేశములలో ప్రచురపర్చియుండెను. "థియోసాఫికల్ సొసైటీ" ఈ కార్యక్రమమును చేపట్టెను. గీతాప్రచారమునకు ఇదికూడ నొక కారణము.

(5) లోకమాన్య బాలగంగాధరతిలక్ "గీతారహస్య

ము"ను, మహాత్మాగాంధి "అనాసక్తి" అగు పేర గీతను రచించిన తరువాత రాజకీయవేత్తలయందు విప్లవాత్మకముగ గీతయందభిరుచి అభివృద్ధి కాసాగినది. ఈ రీతిగ ఈ శతాబ్దమందు సాధువులయొక్క, ప్రాచీన పండితులయొక్క పరిధినుండి విడివడి "గీత" విస్తృతాకాశమందు ప్రకాశింపసాగెను.

(6) సాహిత్యదృష్టితో చూచినప్పటికి గీతను ఒక సుందరమగు కావ్యముగ నంగీకరింపకతప్పదు. మధురమగు భాష, మనోహరమగు శైలి గీతకు ముఖ్యలక్షణములు! మతవ్యామోహము లేని సజ్జనుడగు సాహిత్యవేత్తకు ఈ గీతయను సాహిత్యోద్యానవనమందు సానందముగ విహరింపగలుగు నవకాశము చిక్కగలదనుటలో సంశయము లేదు!

ప్రతి తత్వవేత్త ఈ గీతాదర్పణమందు తన ప్రతిబింబమును స్పష్టముగ చూడగలుగుచున్నాడు. "గీత" ప్రపంచ ప్రఖ్యాతిని పొందుటకు పై నుదహరింపబడిన విషయములు ముఖ్యకారణములు గావచ్చును.

శ్రీ రాజేంద్రపండితుడు గీతోపదేశము రణరంగమున జరిగియుండదను వాదమును బలపర్చుటకు మహాభారతమందలి ఈ క్రింది హేతువుల నుదహరించుచున్నాడు. ఇది సుజనగ్రాహ్యముగా గోచరించుచున్నవి.

(1) యుద్ధరంగమందు అర్జునునకు విషాదముదయించిన కొద్దిక్షణములకు పూర్వము యుధిష్ఠిరార్జునులు కౌరవసైన్యశక్తిని, భీష్మునిని వ్యూహరచనా పాటవమును సమీక్షించు నిమి

త్తము యుద్ధరంగమునకు బయలుదేరిరి; అప్పుడు తన విజయమును శంకించినవాడై యుధిష్ఠిరుడు అర్జునునితో ఇట్లు పలికెను.

శ్లో॥ వ్యూహం భీష్మేతి చాభేద్యం కల్పితం ప్రేక్ష్య పాండవ
అక్షోభ్యేమివ సుప్రేక్ష్యా వివర్ణోఽర్జున మబ్రవీత్॥
ధనంజయ కధం శక్య మస్మాభిర్యోద్ధు మాహవే।
ధార్త రాష్ట్రైర్మహాబాహో యేషాం యోద్ధా పితామహః॥

శ్లో॥ అక్షోభ్యోఽయమభేద్యశ్చ భీష్మేణామిత్ర కర్షణా।
కల్పితః శాస్త్రదృష్టేన విధినా భూరివర్చసా॥
తే వయం సంశయం ప్రాప్తాః ససైన్యాః శత్రుకర్షణ।
కధ మస్మాన్మహా వ్యూహా దుత్తానం నో భవిష్యతి॥

(భా. ప. అ. 21 శ్లో. 2–5)

గొప్ప బాహువులుగల ఓ అర్జునా! ప్రధాన యోధుడగు భీష్మపితామహుడు ధార్తరాష్ట్రుల పక్షమున యుద్ధభూమియందు నిలిచియున్నప్పుడు వారితో మనమెట్లు యుద్ధము చేయగలుగుదుము? మహాతేజస్వియగు, శత్రుసూదనుడగు భీష్ముడు, సశాస్త్రీయముగ అభేద్యమగు వ్యూహరచన చేసియున్నాడు. శత్రునాశకుడవగు నోఅర్జునా! సేనాసమేతముగ మనమందరము ప్రాణసంకటస్థితికి చేరియున్నాము. ఇట్టి మహావ్యూహమునుండి మనముద్ధరింపబడుటెట్లు?

దానిపై అర్జునుడు యుధిష్ఠిరునితో – "మనది ధర్మ

పక్షము; పైగా శ్రీకృష్ణుడు మన పక్షమందుండి మన జయ మును కాంక్షించుచున్నాడు" అని అగ్రజునకు ధైర్యము జెప్పెను.

శ్లో॥ తస్యతే నవ్యధాం కాంచిదిహ పశ్యామి భారత।
యస్యతే జయమాశాస్తే విశ్వభుక్ త్రిదితేశ్వరః॥
(భీ. ప. అ. 21–శ్లో 17)

"కనుక ఓ భారత! ఇందునుగురించి ఎవ్విధమగు వ్యధను, చింతను పొందవలసిన పనిలేదు. ఎందువలన? విశ్వంభరుడగు భగవానుడు శ్రీకృష్ణుడు మనకై విజయమును కాంక్షించు చున్నాడు"

అపుడు అర్జునప్రేరితుడైన యుధిష్ఠిరుడు యుద్ధోన్ము ఖుడై తన వ్యూహరచన చేయప్రారంభించెను. దీని వర్ణన భీష్మ పర్వమందలి 22వ అధ్యాయమునందు గలదు.

ఈ విధముగ యుధిష్ఠిరునకు ధైర్యముచెప్పిన అర్జునుడు కొద్దిక్షణములలో మోహావశమున, ఉభయసేనామధ్యమున యుద్ధవిముఖుడై, పిరికివానివలె అస్త్రసన్యాసము చేయుట ఊహాతీతమైనది. అర్జునునివంటి మహాశూరుని విషయమై ఇది అసంభవముగ శోచకమానదు.

(2) అదేరోజున పాండవులు యుద్ధరంగమునకు ప్రయాణ సన్నద్ధులైయున్న సమయమున – దుర్యోధనుడు శకుని పుత్రుడగు "ఉలూకుని" పాండవులవద్దకు తన దూతగ పంపి ఇతని ద్వార "ఎట్టి పరిస్థితిలోను సంధి అంగీకరింపబడదనియు, అవ

శ్యము యుద్ధము అనివార్యము" అని ఒక సందేశమంపెను. దానిని విని అర్జునుసితోసహా పాండవులందరు ఆగ్రహావేశులై యుద్ధమున కుద్యుక్తులైరి.

ఇదిగాక కుంతీదేవి శ్రీకృష్ణునిద్వార ప్రత్యేకముగ ఇదే సమయమున అర్జునునకు – "శూరుడవై యుద్ధరంగమున శత్రు సంహారముచేసి నీ కర్తవ్యమును నెరవేర్పుము" అని సందేశ మంపెను. తదనంతరము కొద్దిక్షణములలో యుద్ధరంగమున అర్జునునకు విషాదముదయించుట సంభవమా ?

(3) "అర్జున ఉవాచ" –

శ్లో॥ కథం భీష్మ మహం సంఖ్యే ద్రోణంచ మధుసూదన।
ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరి సూదన॥
(గీ. అ. 2–శ్లో–4)

ఓ మధుసూదన! ఈ రణభూమియందు భీష్మపితా మహునితోను, ద్రోణునితోను ఈ బాణములచే ఎట్లు యుద్ధము చేయగలవాడను. ఓ అరిసూదన! వారిద్దరు నాకు పూజనీయులు గదా ?

తన స్వజనముతోను, ఆప్తులగు భీష్మద్రోణ కృపాచార్యాదులతోను యుద్ధముచేయు శక్తితో అర్జునునకు విషాద ముదయించుట కల్పనమని తోచుచున్నది.

ఈ అర్జునుడే విరాటపర్వమందు ఉత్తరగోగ్రహణ యుద్ధసమయమున పై నుదహరింపబడిన గురుజనులతోను, ఆప్తులతోను, భీష్మద్రోణులచేతను ఘోరమగు యుద్ధమును

చేసియుండెను. ఈ యుద్ధమందు కౌరవులేగాకుండ ద్రోణకృపా చార్యాదులు అర్జున తీక్షణత్వమును సహింపజాలక పలాయ నము చిత్తగించియుండిరి. ద్రోణుడా యుద్ధరంగమున శాంతపడి మూర్ఛితుడయ్యెను. అట్టి మహావీరుడగు అర్జునుడు యుద్ధరంగ మున మోహితుడగుట సంభవమేనా ?

శ్లో॥ తతఃకృప ముపాదాయ విరధంతే నరర్షభాఃl
అపజహ్నా మహావేగా కుంతీపుత్రా ద్ధనంజయాత్॥
(వి. ప. అ. 57_శ్లో_43)

ఇంతలో నరశ్రేష్ఠులగు సైనికులు కుంతీపుత్రుడగు ధనం జయునకు భయపడి, రథహీనుడగు కృపాచార్యుని వేగముగ యుద్ధరంగమునుండి తొలగించిరి.

శ్లో॥ సతు లబ్ధ్వాంతరం తూర్ణమపాయా జ్జితనైర్హ్రాయైఃl
భిన్నవర్మ ధ్వజాః సూరో నిక్కృత్తఃి పరమేశంభిఃll
(వి. ప. అ. 58_శ్లో_76)

అర్జునుని ఉత్తమ బాణ పరంపరతో ద్రోణుని ధ్వజకవ చములు భిన్నాభిన్నమైపోయినవి. అతడు బాగుగ గాయపడెను. అవకాశము దొరకగనే వెగవంతమైన గుఱ్ఱములు నిదలించి అక్కడనుండి పారిపోయెను.

శ్లో॥ అధైనం దశభిర్బాణైఃి ప్రత్యభీద్యత్ స్తవాంతరేl
యతమానం పరాక్రాంత కుంతీపుత్రో ధనంజయఃll
(వి. ప. అ. 64_శ్లో_47)

తదనంతరము కుంతీపుత్రుడగు ధనంజయుడు విజయ కాంక్షతో పరాక్రమవంతుడగు భీష్మునిపై పదిబాణములు ప్రయోగించి బాగుగ గాయపర్చెను.

మహాభారతమందు త్రోసిపుచ్చజాలని ఇట్టి అనేక ప్రమాణము లున్నప్పటికి, అర్జునునకు స్వాజన యుద్ధభీతినలన- చేతులు వణికినవని, నోరు ఎండిపోయినదని, గగుర్పాటు కలిగినదని, చేతినుండి గాండీవము జారినదని కల్పించి వాయుట, ఒక మహా శూరుని అపహాస్యము చేయుటయే యగును!

ఇందువలన గీతోపదేశమును మతసాంప్రదాయకులు తను మత సంతుష్టికొరకు కృష్ణార్జున సంవాదరూపమున, అనంతరము మహాభారతమందు సమకూర్చియుందురని భావింపనలసి యున్నది.

భగవద్గీతవంటివి మహాభారతమందలి అశ్వమేధ శాంతి పర్వములందు - "శంపాగీత" "షడ్జగీత" "పరాశరగీత" "హంసగీత" "బ్రహ్మగీత" ఇట్టి లఘుబ్రహ్మగీతలనేకములు ప్రక్షిప్తము చేయబడినట్లు గోచరించుచున్నవి.

కావున మహాభారత భగవద్గీతా గ్రంథముల యందనేక ములగు అసత్యాసంగతగాథలు, విషయములు ప్రవేశించి మూలగ్రంథముల పవిత్రతను పాడుజేసినవి. అట్టి అసందర్భ విషయముగూడ వ్యాసప్రోక్తములనియే ప్రచురితమైనవి. మహాత్ముడు, తత్వవేత్తయగు వేదవ్యాసుడట్టి ప్రకృతి విరుద్ధములు, అసంభవములు నగువానిని ఎన్నడు రచించియుండడు.

పై గ్రంథములందు ప్రక్షిప్తములుగానట్టి వ్యాసప్రోక్త విషయములు స్వచ్ఛములై, ఆత్మవిద్యా ప్రబోధకములుగనే యుండును. కనుకనే ఏరి ఏరి ప్రక్షిప్తములీ గ్రంథమందు గుర్తింపబడి నిశితముగ విమర్శింపబడినవి. ప్రక్షిప్తములన్నియు అన్యాపదార్థములేగదా!

భగవద్గీతా మహాభారతములు బాగుగ పరిశోధింపబడి చాలవఱకు ప్రక్షిప్తములైనవేయని స్థిరపర్చబడినది. ఇట్లు ప్రక్షిప్తములైనందువలన గలుగు నష్టమేమి? వానియందుకూడ ననుకూలించు మంచి విషయముల గ్రహింపవచ్చునుగదా? అను ప్రశ్నలు ఉదయించుచున్నవి.

వేదవ్యాసునివంటి మహాత్ములు వేదాంతవిశారదులు ప్రపంచమున చాల అరుదుగమాత్రమే అవతరించుచుందురు. "బ్రహ్మసూత్రములు" "ఉత్తరమీమాంస" వ్యాసునిచే రచింపబడిన ప్రక్షిప్తములుగాని పరిశుద్ధ గ్రంథములు. బ్రహ్మసూత్రములకు శ్రీ శంకర భగవత్పాదులు ప్రస్థానత్రయమందు ఒక ప్రముఖస్థాన మిచ్చియుండెను. ఉత్తరమీమాంసకుండ షడ్దర్శనములయందు ఒక ప్రముఖస్థానము సూక్రమించియున్నది. ఇదియే "వేదాంత దర్శనశాస్త్రము ఈ గ్రంథద్వయమందును, ఉపనిషత్తులయందును స్వచ్ఛమగు వేదాంతసార మెల్లపుడు స్రవించుచుండును. వేదవ్యాసుడు వేదాంతశాస్త్రమందు గొప్ప రచయిత, పండితుడు, సాధకుడుగూడనైయున్నాడు. వేదవ్యాసునకు వేదాంతము అభిమానశాస్త్రము "వేదానాం అంతః

వేదాంతః" అని వ్యుత్పత్తి. అనగ వేదములతోసహా వేదాంగ ములయందు "ఉపనిషత్తులు" అంతమందు గలవు. వానియందు స్వచ్ఛమగు బ్రహ్మనిద్య వర్ణింపబడినది. ఈ కారణమున బ్రహ్మ విద్యకు పర్యాయపదముగ "వేదాంతము" అని ప్రసిద్ధిగాంచినది.

వేదవాఙ్మయమందు– చతుర్వేదములు, బ్రాహ్మణములు ఆరణ్యకములు, ఉపనిషత్తులు అని చతుర్విభాగములు గలిగి యున్నవి. సూత్రగ్రంథములుగూడగలవు. వానికి వేదవాఙ్మయ మందు పై నుదహరించిన వానికున్న ప్రాముఖ్యము లేదు! ఎందువలన? పై చతుర్విభాగములందలి విషయములే అత్యంత సంక్షిప్తముగ, సారగర్భితముగ, అధ్యయనానుకూలముగ గద్య రూపమున సూత్రగ్రంథములందు వివరింపబడినవి. కావున సూత్రగ్రంథములకు వేదవాఙ్మయమందు అందొక స్థానము సంకల్పింపలేదు.

బ్రాహ్మణగ్రంథములు– బ్రహ్మను ప్రతిపాదించునవి కావున బ్రాహ్మణములని చెప్పబడినవి. వానియందు యజ్ఞాను స్థానము విపులముగ వర్ణింపబడినది; వేదములయందలి కఠిన ప్రదేశములకు భాష్యముకూడ దీనియందు వివరింపబడినది. ఇది చాలవఱకు గద్యాత్మకములు. ముఖ్యముగ నివి కర్మకాండ సంబంధించిన గ్రంథములు.

ఆరణ్యకములు– "అరణ్యే భవం ఆరణ్యకమ్" వీనియొక్క రచన, అధ్యయనము అరణ్యములందు జరిగియుండెను. కావున వీనికీపేరు కలిగినది. భారతీయ పరంపరానుగతముగ వేదములు,

బ్రాహ్మణములు, ఆరణ్యకములు, కర్మకాండ ప్రతిపాదకములు.

ఉపనిషత్తులు– "ఉపనిషద్యతే ప్రాప్యతే బ్రహ్మవిద్యా అనయా ఇతి ఉపనిషత్" లేక– ఉప=సమీపమందు ని=రహస్యముగ సద్=కూర్చుండుట అని వ్యుత్పత్తి. అనగ – రహస్యముగ సమీపమందు కూర్చుండి వానివలన బ్రహ్మవిద్య అభ్యసింపబడినది, కనుక "ఉపనిషత్తులు" అను పేరు కలిగినది.

వేదములు, బ్రాహ్మణ గ్రంథములు గృహస్థాశ్రమధర్మములను, ఆరణ్యకములు వానప్రస్థాశ్రమ ధర్మములను ప్రబోధించుచున్నవి. ఉపనిషత్తులు కేవలము జ్ఞానకాంతను ప్రబోధించుచున్నవి. జీవితములో చతుర్థాశ్రమముగు సన్యాసమునకు ఇని అనుకూలమైయుండును. రహస్యమయమగు పరావిద్యను, గురు సన్నిధిని కూర్చుండి అభ్యసింపదగినవి ఉపనిషత్తులు! ఇరిమి వల్లనే వీనికీపేరు వచ్చినది.

సూత్రగ్రంథములను విడిచినపుడు– వేద, బ్రాహ్మణ ఆరణ్యక గ్రంథములలో ఉపనిషత్తులే అంతమందుండి యున్నవి. ఉపనిషత్తులలో కేవలము బ్రహ్మవిద్యా విషయమే ఉండియున్న కారణమున "ఉపనిషత్తు"కు "వేదాంతము" అను పేరు వాడుకలోనికి వచ్చినది.

కనుకనే "వేదాంతము" "ఉపనిషత్" అను పదములు బ్రహ్మవిద్యకు సమానార్థకములై పోయినవి! సంస్కృతాభిధాన గ్రంథములందుకూడ "ఉపనిషత్" అను పదమునకు– వేదాంత శాస్త్రం, బ్రహ్మవిద్య, తత్త్వమ్అని అర్థము చెప్పబడియున్నది.

వ్యాసునకు "వేదవ్యాసుడు" అను పేరుకూడ గలదు. "వేద" అనునది ఒక బిరుదు అయి ఉండవలెను. "వేద" అను పదమునకు వేదాంతము అని అర్థము. "వేదాంతము" అను పదమునకు "ఉపనిషత్" అను అర్థముకూడ గలదు! గొప్ప ఉపనిషత్తత్వవేత్త అయిఉన్న కారణమున వ్యాసునకు "వేదవ్యాసుడు" అను నామము కలిగియుండవచ్చును. వ్యాసుడు ఉపనిషత్తులకు రచయిత కాకపోయినప్పటికి అనుభవజ్ఞుడైన గొప్పభాష్యకారుడు, సాధకుడు అని తెలియుచున్నది.

వ్యాసప్రోక్తములని చెప్పబడు మహాభారత భగవద్గీతలు, అష్టాదశ పురాణములు, సాంప్రదాయికవాదులచే ప్రక్షిప్తము చేయబడకయు డిసచో- ఉపనిషద్బ్రహ్మసూత్ర వేదాంతదర్శన శాస్త్రములనెడి విమర్శకు తావులేకుండ ప్రకాశించుచుండెడివి.

పై గ్రంథములయందలి ప్రక్షేపణములవలన ఆర్యజాతి తత్త్వశాస్త్రమార్గమును విడిచి, కంటకావృతమగు మారు త్రోవనుబట్టి అంధప్రాయమైపోయినది. కావున మహాభారత భగవద్గీతలయందలి ప్రక్షేపణములను కొందరు తత్త్వవేత్తలు ఇంత నిశితముగ విమర్శింపవలసివచ్చినదని భావింపవలయును.

ప్రతి మతమునకు ఒక్కొక్క మూలగ్రంథముండి యున్నది. "వేదములు" "ఖురాన్" "బైబిలు" ఇత్యాదులు ఈ కోవకు చెందినవియే! ప్రతి మతవాది తన మతగ్రంథములను ఈశ్వరప్రోక్తమని విశ్వసించుచున్నాడు; దీనియందలి ప్రత్యక్షరము సత్యమని అంగీకరించుచున్నాడు. పై మూలగ్రంథములు

కాకుండ ప్రతిమతమునందు వానికి అనుబంధ గ్రంథములను తదనంతర సాంప్రదాయకులు రచించియున్నారు. వానిని మూల గ్రంథములవలెగాక ప్రజాసామాన్యమున కర్థమగునట్లు కాల్పనిక విషయములతో, మనోరంజకముగ రచించియున్నారు. మన పురాణ వాఙ్మయము మీకోవకు చెందినదే!

సుఖమయ జీవితమునకు ధనాధికారములకన్న స్వతంత్రత ముఖ్యావసరమైయున్నది. స్వతంత్ర దేశము, స్వతంత్రజాతి. స్వతంత్రబుద్ధి మాత్రమే నిజమగు జ్ఞానము నుత్పత్తిచేయగలుగు చున్నది! స్వతంత్రకు మారుపేరే ముక్తి! సాధారణముగ మాన వుడు కొన్ని నూతన విషయములను గ్రహించుటకు, కొన్ని సత్యస్వతంత్ర సిద్ధాంతములను ధారణ చేసికొనుటకు మాత్రమే గ్రంథముల నధ్యయనము చేయుచుండును. అట్టి స్వతంత్ర సిద్ధాంత సంపాదనార్థము ఉపనిషదాది సద్గ్రంథములను అధ్యయనము చేయవలసియున్నది.

నిష్పక్షపాతముగ తన తర్కబుద్ధి నుపయోగించి, పై గ్రంథములయందలి మంచిని గ్రహించి, అసంగత విషయములను విమర్శించిన వానిని సాంప్రదాయకులు "నాస్తికుడు" అని పిలుచుచున్నారు. కాని వీరికి నిజమగు నాస్తికుడెవడో తెలియదు!

ఇపుడు ప్రపంచమందలి మానవజాతి అత్యధిక శాతము ఏదో ఒక మతమునకే చెందియున్నది. ఒక మతస్థుడు ఇతర సమస్త మతస్థులను నాస్తికులని భావించుచున్నాడు. ఇది

సామాన్యముగ మానవ సహజము! ఈ దృష్టితో చూచిన యెడల ప్రపంచమందలి సమస్త మతవాదులు నాస్తికులేయగు చున్నారు! ఇంచువలన నిజమగు ఆస్తికుడెవడో, నాస్తికుడెవడో తెలిసికొనుట కష్టసాధ్యమగుచున్నది. సాధారణముగ "ఆస్తికుడు" కాసివాడు "నాస్తికుడు" నిజమగు ఆస్తిక నాస్తికు లెవరో విమర్శించుకొందము.

మనుస్మృతియందు– "నాస్తికో వేదనిందకః" అని ఒక ప్రమాణమున్నది. వేదముల నిందించువాడు నాస్తికుడని దాని భావము. "వేదః" అను పదమునకు–"వేదములు" "వేదాంత శాస్త్రము" "ఉపనిషత్తులు"అను అర్థములుగలవు. ఉపనిషత్తుల యందు నిజమగు వేదాంతము, బ్రహ్మవిద్య వర్ణింపబడినది. ఇట్టి ఆత్మ తత్వప్రబోధకములగు ఉపనిషత్తులను, అందలి తత్వమును నిందించువాడు "నాస్తికుడు" అని భావము. నాస్తిక శబ్దము నకు వ్యుత్పత్తిని గమనింపవలసియున్నది. "నాస్తి పరలోక ఈశ్వరోవేతి మతిర్యస్య స నాస్తికః" "వేదా ప్రామాణ్య వాదాచ"

•పరలోకము, ఈశ్వరుడు లేడను బుద్ధిగలవాడు నాస్తికుడు; ఉపనిషత్ప్రమాణముల నంగీకరింపనివాడుకూడ నాస్తికుడే!

ఇపుడు పరలోకమనగ నేదియో తెలిసికొనవలసియున్నది– మన పురాణములందు చెప్పబడినట్లు స్వర్గనరకములుగల పరలోకము, వైతరిణీనది ప్రవహించు పరలోకము, ఇంద్రాది దేవతలు

రంభాసంభోగమున్న పరలోకము, మహిషవాహనుడై విహరించు యమధర్మరాజుగల పరలోకము లేనేలేదు!

యముడు, యమదూతలు మనోమయ కల్పితములు! మరణానంతరము జీవునకు స్థూలశరీరముతో సంబంధము విడిపోవుచున్నది. మనోమయమై యున్నంతన జీవుని - యముడు, యమదూతలు బంధింపజాలరు! ఒకవేళ అట్లు జరిగినయెడల అది కల్పిత యముడు, యమదూతలవలన మాత్రమే జరిగియుండునని భావింపవలసియున్నది.

సూక్ష్మదర్శక యంత్రము అతి సూక్ష్మాణువునుకూడ చూపగలుగుచున్నది. "జీవుడు" ఊహింపజాలనంతటి సూక్ష్మాతి సూక్ష్మ పదార్థము; కనుకనే దానిని యంత్రముకూడ చూపజాలకపోవుచున్నది. ఇపుడు నిజమగు పరలోక మెట్లుండునో నిర్ణయింపవలసియున్నది.

మరణాంతరమేమి జరుగును? అపుడెట్టి శరీరము లభించును? జీవుడెట్టిలోకమందుండును? ఈ ప్రశ్నలకు మనము నిజమగు సమాధానమును పొందినయెడల మరణానంతరం పరలోక మెట్లుండునో తెలియగలదు.

సాధారణముగ పై ప్రశ్నలకు సమాధానము స్వప్న ప్రపంచమే యీయగలుగుచున్నది. ఎందువలన?- స్వప్నమందు కూడ ఈ స్థూలప్రపంచముతోను, స్థూలశరీరముతోను జీవుని యొక్క సంబంధము విడిపోవుచున్నది.

"జీవుడు" "ఆత్మ" ఎన్నడును శరీరరహితముగ నుండ జాలడు. దీనికికూడ సరియగు సమాధానము స్వప్నమే చెప్ప గలుగుచున్నది. జీవుడు స్వాప్నావస్థలోనికి ప్రవేశించినపుడు, ఈ స్థూలశరీరసంబంధముకూడ విడిపోవుచున్నది. అపుడు జీవుడు ఈ స్థూలశరీరము నుపయోగించుకొనడు. ఇట్టి స్థితిలోకూడ "జీవుడు" కరచరణాద్యవయవములు, ఇంద్రియములుగల మరి యొక శరీరమును ధరించియేయుండును. ఈ స్వప్నశరీరము స్థూల శరీరమంతటి పరిమాణమును కలిగియున్నను, సమీపమందుగల మరియొక వ్యక్తి సూక్ష్మదర్శక యంత్రముతో చూచినను గోచరింపకయుండును. సూక్ష్మశరీరమునేకాదు, స్వాప్నావస్థయం దలి సూక్ష్మలోకమునుకూడ ఇతరుడెవడు చూడజాలడు. "జీవుడు" స్వప్నమందు ఒక సర్పమునుచూచెను; స్థూలప్రపంచ మందలి సర్పమును చూచినప్పటివలెనే అపుడుకూడ భయ పడును. తాను స్వప్నలోకమందున్నట్లు జీవునకు తెలియ కుండును.

మరణానంతరము సూక్ష్మలోకమందు "జీవుడు" మనో మయుడైయున్న కారణమున, పాపపుణ్య కర్మలయొక్క ఫలి తములను మానసికముగనే అనుభవించుచుండును. జీవుడు స్థూలప్రపంచమందాచరించిన కర్మలయొక్క సంస్కారము మనోమయుడైయున్న కారణమున సూక్ష్మలోక (పరలోక) మందుకూడ అనుభవించితీరవలసియేయుండును. పాపపుణ్యాకర్మల యొక్క సంస్కారములు మరణానంతరముకూడ జీవుని అనుస

దించియే యుండును. మరణానంతర పరలోకమనగ నిదియే! ఇట్టి పరలోకము నంగీకరింపనివాడు నాస్తికుడు. ఇతడు పునర్జన్మను. కర్మఫలమునుగూడ నంగీకరింపడు; మరణానంతరము "జీవుడు" వాయునిలీనమైనట్లే భావించును.

ఇపుడు ఈశ్వరుడన నెవడో తెలిసికొనవలసియున్నది, ఈశ్వరు నంగీకరింపనివాడుకూడ నాస్తికుడే!

సర్వభూత హృదయాంతర్గతమైయున్న ఆత్మయే ఈశ్వరుడు. మతవాదులు భావించునట్లు ఆత్మకన్న వేరగు ఈశ్వరుడు లేడు! గీతాశ్లోకమును చూడుడు—

శ్లో॥ ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥
(గీ. అ. 18–61)

ఓ అర్జునా! ఈశ్వరుడు సర్వప్రాణులయొక్క హృదయ ప్రదేశములందుండియున్నాడు. ఇతడే తన సంకల్ప వికల్పరూప మగు మనస్సుతో, శరీరరూపియగు యంత్రమందారూఢుడై సమస్త ప్రాణులను జీవరూపియగు ఈశ్వరుడే త్రిప్పచున్నాడు; నాట్యమాడించుచున్నాడు. జీవుడున్నపుడే ప్రాణుల శరీరము చైతన్యవంతమై నడుచుచున్నది; తిరుగుచున్నది; గంతులిడు చున్నది; జీవుడు వెడలిపోయినతరువాత శరీరము మృతమై జడ ప్రాయమగుచున్నది. కావున ఈశ్వరుడనగ సర్వభూతాంతర్గతు డగు ఆత్మయే!

ఈ క్రింది శాస్త్రప్రమాణమునుగూడ గమనింపుడు.

"ఈశ్వర స్వరూపం బ్రహ్మశబ్దే ద్రష్టవ్యం"

బ్రహ్మశబ్దమందే ఈశ్వర స్వరూపమును చూడదగియున్నది.

"అయమాత్మా బ్రహ్మ" అను మహావాక్య ప్రమాణాను సారము ఈ ఆత్మయే బ్రహ్మ!

ఇట్టి సర్వభూత హృదయాంతర్గతుడైన ఆత్మస్వరూపియగు ఈశ్వరు నంగీకరింపనివాడు నిజమగు నాస్తికుడు! ఆత్మకన్న వేరుగ మతవాద ప్రతిపాదితమగు ఈశ్వరుని అంగీకరించువాడు కూడ నాస్తికుడే! భారతము దలి మరియొక శ్లోకమును గమనింపుడు–

శ్లో॥ ప్రజ్ఞానాశాత్మకో మోహస్తథా ధర్మార్థ నాశకః।
తస్మాన్నాస్తికతాపైవ దురాచారశ్చ జాయతే॥
(మ. భా. 12–123–15)

మానవునకు నిశ్చయాత్మక బుద్ధినాశముతోకూడిన మోహముదయించినప్పుడు, పుణ్యప్రయోజనములు నశించి, నాస్తికత్వ దురాచారములు ప్రబలుచున్నవి. కావున నిశ్చయాత్మక తర్కబుద్ధి లేనికారణమున మోహముదయించినవాడు నాస్తికుడు! పుణ్యప్రయోజనముల నశింపజేయువాడు నాస్తికుడు! ఇట్టి నాస్తికతవలన దురాచారములు పెరిగి జాతిని నిర్వీర్యము జేయుచుండును!

ఆత్మవిదులగు యోగీశ్వర శ్రీ శివమని నిజమగు ఆస్తిక

నాస్తికులయొక్క నిర్వచనమును ఈ క్రింది విధముగ చక్కగ వివరించియున్నారు చూడుడు!-

"ఆస్తిక" శబ్దము "అస్తి" అనుదానినుండి రూపొందించినది. సంస్కృతమందు "అస్" (TO BE) అను ధాతువు గలదు. ఇంగ్లీషునందలి క్రియ 'టు బి' కి సరియగు అర్థమును సంస్కృత "అస్" ధాతువు ఇచ్చుచున్నది. ఈ "అస్" ధాతువునుండి "అస్తి" "ఆస్తిక" అను శబ్దములు పుట్టుచున్నవి. "అస్తి" (ఉన్నదని) అంగీకరించువాడు "ఆస్తికుడు" "నాస్తి" (లేదు)ని అంగీకరించువాడు "నాస్తికుడు" ఈ అస్తి యొక్క తత్వము చాల నిగూఢమైయున్నది. ఎందునలన?- ఆస్తికనాస్తిక నిర్ణయము, దీని తత్వవిమర్శయందే ఆధారపడియున్నది.

ఇపుడీ "అస్తి" (ఉన్నది) యందే నిగూఢ తత్వముండియున్నదో గమనింపవలసియున్నది. కనుక ఈ నిర్వికార అస్తిత్వమందు, ఈ నిర్ద్వంద్వ అస్తిత్వమందు ఒకానొక నిగూఢ తత్వము అవశ్యము ఇమిడియుండవలెను. అస్తియే అస్తిత్వము అస్తిత్వమునకు ఇంగ్లీషులో Existance అని యందురు. ఈ "ఎగ్జిస్టెన్స్" శబ్దమునకు ఇంగ్లీషు శబ్దకోశమందు "లైఫ్" "బీయింగ్" (Life, Being) అని అర్థము వ్రాయబడియున్నది. "అస్తి" లేక "అస్తిత్వము" నకు అర్థము ఇంగ్లీషులో "ఎగ్జిస్టెన్స్" అయిడున్నది. "ఎగ్జిస్టెన్స్"కు "లైఫ్", "లైఫ్"కు "స్పిరిట్" అని అర్థము చెప్పబడియున్నది. "స్పిరిట్" "ఆత్మ"

సమానార్థకములైయున్నవి. కనుక నిగూఢమగు "అస్తిత్వము" నకు అర్థము ఆత్మయే!

కావున తన ఆత్మను– అమరమని, అజరమని, అనాదియని, అవినాశియని, సత్యమని, స్వతంత్రమని అంగీకరించుట అస్తిత్వము, తన ఆత్మను– పరతంత్రమని, వినాసయని, అసత్యమని, నాశవంతమని అంగీకరించుట నాస్తికత్వమునైయున్నది.

ఉపర్యుక్తానుసారము అస్తిత్వమునకు తాత్పర్యము "ఆత్మ" యని ఎందుకు చెప్పనలసివచ్చినదో సంతృప్తికరముగ నిర్వచింపనలసియున్నది. దానికి కారణము లేకపోలేదు!

"మేమున్నాము", "నేనున్నాను", "వాడున్నాడు" అను అనుభవమును పొందునది, చెప్పునది, తెలిసికొనునది ఆత్మయే! దేనియందు (Life) జీవనముండదో, ఎక్కడ ఆత్మయుండదో ఎక్కడ జీవుడుండడో అక్కడ పై అనుభవముండదు. కావున ఈ అనుభవమును పొందునది "శీత్" అగునది ఆత్మయే! జడపదార్థమునకు "నేనున్నాను" అను జ్ఞానముండదు. ఈ కలమునకు కాగితమునకు, కుర్చీకి ఇట్టి అస్తిత్వజ్ఞానముండదు. ఇట్టి జడవస్తువులయొక్క అస్తిత్వము కూడ మన ఆత్మయందే విహితమైయుండును. కలము తన్ను తాను కలమని గుర్తింపజాలదు. మన చేతియందున్న కలమును మన ఆత్మ గుర్తించుచున్నది; జడపదార్థమునకు అస్తిత్వజ్ఞానముండదు. కేవలము సజీవ ప్రాణియే తన్ను తాను గుర్తించి ఈ అస్తిత్వ జ్ఞానమును పొందగలుగుచున్నది. ఇట్టి అస్తిత్వ

జ్ఞానమును పొందునది ఆత్మయే ననియు, తన శరీరముగాదనియు ప్రతి ప్రాణి గ్రహించుచునేయుండును. కావున ఈ అస్తిత్వము ఆత్మతోనే ఉండునని స్థిరపడుచున్నది. ఈ జీవాత్మాస్తిత్వముల యందు భేదమేమియు లేదు; ఆత్మయందే అస్తిత్వముండును; అస్తిత్వ మాత్మకు సహచరి. జడమందస్తిత్వముండదు. ఇందు వలన "అస్తి" "అస్తిత్వము" "ఆత్మ" ఒకే వస్తువునకు పర్యాయ పదములు. దేనికి "జీవనము" "జీవుడు" "ఆత్మ" అని పేరుండునో, దాని పేరే "అస్తి" "అస్తిత్వము" అగుచున్నది.

ఇందువలన అస్తిత్వము చేతనయందే గలదు; జడమందుండదు. కనుక ఆత్మయున్నపుడే అస్తిత్వ శబ్దపు ఉనికి ఏర్పడుచున్నది. కావున ఆత్మకు యథాతథముగ నంగీకరించువాడే "ఆస్తికుడు" అట్లంగీకరింపనివాడే "నాస్తికుడు!"

ఈ సమస్త ప్రపంచమందు ఒక్క ఆత్మతత్వమే యున్నది; కావున ఇది సత్యమేగాదు! పరమసత్యము!! ఇతర వస్తువుల సత్యాసత్యముల నిర్ణయించునదికూడ ఆత్మయే! ఇట్టి సత్యమగు ఆత్మ నంగీకరించువాడు "ఆస్తికుడుని అంగీకరింపని వాడు "నాస్తికుడు."

కనుక ఏ మానవుడు స్వయముగ ఆత్మరూపుడైయుండి, స్వతంత్రబుద్ధితో ఈ పూర్వోక్త సత్యతత్వమునొక్క అస్తిత్వము నంగీకరించుచున్నాడో అతడే "ఆస్తికుడు" ఎవడీ ఆత్మతత్వమును జడజన్యమనియు, నశ్యపర్థమనియు, మరణానంతరమందీ యాత్మ నశింపగలదనియు అంగీకరించుచున్నాడో అతడే

"నాస్తికుడు" ఆత్మ నశ్యపదార్థమని యంగీకరించువాడే వాస్తవమైన "నాస్తికుడు"

ఒక మతసాంప్రదాయకుడు మరియొక మతసాంప్రదాయ కుని నాస్తికుడని భావించుచుండును; ఇది వ్యర్థము! ఏ మతమును అంగీకరింపని ఒక మతరహితుడుకూడ నాస్తికుడుకాడు. ఏ మత సంప్రదాయమందుకూడ పక్షపాతములేకుండ ఉపర్యుక్త సత్య తత్వప్రేమియగు పురుషుడు నిరీశ్వరవాదియైనప్పటికి "ఆస్తి కుడే!" నిజమగు నాస్తిక లక్షణములు పైనుదహరింపబడినవి. ఈశ్వరు నంగీకరింపనివాడు నాస్తికుడుకాడు; "ఈశ్వరుడు" "ఖుదా" "గాడ్" ఇవి ఈ ప్రపంచమున ఒక విధమగు కాల్ప నిక పదార్థములు. సామాన్య ప్రజల నాకర్షించుటకు, భయ పెట్టుటకు ఇదియొక జాలను! ఈశ్వరుడు మృన్మాయుడైనను, శిలామయుడైనను లేదా భావమందు- సాకారుడైనా, నిరా కారుడైనా ఈ సమస్తము కల్పనామాత్రమే! గొప్ప గొప్ప ఈశ్వర భక్తులుకూడ- "మన శ్రద్ధయే, మన భక్తియే, మన విశ్వాసమే మనకు ఫలితము నిచ్చుచున్నవి" అని చెప్పుచు న్నారు. వాస్తవమునకు సర్వమనోరథములను సఫలముచేయు నది మన అంతరాత్మయే! ఆత్మయందపారమగు శక్తిగలదు; అది అమరము, అజరము, అవినాశమునైయున్నది. ఈ వాస్తవ తత్వమును యథార్థముగ నంగీకరించువాడే "ఆస్తికుడు!"

"నేనున్నాను" అని చెప్పునది మన ఆత్మయే! మనమీ అంతరాత్మను- కండ్లతో చూడలేదు, చెవ్రలతో వినలేదు,

నాలుకతో రుచిచూడలేదు, ముక్కుతో వాసన చూడలేదు, చేతులతో స్పృశింపలేదు; అయినప్పటికి ఈ "ఆత్మ" కలదని మనమవశ్యము తెలిసికొనుచున్నాము. మనమేకాంతమందు ఆసీనులమై యున్నప్రుడు- "నేనున్నాను" "నేనున్నాను" అని మన యాత్మ చెప్పుచున్నది. కాని మనమీ అంతర్వాణిని చెవుల నుపయోగింపకుండ వినుచున్నాము, జిహ్వాను ముఖ మును కదల్పకుండ దీనితో మాట్లాడుచున్నాము, కండ్లులేకుండ "నేనున్నాను" అని చెప్పిదానిని ప్రత్యక్షము జేసికొనుచు న్నాము మరియు ఏమియు స్పృశింపకుండ మన స్వకీయమును నాలుగువైపులనుండి మనలో మనము స్పృశించుచున్నాము. ఆదికూడ నుఛ్ఛ్వాసము, నాలుక లేకుండ "నేనున్నాను" అని మనతో మాట్లాడుచున్నది. ఎంతటి ఆశ్చర్యము! మనమీ శబ్ద రహితమగు అంతర్వాణినికూడ స్పష్టముగ వినుచున్నాము. ఈ విధముగ అంతరాత్మ నిగూఢమగు సమస్యలపై మనతో గటలతరబడి విమర్శింపుచున్నది; నచ్చజెప్పుచున్నది. మనము వెలుపలనున్నాము, అది లోపలనున్నది. ప్రాపంచిక ఝంఝాటములనుండి విడివడి, ఏకాంతమందు కూర్చుండి; మనము అంతరాత్మయందు ప్రవేశించి ఈ ప్రవేశమునకు పూర్వము లవసర ముండదు. అంతర్ముఖులమైనప్పుడు మనమానంద నిమగ్నులమగు చున్నాము. వేదములయందు ఏ అనిర్వచనీయమగు తత్త్వము ఇంద్రియాతీతమని వర్ణింపబడియున్నదో అది ఈశ్వరుడుకాదు; ఈ ఆత్మయే! ఈ ఆత్మ స్వయంప్రకాశము, స్వయంసిద్ధము, నిజజ్ఞాన స్వరూపమునైయున్నది. ఇట్టి ఆత్మను ఈశ్వరుడని

చెప్పిన చెప్పనచ్చును. ఇందునలన హానియేమియు కలుగదు. ఈ వ్యాసమునందు "ఆత్మ"కు మారుపేరుగ "ఈశ్వరుడు" అని ప్రయోగించినచోడల కొందరు భ్రమపడుచుందురను భీతితో అట్లు చేయలేదు. ఈ "ఆన్మ" (నేనున్నాను) అని జీవాత్మ లేదా శరీరధారియగు ప్రాణిమాత్రమే చెప్పగలుగుచున్నది; నిరాకారుడు, నిర్గుణుడు, కాల్పనికుడు అయిన "ఈశ్వరుడు" చెప్పజాలడు. ఈశ్వరుడు శరీరధారియగు ఒక ప్రాణికాడు; కనుక అతని అస్తిత్వముకూడ లేదు. అస్తిత్వ శబ్దము జీవునికొరకే ప్రయోగింపబడుచున్నది. జీవనము (లైఫ్) జీవాత్మకొరకే అయిడున్నది. శరీరవిహీనముగ ఇంతవఱకు "జీవుడు" లేక "ఆత్మ" ఎక్కడను చూడబడియుండలేదు. మరణానంతరమందు కూడ "ఆత్మ" సూక్ష్మశరీరముతో నుండును. "ఈశ్వరుడు" జీవధారికాడు; ఇందువలన ఇతని అస్తిత్వములేదు. కాని ఎవరైనా ఒకానొక శరీరధారియగు ప్రాణిని తన ఈశ్వరునిగ భావించినచో ఉపర్యుక్త ప్రమాణములకు వ్యతిరేకము కాజాలదు. శ్రీరామ శ్రీకృష్ణాది శరీరధారులగు ఆదర్శ పురుషులను ఈశ్వరులని పూజించుట దానికి విరుద్ధముకాదు! అస్తిత్వము ఆత్మకు సంబంధించినదియే! అది అందరి హృదయములందు కూర్చుండి– "అస్మి" "అస్మి" "అస్తి" "అస్తి" అని పలుకుచున్నది.

అస్తిత్వమున్న దాని నంగీకరింపనివాడు, అస్తిత్వము లేనిదాని నంగీకరించువాడుకూడ నాస్తికుడే! స్వయంసిద్ధమగు ఆత్మను అంగీకరింపనివాడుకూడ నాస్తికుడే! సత్యమును అసత్య

మని, అసత్యమును సత్యమని చెప్పువాడు, "నాస్తి"ని "అస్తి" యని, "అస్తి"ని "నాస్తి"యని చెప్పువాడుకూడ నాస్తికుడే!

ఈ మూలగ్రంథ రచయితయగు శ్రీ శివమని అద్భుత యోగసాధకులు, సమస్త మతదోషములను తూర్పారబట్టిన మహాప్రవక్త! వారు ఏబదివఅకు ఆధ్యాత్మిక గ్రంథములను రచించియున్నారు. అందు- "గీతా పర్ స్వతంత్రవిచార్" అను హిందీగ్రంథమును "గీత - స్వతంత్ర సమీక్ష" అనుపేరున నే ననువదించియున్నాను; వారు పతంజలి యోగదర్శన శాస్త్ర మునకు నిష్పక్షపాతమగు వ్యాఖ్యను వ్రాసియున్నారు. వారు గోరఖపురమున "అఖిల భూమండలీయ సర్వశిరోమణి మని సమాజము" అను పేరున ఒక ఆధ్యాత్మిక సంస్థను స్థాపించి యున్నారు. దీనికి సంప్రదాయపరమగు "మతము" అను పేరుంచలేదు; సాధనా ప్రధానమగు "మని సమాజము" అను నామకరణము చేయబడినది ఇది గమనార్హము!

శ్రీ శివమని మహాభారతమందు "గీత" ఒక అంశమై యున్న కారణమున వ్యాసప్రోక్తమని అంగీకరించుచున్నారు; శ్రీకృష్ణప్రోక్తమని అంగీకరించుటలేదు. సాధారణముగ గ్రంథ రచయితలు- శివపార్వతీ సంవాదరూపమున, గురుశిష్య సంవాద రూపమునను తమ సిద్ధాంతములను వెల్లడించుచుందురు. అదే విధముగ శ్రీకృష్ణార్జున సంవాదరూపమున శ్రీ వ్యాసుడు తన సిద్ధాంతములను గీతావ్యాజముతో ప్రకటించియుండునని శ్రీ శివమని భావము.

శ్రీ శివముని గీతోపదేశము ఉభయసేనామధ్యమున, అదే సమయమున జరిగియుండలేదని భావించుచున్నారు. గీత అంతయు నిష్కర్ష ప్రక్షిప్తమని మాత్రము శ్రీ శివముని చెప్పియుండలేదు; కాని ఏ సందర్భమున మహాభారతమందు గీతాప్రవచనము జరిగియుండెనోకూడ సూచించియుండలేదు.

గీతను గొప్ప తత్వవేత్తయగు శ్రీ వ్యాసుడు రచించి యుండెనని, మానవ రచనయేగనుక గీతయందలి గుణాగుణము లను స్వేచ్ఛగ సమీక్షింపవచ్చునని శ్రీ శివముని భావము. కాని శ్రీ శివముని గీతను, గీతాశ్లోకముల నాధారముజేసి కొనియే సమీక్షించి యుండెను. తర్కమునుండి తప్పించుకొను టకు మతవాదులు మతగ్రంథములు ఈశ్వరకృతములని నమ్మించి యున్నచమున ఇంతవఱకు మతగ్రంథములను నిష్పక్షపాత దృష్టితో సమీక్షించి యుండలేదనియు, నేటినఱకు గీతకుచెప్ప బడిన అర్థములు మతపరముగ మాత్రమే చెప్పబడియున్న కార ణమున ఆ సమీక్షలు సుజనగ్రాహ్యములుగాక యున్నవనియు శ్రీ శివముని భావము!

శ్రీ శివముని మహాభారత భగవద్గీతలయందలి ప్రక్షిప్త ములగురించి సమీక్షించుటలో అంతగ తమ దృష్టిని కేంద్రీ కరించి యుండలేదు. గీతను వ్యాసప్రోక్తమని భావించియు అందలి వ్యత్యాసములను వ్యక్తపర్చియున్నారు; ఇందుకు గీతనే ప్రధానమగు ప్రమాణముగ తీసికొనియున్నారు.

అనువాద గ్రంథమునకు "స్వీయప్రసక్తి" అను పేరున నేను ఉపోద్ఘాతమును వ్రాసియున్నాను. అందు – మహాభారత

భగవద్గీతలయందలి ప్రక్షేపణాంశముల మూలమునసే అనేక వ్యత్యాసము లేర్పడియున్నవని భావించి, వానిని సహేతుకముగ అనేక ప్రమాణములతో పరిశీలించియున్నాను. నా స్నేహ ప్రసక్తి రచనా ప్రణాళికయందు, (శ్రీ) రాజేంద్ర పండితుల "గీతా విమర్శ" యను గ్రంథమందలి వ్యాసావళియొక్క సహకారమును కొంతవఱకు గ్రహించుట జరిగినది.

కవిహృదయము స్ఖలితము గాకుండ యథాశక్తిని మూల గ్రంథము ననువదించితిని. భావప్రకటన సులభగ్రాహ్యమగునట్లు ఆంధ్రవచన రచనా విధానమును సరళమగు రీతిని సమకూర్చితిని రసజ్ఞులగు పాఠకులు గ్రహింతురుగాక!

ప్రాతప్రతిని పరిశోధించి ముద్రణాలయ ప్రూఫ్‌లను సరి జూచుటలో తమ అమూల్యకాలమును వెచ్చించి శ్రమతీసుకున్న ప్రియమిత్రులు డాక్టర్ (శ్రీ) నండూరి వేంకట సత్య రామారావు ఎం. ఏ., పి. హెచ్. డి. (ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వకళాశాల, తాడేపల్లిగూడెం) గారికి నా హృదయపూర్వక అభినందనములు!

ఈ పుస్తకమును సర్వాంగసుందరముగ ముద్రించిన (శ్రీ) వైష్ణవప్రెస్ పెంటపాడువారికి, మేనేజరు శ్రీ అప్పారావు గారికి, కంపోజిటర్ శ్రీ రమణగారికి కృతజ్ఞతలు.

సర్వేజనా సుఖినోభవన్తి.

అలంపురము
20-9-1978

భవదీయుడు,
గోరింట వెంకట శివరామరాజు.

భూమిక

గీత వ్యాసప్రోక్తము మహాభారతమందలి ఒక అంశమని అందరికి తెలిసిన విషయమే. కావున గీతారచయితకూడ వ్యాసుడే. ఈ విషయము ఈ గ్రంథమందు బాగుగ ధృవపర్చబడినది. వ్యాసునిపేరు కృష్ణద్వైపాయనుడు. "ద్వైపాయన" "వ్యాస" అను నీ రెండుశబ్దములు ఉపాధికి లేక బిరుదుకు సంబంధించినవి అయిఉండెను. వ్యాసుని అసలుపేరు "కృష్ణుడే!" ఇందువలన గీతనుకూడ ఒకమానవుడే రచించియుండెను. కావున ఈ గ్రంథమందలి విషయములనుకూడ స్వేచ్ఛగ సమీక్షింపవచ్చును. ఇదియే ఈ గ్రంథమ దనుసరింపబడినది. పూర్వపు మందలి సమస్తగ్రంథములను మానవులే రచించియున్నారు. కాని తర్క-వాదమునుండి రక్షణ పొందుటకు, సమస్త మతవాములు వేరువేరు మతగ్రంథములు ఈశ్వరరచితములని నమ్మించియున్నారు. ఈ కారణమున మతగ్రంథములు స్వతంత్రమగు నిష్పక్షపాతదృష్టితో సమీక్షింపబడుట లేదు. నేటి వఱకు గీతకు చెప్పబడిన అర్థములు - మతపరముగను, సాంప్రదాయిక పక్షపాతపరముగను ప్రకటింపబడియున్న కారణమున సరియైనవి కాజాలకపోయినవి. ఇందు గీతార్థమును "గీతను" ఆధారముజేసికొనియే చెప్పబడినది. ఈ గ్రంథమందుదాహరింపబడిన సంగతులు ఎంతవఱకు యదార్థములో తామీపుస్తకమును పఠించి విమర్శింపుడు! ఈ పుస్తకమును చదివినచో

ఆశ్చర్యచకితులగుదురు; కాని సాంతము చదివినతరువాత తమలో చాలమంది నాతో ఏకీభవించెదరని నేను విశ్వసించుచున్నాను. ఇందలి విషయములు అవశ్యమద్భుతమైనవే! కాని మిథ్యావాదములుమాత్రముకావు; నితాంతము సత్యములు, స్వతంత్రములు నిష్పక్షపాతములు అయిఉన్నవి.

ఇట్లు

శివముని.

1వ అధ్యాయము

గీతను రచించిన దెవరు ?

అష్టాదశ పురాణములు, ఇతిహాస గ్రంథమగు మహా భారతము, వ్యాసప్రోక్తములని చెప్పబడుచున్నవి; దేవీభాగ వతముగూడ వ్యాసప్రోక్తమే! విష్ణుభాగవతము వ్యాసరచన గాదని ప్రతీతి. మహాభారతము వ్యాసప్రోక్తమనుటలో మత భేదమేమియు లేదు. ఈ విషయము నందరు అంగీకరించు చున్నారు.

"గీత" మహాభారత మంచలి ఒక అంశము. శ్రీమద్భగ వద్గీత మహాభారతమునుండి విడదీయబడినది. కౌరవ పాండవుల యుద్ధము నిశ్చయింపబడెను. కౌరవ పాండవ సేనలు కురుక్షేత్ర మైదానమందు మోహరించియున్నవి. ధృతరాష్ట్రుడు అంధుడై యున్న కారణమున యుద్ధరంగమునకు పోజాలకపోయెను. కాని యుద్ధరంగమందలి సంగతులను తెలిసికొనగోరెను. ఇంటి వద్దనేయుండి యుద్ధక్షేత్రమందలి సంగతులను తెలిసికొనుటకు, సంజయుడనువానిని నియమించుకొనెను. అతడు ధృతరాష్ట్రుని యొద్ద కూర్చుండి యుద్ధ సమాచారమును తెలుపుచుండెను. సంజయుడు దివ్యజ్ఞానముతో గ్రహించిన సంగతులను ధృత రాష్ట్రునకు చెప్పుచుండెను. గీత యుద్ధరంగమందు శ్రీకృష్ణుడనిచే అర్జునున కుపదేశింపబడెను. గీతారంభమున ధృతరాష్ట్రుడు సంజయుని ఈ క్రింది విధముగా ప్రశ్నించెను.

ధృతరాష్ట్ర ఉవాచ:-

శ్లో॥ ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః।
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ॥

సంజయ ఉవాచ:-

శ్లో॥ దృష్ట్వాతు పాండవానీకం వ్యూఢం దుర్యోధన స్తదా।
ఆచార్యముపసంగమ్య రాజావచన మబ్రవీత్॥

ధృతరాష్ట్రుడు సంజయునితో పలికెను- "ఓ సంజయా! ధర్మక్షేత్రమగు కురుక్షేత్రమందు యుద్ధసన్నద్ధులైయున్న నా వారలు, పాండవులు ఏమిచేసిరి?"

సంజయుడు- "అప్పుడు దుర్యోధనుడు పాండవసైన్య మునుచూచి, ద్రోణునియొద్దకుపోయి అడిగెను"

దీని తరువాత "గీతాకథనము" ప్రారంభమగుచున్నది. రెండవ అధ్యాయమునుండి గీతాజ్ఞానము శ్రీకృష్ణునిద్వారా అర్జునునకుపదేశింపబడినదని చెప్పబడుచున్నది.

ఇందువలన "గీత" యను గ్రంథము శ్రీకృష్ణునివలన రచింపబడలేదని నిర్ధారణ యగుచున్నది. తులసీకృత రామాయణమందు పరశురామ లక్ష్మణ సంవాద సందర్భమున ఉపయోగింపబడిన "చౌపాయీలు" "దోహాలు" లక్ష్మణ పరశురాములు నిజముగ హిందీ పద్యములతో సంభాషించుట యదార్థమా? భావప్రకటనకూడ సరిగ ఇదేవిధముగ నుండియుండెనా?

వాల్మీకిరామాయణమందుకూడ శ్రీరాముని ముఖతః చెప్ప బడిన శ్లోకములు నిజముగ శ్రీరాముడా విధముగ చెప్పియుం డెనా? వాల్మీకిరామాయణమందు వానరులు, భల్లూకముల ముఖతః చెప్పించిన శ్లోకములుకూడ వానిచే పలుక బడియుండవు. కాని ఇదియంతయు వాల్మీకియొక్క రచన మాత్రమైయున్నది. సరిగ నిదేవిధమున మహాభారతమునుండి గ్రహింపబడిన "గీత" యందలి శ్రీకృష్ణార్జున సంజయ సంవాదముయొక్క యావత్సం భాషణ వ్యాసునియొక్క రచనయే!

శ్రీకృష్ణార్జున సంజయాదులు శ్లోకరూపమున సంభాషిం పకపోయినప్పటికి అందలి భావములతోను, జ్ఞానములతోను సంభాషించియుందురని కొందరు భావించుచున్నారు. ఇందును గురించికూడ పక్షపాతరహితముగ విమర్శింపవలసియున్నది.

కురుక్షేత్రమందు యుద్ధము నిశ్చయింపబడినది. ఎవరి బాంధవులు వారికి, ఎవరి సహాయకులువారికి యుద్ధరంగమునకు చేరి సైన్యసమేతముగ మోహరించియున్నారు. యుద్ధప్రారంభ చిహ్నమగు శంఖనాదములు చేయబడినవి. అర్జున రథము ముం దుకు సాగెను. అర్జునుడు ధనుర్బాణములనుధరించెను. ఇట్టి సను యమున అర్జునునకు మోహాముదయించెను. అపుడు శ్రీకృష్ణు డర్జునునకు పదునెనిమిది అధ్యాయముల గీత నుపదేశించెను; ఇది నమ్మశక్యమా? ఆరోజునకూడ గొప్ప యుద్ధము జరిగెను. అర్జున విషాదమువలన యుద్ధమునకు అవరోధమును గలుగ లేదు. రణరంగమును విడిచి అర్జును డింటికి రాలేదు. అక్కడనే

యుద్ధమైదానమందు గీతాజ్ఞానము అర్జునున కుపదేశింపబడెను. యుద్ధారంభమునకు శంఖధ్వని చేయబడిన తరువాత. ఆ రణ రంగమందే, ఉభయసేనా మధ్యమున నిలబడి, పదునెనిమిది అధ్యాయములుగల గీతోపన్యాసము చేయుటకు అవకాశము చిక్కెదు? సమయము దొరకదు?

అర్జునునకు యుద్ధమంచు విరక్తి కలిగి యుండవచ్చును; అపుడు (శ్రీకృష్ణు డతనికి నాలుగు మాటలుచెప్పి యుద్ధాసక్తిని కలిగించి యుండవచ్చును. ఇందువలన అర్జునునకు యుద్ధము చేయు దృఢసంకల్పము కలిగియుండవచ్చును. చతుర రాజకీయ వేత్తయగు (శ్రీకృష్ణుడు అర్జునునకు ఈ యుద్ధమందు విజయ మును కాంక్షించుట సహజము. కాని యుద్ధరంగమందు మహా భయంకర సమయమందు – భక్తియోగమును, సాంఖ్యయోగ మును, సన్యాసధ్యాన యోగాదులను అర్జునున కుపదేశించక పోయి యుండవచ్చును, ఏవిధముగను అక్కడ ఆ సమయమున అంతటి అవకాశము దొరికియుండకపోవచ్చును. కావున ఈ పదునెనిమిది అధ్యాయముల "గీత" యుద్ధరంగమందు అర్జునున కుపదేశింపబడియుండదు.

గురుశిష్య సంవాదరూపముగను, శివపార్వతీ సంవాద రూపముగను, చిలుక గోరువంకల సంభాషణ రూపముగను రచయితలు తమతమ సిద్ధాంతములను వెల్లడించుచుందురు. అదేవిధముగ జ్ఞానియగు వ్యాసమహర్షి కృష్ణార్జున సంవాద రూపమున తన సిద్ధాంతములను చెప్పియున్నాడు; నిజముగ నిది

కృష్ణార్జున సంవాదముగావు! అందునుగురించి మా శిష్యులు, పాఠకులు, సదస్యులు ఆలోచించినయెడల బాగుగ తెలియ గలదు.

ఇదియునుగాక అవతార పురుషుడు, సర్వజ్ఞుడగు శ్రీకృష్ణుని ముఖతః అసంగతములగు అనేక విషయములు వెల్లడింపబడినవి.

ఈ క్రింది శ్లోకము శ్రీకృష్ణునిచే చెప్పబడినది.

శ్లో॥ అన్నాద్భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః।
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మ సముద్భవః॥
(గీ. అ. 3–14)

• అన్నమువలన సమస్త ప్రాణులుద్భవించుచున్నవి. అన్నము మేఘములవలన కలుగుచున్నది. ఈ మేఘములు యజ్ఞమువలన పుట్టుచున్నవి. యజ్ఞము కర్మవలన గలుగు చున్నది.

• తామాలోచింపుము! శ్రీకృష్ణునివంటి సర్వజ్ఞుడు ఇట్టి మాటలు చెప్పియుండునా? యజ్ఞములవలన మేఘములు, మేఘ ములవలన వర్షము కలుగుచుండును. ఈ మేఘములే అన్నము నకు కారణము లగుచున్నవి. యజ్ఞములు లేనియెడల మేఘో త్పత్తి జరుగజాలదు; ఇందువలన అన్నముదయించదు; అన్నము లేనందున ప్రాణికోటి మనజాలదు. ఇందువలన ప్రాణుల సంర క్షణార్థము యజ్ఞములు తప్పక చేయవలసియున్నది. భారతవర్ష మందు ఇపుడుకూడ యజ్ఞభూమము లక్కడక్కడ ఎగయుచుం

మిట గోచరించుచున్నది. బర్మా, అమెరికా, జపాన్, రష్యా, ఆస్ట్రేలియా దేశములందు, భారతదేశమునకన్న నధిక వర్ష ములు కురియుచున్నవి. ఏ దేశములందు యజ్ఞములు జరుప బడుటలేదు. ఇంద్రాది దేవతలకు యజ్ఞభాగముల నర్పించుట లేదు. కాని ఉపర్యుక్త దేశములందు బాగుగ అన్నముత్పన్న మగుచునేయున్నది. యజ్ఞధూమమువల్లనే మేఘోత్పత్తి జరుగు చున్నట్లు ఈ శ్లోకరచయితయొక్క అభిప్రాయము. కాని ఇది చాల పొరపాటు! మేఘములు సముద్రజలమునుండి బయలు దేరు ఆవిరినుండి పుట్టుచున్నవి; కాని యజ్ఞధూమమునుండి మాత్రముగాదు. నీరు పర్యాప్తనుగు ఉష్ణోగ్రతనుపొంది ఆవిరిగ మారుచున్నది; ఆకాశమునకుపోయి ఈ ఆవిరియే శీతలవాయు సంపర్కముతో తిరిగి నీరుగ మారి క్రిందికి పడుచున్నది; ఇదియే వర్షము యజ్ఞధూమమందు జలభాగముండదు; కాన యజ్ఞము వర్ష పాతమునకు కారణము కాజాలదు.

పూర్వోక్త కారణములవల్లనే ప్రాణులయొక్క ఉత్పత్తి, జీవనము జరుగుచున్నదని, అన్నమునకు యజ్ఞమే కారణమని గీతాకారుని అభిప్రాయము, కాని ప్రజలు దీని నంగీకరింపలేరు. కొందరు ప్రపంచ శాంతికోఱకు అరుదుగ గొప్పగొప్ప యజ్ఞ ములను చేయుచునేయున్నారు. అయినను అపత్తులు కలుగు చునేయున్నవి. గీత ఇట్లు చెప్పుచున్నది–

శ్లో॥ సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోఽవాచ ప్రజాపతిః।
అనేన ప్రసవిష్యధ్వమేషవోస్త్విష్ట కామధుక్॥
(గీ. అ. 3–10)

బ్రహ్మసృష్ట్యాదియందు యజ్ఞసహితముగ ప్రజను సృజించి ఇట్లు పలికెను– "ఈ యజ్ఞముద్వార ఉన్నతిని పొందుడు. ఈ యజ్ఞము మీ సమస్త కోర్కెలను నెరవేర్చగలదు"

యజ్ఞముల ద్వార దేవగణము తమ తమ భాగములను స్వీకరించి ప్రసన్నులై మానవులకు సహాయపడుచుండిరని గీతాకారుని విశ్వాసము. ఈ మాటలను శ్రీకృష్ణుని ముఖతః పలికించెను.

శ్లో॥ దేవాన్భావయతానేన తే దేవా భావయంతువః।
పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథాః॥
(గీ. అ. 3–11)

ఈ యజ్ఞములతో దేవతలను ప్రసన్నుల జేయుడు. ఇందువలన ఆ దేవతాగణము మీయొక్క అభివృద్ధికి సహకరింపగలదు. ఈ విధముగ పరస్పరము సహకరించుకొని ప్రసన్నులగుచు పరమకళ్యాణమును లేదా మోక్షమును పొందుడు.

ఏ ప్రదేశములందు, ఏ దేశములందు యజ్ఞయాగాదులు చేయబడుటలేదో, దేవతలను సంతృప్తి పరుచుటలేదో ఆయా దేశములందలి ప్రజలే ఉన్నతిని పొందుచున్నారు. అధికముగ అన్నముత్పత్తియగుచున్నది; అక్కడి ప్రజలును సుఖులైయున్నారు. ఇందువలన యజ్ఞపక్షమందలి ఈ సమస్తయుక్తి ప్రమాణములు గీతాకారునిచే ప్రయోగింపబడినవి. ఇందలి శ్లోకములు శ్రీకృష్ణునిచే పలుకబడినవి ఏమాత్రమును కావు!

భారతీయుల క్షీణదశా ప్రారంభము

ముని వంశజులైన భారతీయులమొక్క పతనము—తమ్ము, తాము మునులుగ తలంపక, హీనులుగ, దాసులుగ, బానిసలుగ భావించినప్పటినుండియు, తమ సహోదరులను శత్రువులుగ భావించినప్పటినుండియు ప్రారంభమైనది.

మునివంశజులు తమను తాము బానిసలుగ భావించినప్పటినుండియు స్వజనులతో కలహించు మర్కటి యుత్పన్నమైనది. రామాయణకాలమునాటికి తమ సోదరులతో కలహించు స్వభావము సంక్రమింపలేదు. మహాభారతకాలమునాటినుండియే భారతీయులకు సోదరకలహము ప్రారంభమైనది. సవతితల్లి కైక చెప్పినంతమాత్రమున శ్రీరామచంద్రుడు సోదరుడగు భరతునకు రాజ్యమును విడిచి వనవాసమునకు పోయెను. భరతునితో శ్రీరాముడేమాత్రమును కలహింపలేదు. భరతుడుకూడ సోదర ప్రేమ ముందు రాజ్యమును తుచ్ఛముగ తలచి, శ్రీరాముని ప్రతినిధిగ మాత్రమే రాజ్యమును పాలించి, తరువాత శ్రీరామునకు రాజ్యము నప్పగించెను. కాని భారతకాలమునాటికి భరతవర్షపు స్వభావమే మారిపోయినది. సహోదరుల మధ్యనే కలహము ప్రజ్వరిల్లి రక్తపిపాస పెరిగిపోయినది. ఇతియేగాదు! అప్పటి గొప్పగొప్ప ప్రసిద్ధ వ్యక్తులుకూడ దీనికనుకూలమగు ఉపదేశములనే ఇచ్చియున్నారు.

మహాభారతమందలి గీత

మహాభారతయుద్ధమువలన భారతదేశము సర్వనాశమును పొందినది. అసంఖ్యాకులగు మహావిద్వాంసులు, గొప్ప గొప్ప కళాకారులు, మహాశూరులు కొద్దిరోజులలోనే నశింప జేయబడిరి. "గీత"లో అర్జునుని ముఖతః చెప్పింపబడిన విషయములు, ఆ సమయమునకు చాల అనువైనవి అయిఉన్నవి. అయినప్పటికి శ్రీకృష్ణుని ఉపదేశము యుద్ధమును చేయించియే తీరినది! అర్జునునకు కలిగిన జ్ఞానము ననుసరించి భారతయుద్ధము జరుగకపోయి యుండినయెడల భారతదేశమునకు ఇప్పటి దుర్దశ కలిగియుండెడిదిగాదు. రక్తపిపాసతో గూడిన ఈ యుద్ధమును చేయుటకంటె బిచ్చమెత్తుకు బ్రతుకుట శ్రేయస్కరమని ప్రకటింపబడిన అర్జునుని వాదము చాల సముజసమైనది. సమస్తమును సంహరించిన తరువాత అర్జునుడీ రాజ్యము నేమిచేసికొనగలడు? గీతయందు ఆత్మజ్ఞాన బ్రహ్మజ్ఞాన యోగసాధనలకు సంబంధించిన ఎన్నియో మంచి విషయములు గలవు. భారత కథానుసారము శ్రీకృష్ణుడు గొప్ప జ్ఞాని, యోగి, అవతార పురుషుడు, శక్తిసంపన్నుడు, భారతదేశ హితైషి. వ్యక్తిగత ముగ అర్జునుడుకూడ మహాబలశాలియే! ఈ యుద్ధము చేయక పోయినను ఇంద్రలోకమునై దండెత్తి కుబేర సంపత్తినంతయు వశపర్చుకొనగలయంతటి శూరుడు అర్జునుడు. కనుక అతడు భారత యుద్ధమును చేయకుండినచో చాల బాగుండెడిది.

యుద్ధారంభపు శంఖధ్వనిచేసిన తరువాత రణరంగమ దు అర్జునుడు ఈ విధమగు విషాదమును పొందియుండడనియు, శ్రీకృష్ణుడుకూడ యుద్ధమైదానమందు పదునెనిమిది అధ్యాయములుగల గీతోపన్యాసమును చేసియుండడని నా అభిప్రాయమై యున్నది.

★ ★ ★ ★

2వ అధ్యాయము

గీతయందలి "మాం" "అహం" అను శబ్దముల యర్థము

గీతయందలి "మామ్" అను శబ్దమునకు గొప్ప మహిమ గలదు. గీతలోని "మామ్" శబ్దార్థమును గ్రహింపజాలనివారు గీతావిషయమునే గ్రహింపలేరు. "మామ్" అర్థమును గ్రహింపలేనినాడు గీతాప్రోక్తముగ భక్తుడు జీవన్ముక్తుడు కాజాలడు; పరమపదమును, పరమధామమును పొందజాలడు, గీతాగుప్తరహస్యమునుకూడ గ్రహింపజాలడు. పరమాత్మయగు గీతాకృష్ణుని తత్వతః తెలిసికొనజాలడు. సమస్తమును విడిచి "మామ్" యొక్క శరణమును పొందువాడు సమస్తపాపముల నుండి విముక్తి పొందగలడు. సమస్తమును విడిచినను "మామ్"ను విడువకుము; ఇది గీతామతము!

శ్లో॥ సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
అహం త్వాసర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ॥
(గీ. అ. 18-66)

సమస్త ధర్మములను, సమస్త మతములను విడచి "మామ్" అను ఒకే తత్వమును శరణు పొందుము. సంస్కృత వ్యాకరణము ననుసరించి "మామ్" ద్వితీయా విభక్తి ఏకవచనమైయున్నది. సంస్కృతమందు సంభాషించు ప్రతివాడును తనను ప్రథమావిభక్తిలో "అహమ్" అనియు, ద్వితీయా విభక్తిలో "మామ్" అనియు మాట్లాడుచుండును. కావున గీతలో ఈ "మామ్" అనియే ప్రబోధింపబడినది; దీనిని నమ్మిన వానికి పాపము లంటవు!

శ్లో॥ భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః।
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్॥
(గీ. అ. 18-55)

ఏ మానవుడు ఈ "మామ్" అనునది ఎట్టిదో, ఎంతటిదో తత్త్వతః స్పష్టముగ భక్తితో తెలిసికొనగలుగునో అతడు ఈ "మామ్" రూపియగు బ్రహ్మమందు ప్రవేశించును. ఇది సరియైనదే! ఎవడు దీనిని ఎరుగునో, ఎవనికి దీనితో పరిచయ మున్నదో అచ్చటికతడుపోవుట సహజమేగదా! ముందుకు చదువుచు పోవుడు; గీతయందు "మామ్" అను దానికెంత మహిమ గలదో తెలియగలదు.

శ్లో॥ మాంహి పార్థవ్యపాశ్రిత్య యేఽపిస్యుఃపాపయోనయః।
స్త్రియోవైశ్యాస్తథాశూద్రాస్తేఽపియాంతి పరాంగతిమ్॥
(గీ. అ. 9–32)

శ్లో॥ కింపునర్బ్రాహ్మణాఃపుణ్యా భక్తా రాజర్షయస్తథా॥
(గీ. అ. 9–33)

ఓ అర్జునా! స్త్రీలు, వైశ్యులు, శూద్రులు మఱియు పాపకర్ములుగూడ ఈ "మామ్" అనుదానిని శరణుపొంది ఉత్తమగతిని పొందుచున్నారు; పుణ్యాత్ములు, బ్రాహ్మణులు, రాజర్షులు భక్తులవిషయమై చెప్పనలసిన దేమున్నది?

శ్లో॥ మన్మనా భవ మద్భక్తో మద్యాజీ "మామ్" నమస్కురు।
మామేవైష్యసి యుక్త్వైవ మాత్మానం మత్పరాయణఃII
(గీ. అ. 9–34)

"మామ్" చెప్పుచున్నాడు– నాయందు మనస్సుంచి. నా భక్తుడవై నా పూజ చేయుచు "మామ్" అను తత్త్వము నకు నమస్కరింపుము. ఈ విధముగ "మామ్"ను శరణుపొందితనలో తాను తన నిజస్వరూపమును ధ్యానించి ఈ "మామ్"ను పొందిన మానవునకు ఉత్తమగతి ప్రాప్తింపగలదు.

శ్లో॥ యోమా మజ మనాదిం చ వేత్తి లోక మహేశ్వరమ్।
అసమ్మూఢఃసమర్త్యేషు సర్వపాపైఃప్రముచ్యతేII
(గీ. అ. 10–3)

ఈ విధముగ అజము, అనాది, లోకేశ్వరుడు అయినట్టి "మామ్" అను తత్త్వమును ఎవరు తెలిసికొనగలుగుచు

న్నాడో అతడు సర్వపాపములనుండి విముక్తినిపొంది జ్ఞానియగు పురుషోత్తముడగుచున్నాడు. కాని ఈ "మాము" అను తత్త్వమును తెలిసికొనుట చాల కష్టము.

శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాంవేత్తి తత్త్వతః॥
(గీ. అ. 7-3)

వేయినుండి మానవులలో ఒకానొక మానవుడుమాత్రమే సిద్ధిని పొందుటకు ప్రయత్నించును. ఇట్లు ప్రయత్నించు యోగులలో ఒకానొకడుమాత్రమే "మాము"ను తత్త్వతః తెలిసికొనగలుగుచున్నాడు.

కావున ఈ "మాము"ను తెలిసికొనుట సామాన్యము కాదు. ఇది "అస్మద్" శబ్దపు ద్వితీయావిభక్తి ఏకవచన రూపమేననియు, దీనికి అర్థము "నన్ను" అనిమాత్రమేననియు కొందరు పండితులు భావింపవచ్చును; కాని ఇది సరిగాదు! "మాము" యొక్క సత్యార్థమును అవగాహనజేసికొనుట అతి కష్టముకను కనే - వేయిమందిలో ఒకడుమాత్రమే "మాము"ను తెలిసికొన ప్రయత్నించి సాధనచేయుననియు; అట్టి సాధకులలో ఒకడు మాత్రమే ఈ శబ్దభావమును గ్రహింపగలుగుననియు గీతయం దుదహరింపబడినది. ఇందువలన ఈ "మాము"ను ఒక సాధారణ శబ్దముగ భావించుట చాల పొరపాటు!

ఈ "మాము" శబ్దమునకు గొప్ప మహత్తు, అసాధారణమగు అర్థముగూడ గలదు; కనుకనే గీతాకారుడు దీని యర్థమును సుస్పష్టముగ తెలిపిపర్చుట అవశ్యమని భావించి

యున్నారు. దీనియర్థ మసాధారణమైనదని గీతాకారునకుకూడ తెలియును; పాఠకులు దీని యర్థమును గ్రహింపనియెడల గీతా వచనమే వ్యర్థముకాగలదనికూడ రచయితకు బాగుగ తెలియును. దీనిని దృష్టియందుంచుకొనియే గీతాకారు డొకచోట ఈ అస్మచ్ఛబ్దముయొక్క అర్థమును స్పష్టముగ వివరించి యున్నారు.

శ్లో॥ యోమామేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్।
ససర్వ విద్భజతి మాం సర్వభావేన భారత॥
(గీ. అ. 15-19)

ఓ అర్జునా! ఈ విధముగ జ్ఞానులు పురుషోత్తముడగు ఈ "మామ్"ను గుర్తించి దీనిని భజించుచున్నారు.

ఈ శ్లోకమందు- "మామ్" అను ఆత్మక పదార్థము వేరొకటి కాదనియు, పురుషోత్తముడనియు, అనగ ఉత్తమ పురుష అనియు గీతాకారుడు చెప్పియున్నాడు. ఉత్తమపురుష, మధ్యమపురుష, ప్రథమపురుష లేక అన్యపురుష అని పురుషులు మూడు విధములు. (సః=వాడు) అనునది అన్యపురుష వాచకము. మతసంబంధమగు దేవీదేవతలు, ఈశ్వరాదులు ఇవియన్నియు అన్యపురుషలు. (త్వం=నీవు) తన్ను విడిచి తనముందున్నవానిని "నీవు" అని పలుకరించెదము. ఇది మధ్యమపురుషగ చెప్పబడుచున్నది. మన "అహమ్" మన స్వకీయము, మన ఆత్మ, మన జీవుడు మాత్రమే ఉత్తమ పురుష అయియున్నది.

దీని తాత్పర్యమేమనగ- ఉత్తమ లేక "పురుషోత్తమ" అనునది ఒకానొక దేవతయొక్క, లేదా మత ఈశ్వరునియొక్క పేరుమాత్రముకాదు! ఎందులన ? ఇవన్నియు అన్యపురుష వాచకములు. ఉత్తమపురుష అనగ- మనము, మన స్వకీయము మన ఆత్మమాత్రమే అయియున్నది. ఇదియే సంస్కృత వ్యాకరణానుసారముగ ప్రధమావిభక్తియందలి "అహమ్" ద్వితీయా విభక్తియందు "మామ్" అగుచున్నది. ఈ "అహమ్" శబ్దము ఆత్మబోధకమైయున్నది. ఇతరుని ఆత్మను జీవుని చెప్పునది "త్వం" (నీవు) లేదా సః (వాడు) అయిడున్నది."అహం"కాదు. "అహం" కేవలము ఏకమాత్రముగ తన్ను తాను ప్రకటించినదై యున్నది. కాని ఒకానొక దేవతకు, మతఈశ్వరునకు వర్తింపదు. మతవాదులు ఈశ్వరుని - ప్రభువు, యజమాని అను భావముతో ప్రార్ధించెదరు. జీవుడుకూడ అనేక పదార్ధములకు యజమాని యగుటవలన ఈశ్వరుడే!

కాని మతవాదులు - తమ్ము తాము, తమ ఆత్మను ఈశ్వరునిగ అంగీకరింపక, ఈశ్వర దాసులుగ, ఈశ్వర భక్తులుగ, ఈశ్వర పుత్రులుగ అంగీకరించుచున్నారు. రాతిబొమ్మలను, మట్టిబొమ్మలను• చెట్లను, నీరుని ఈశ్వరునిగ అంగీకరించుచున్నారు; గాని తమను, తమ ఆత్మను ఈశ్వరునిగ అంగీకరించుటలేదు. మతోన్మాదులగు భక్తులు - తమను, తమ ఆత్మను ఈశ్వరునిగ అంగీకరింపరు!

కాని మత-ఈశ్వరు నంగీకరించుటవలన ఉపయోగము లేదనియు, మోక్షమును, సద్గతిని. నిజమగు ముక్తిని పొంద గోరువాడు– తన్ను తాను, తన ఆత్మను, తన "అహమ్"ను తెలిసికొనవలసియున్నదనియు గీత చెప్పుచున్నది. ఈ "అహం" ద్వితీయావిభక్తిలో "మాం" అగుచున్నది. "అహం" యొక్క అర్థమునేను, "మాం"యొక్క అర్థము నన్ను, నాకు అయి ఉన్నది. గీతయందలి "అహం" "మాం" అను శబ్దములు ఆత్మ వాచకములై యున్నవి. దేవీ దేవతలయొక్క, మత-ఈశ్వరుని యొక్క అర్థములను ప్రబోధించుట లేదు. "అహం" "మాం"ను అవగాహన చేసికొనుటలో పాఠకులు పొరపాటుపడకుండ చాల స్పష్టముగ వాని యర్థమును గీతాకారుడు వివరించియున్నాడు చూడుడు! శరీరము లేక ప్రపంచము, జీవుడు లేక ఆత్మ రెండే రెండు పదార్థములున్నవి. మతవాదులు ఈశ్వరుడు అను మూడవ వస్తువునుకూడ అంగీకరించుచున్నారు. గీతపై రెండు వస్తువులను మాత్రమే అంగీకరించుచున్నది; మూడవది యగు "మత-ఈశ్వరు" నంగీకరించుట లేదు. ఈ శరీరము జడము; ఆత్మచే కల్పింపబడినది. శరీరమందున్న చేతనత ఆత్మమూలమున కలిగినది. ఆత్మవలననే శరీరము కలిగినది; శరీరమువలన ఆత్మ కలుగ లేదు. ఇందువలన ఆత్మ ముఖ్యమైనది. గీతయందు "అహం" "మాం" అను శబ్దములకు ఆత్మపరముగనే అర్థము చెప్పబడి కీర్తింపబడినది. ఇతర శాస్త్రములందు ఆత్మశబ్దము ప్రయోగింపబడినట్లే– గీతయందు దాని స్థానమున "అహం"

"మాం" అను శబ్దములు ప్రయోగింపబడినవి. ఈ క్రింది శ్లోక మును చూడుము-

శ్లో॥ ఇదం శరీరం కౌంతేయ క్షేత్ర మిత్యభిధీయతే।
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః॥
(గీ అ. 13-2)

ఓ అర్జునా! ఈ శరీరము క్షేత్రమని చెప్పబడుచున్నది. ఎవడు ఇది నా శరీరమని తెలిసికొనగలుగుచున్నాడో అతను క్షేత్రజ్ఞుడని తత్వవేత్తలు చెప్పుచున్నారు. ఈ శ్లోకమువలన క్షేత్రమనగ శరీరమనియు, ఇది శరీరమని తెలిసికొనువాడు క్షేత్రజ్ఞుడనియు తెలియుచున్నది. ఇపుడీ క్షేత్రజ్ఞుడనగ నెవడో తెలిసికొనవలసియున్నది. ఈ శరీర మెవరిదో శరీరము స్వాయ ముగ తెలిసికొనజాలము. ఈ శరీరము మనదని మనము తెలిసి కొనగలుగుచున్నాము. ఇందువలన ఈ "అహం" (నేను) ఈ ఆత్మ, జీవుడు క్షేత్రజ్ఞుడై యున్నాడు. ఇపుడు తాము శరీరము పేరు క్షేత్రమని, జీవుని పేరు క్షేత్రజ్ఞుడని స్పష్టముగ తెలిసికొనియే యుందురు.

దీనితరువాత గీతయందు ప్రసిద్ధిపొందిన "మాం" అనగ నేమియో వివరింపబడినది.

శ్లో॥ క్షేత్రజ్ఞం చాపి మాంవిద్ధి సర్వక్షేత్రేషు భారత।
క్షేత్ర క్షేత్రజ్ఞ యోర్జ్ఞానమ్ యత్తజ్జ్ఞానం మతం మమ॥
(గీ. అ. 13-3)

ఓ అర్జునా! సర్వక్షేత్రములందు ఉన్నట్లు అనగ సమస్త శరీరములందుగల క్షేత్రజ్ఞుని "మామ్"గానే తెలిసికొనుము.

ఒకటి శరీరము, రెండవది జీవుడు. రెండే గలవు. శరీరమును క్షేత్రమని, జీవాత్మను క్షేత్రజ్ఞుడని చెప్పుచున్నారు. "మామ్" అనగ ఆత్మయే! దీని మహిమ గీతయందు గానము చేయబడినది. ఇదువలన నిజమగు ముక్తినిచ్చునది, సర్వపాపములను నశింపజేయునది, పరమపదప్రాప్తిని కలుగజేయునది ఆత్మయే అయిఉన్నది. మన జీవునియొక్క, మన స్వకీయమగు ఆత్మయొక్క పేరే "మామ్" అని చెప్పబడుచున్నది. "మామ్" శబ్దము "అహమ్" (అస్మద్) యొక్క రెండవ రూపము. గీత యందు "అహమ్" (అస్మచ్ఛబ్దము) ఎవరికొరకు ప్రయోగింప బడినదో స్పష్టముగ వివరింపబడినది.

శ్లో॥ అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః॥
(గీ. అ. 10–20)

ఓ గుడాకేశ! (అర్జునా!) "అహమ్" అనునది ఈఆత్మయే! (గీతయందు ప్రయోగింపబడిన "అహమ్" అను శబ్దమునకు అర్థము శ్రీకృష్ణుని అంతరాత్మకుమాత్రమే చెప్పబడియుండ లేదు.) గీతయందలి "అహమ్" అను శబ్దము సర్వుల హృదయమునుండి మాట్లాడుచున్నది; (సర్వభూతాశయ స్థితః) సమస్త జీవధారుల హృదయాంతర్గతమైయున్నది. గీతయందలి "అహమ్" కేవలము శ్రీకృష్ణునికొరకు లేదా గీతారచయితకొరకు ప్రయోగింపబడినదిగాదు! గీతయందు కీర్తింపబడిన మహత్తుగల

"అహమ్" సమస్త హృదయసన్నద్ధమైయున్న ఆత్మయే! ఇది తన్ను తాను ఉద్ధరించుకొనగలిగియుండును; మతఈశ్వరుడు కాడు. గీతయందు ఇదికూడ చెప్పబడినది.

శ్లో॥ ఉద్ధరేదాత్మ నాత్మానం నాఽత్మాన మవసాదయేత్।
ఆత్మైవ హ్యాత్మనోబంధు రాత్మైవ రిపురాత్మనః॥
(గీ. అ. 6-5)

తనద్వారానే లేదా తన ఆత్మద్వారానే తన్ను ఉద్ధరించుకొనవలసియున్నది. తన్ను తాను అధోగతిని పొందనివ్వరాదు తనకు తన వశీకృత మనస్సే బంధువు. వశీకృతముగాని మనస్సే తనకు శత్రువు.

గీతాకారచయిత ఈ జీవుని లేక మానవుని ఉద్ధరించువాడు ఇతరుడైన మతఈశ్వరుడు కాడని అభిప్రాయపడుచున్నాడు. జీవునకు ఉద్ధారకుడు తన ఆత్మయేయని, ఈశ్వరుడుకాదని గీత చెప్పుచున్నది. గీతయందు 18వ అధ్యాయమందీవిధముగ చెప్పబడియున్నది.

శ్లో॥ సర్వధర్మా న్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
అహంత్వా సర్వపాపేభ్యో మోక్ష యిష్యామి మాశుచః॥
(గీ. అ. 18-66)

సమస్త ధర్మములను అనగా మతములను, మతమతాంతర సంప్రదాయములను విడచి, ఒక్క "మామ్" అనుదానిని శరణుపొందుము. ఈ "అహమ్" నిన్ను సమస్త పాపములనుండి

విముక్తి చేయుగలదు. ఆలోచింపకుము! ఈ "అహమ్" ఈ "మామ్" ఏదో ఒక మతఈశ్వరుడుకాడు. గీతాప్రవక్త శ్రీకృష్ణుడుకూడ కాడు. తన "ఆత్మ" మాత్రమే అయిడున్నది. ఒకవేళ ఈ "అహం", "మాం"యొక్క అర్థమును శ్రీకృష్ణునకుగాని, ఒక దేవతకుగాని, మతఈశ్వరునకుగాని అంటగట్టిన యెడల గీతయందలి ఇతర శ్లోకముల యర్థము వ్యర్థమై పోగలదు. మిగిలిన శ్లోకములతో సమన్వయముకూడ కుదరదు. ఎందువల్ల ననగ? మిగత శ్లోకములందు ఈ "అహం" "మాం"ను గురించి శరీరధారియగు ఆత్మయే అనియు, ఇతరము కాదనియు ప్రకటింప బడియున్నది. ముందు చూడుడు—

శ్లో॥ అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రిత:।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్॥
(గీ. అ. 15–14)

ఈ అహమే వైశ్వానరమను అగ్నిరూపమును ధరించి ప్రాణుల దేహము నాశ్రయించియున్నది. ఈ రూపమగు "అహమే" ప్రాణాపానములతోగూడి–భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములను చతుర్విధభోజనములను పతనము జేయుచున్నది. ఇందువలన ఈ"అహం" జీవాత్మకు సంబంధించినది అయిడున్నది; ఈశ్వరునకుగాని, శ్రీకృష్ణునికిగాని సంబంధించినదిగాదని విశద మగుచున్నది. గీతయొక్క ఈ "అహము" ప్రాణుల శరీరమందు మాత్రమే యుండగలదు. జడతత్వమందుండదు. మతఈశ్వరుని సర్వాంతర్యామి అని చెప్పుటవలన జడమందుకూడ ఈశ్వరుడు

ఉండియుండెను. ఇందువలన జడతత్వములందు ఈశ్వరుడున్నాడు అహమని చెప్పబడున దేదియు లేదు. కాని మతవాదుల కథనాను సారము ఈశ్వరుడు సర్వవ్యాపకుడైనందున సమస్తమందు గలడు; జడమందుగూడ గలడు; ప్రాణరహిత పదార్థమందు గూడ గలడు. ఇందువలన జడపదార్థమందు ఈశ్వరుడున్నా డనియు, అహమను పదార్థము లేదనియు నిశ్చయమగుచున్నది. జడమందు అహముండదు. మతవాదుల కథనానుసారము "ఈశ్వరుడు" సర్వవ్యాపకుడై సమస్తమందుండును. కాని "అహము" జీవమున్నచోటనే యుండును జీవుడే "అహం" (నేను) అని చెప్పగలదు. ఇదువలన ఈ "అహము" జీవుని యొక్క పేరు; ఈశ్వరునిదికాదు. ఈ జీవాగ్నినే వైశ్వానరు డని చెప్పుచున్నారు. జీవరూపియగు అగ్నియున్నచోటనే భోజ నము పచనమగును, అకలియగును, ప్రాణాపానవాయువులుగూడ సంచరించును. అయితే మతఈశ్వరుడు సర్వవ్యాపకుడని, మత వాదులు భావించుచున్నారు. ఇందువలన జడమై చల్లగనుండు మృతశరీరమందుగూడ ఈశ్వరుడుండవలయును. జీవునివలన గాకుండ ఈశ్వరునివలనగూడ అగ్నిసంబంధమగునెడల తన శరీ రముగూడ వేడిగ నుండవలయును; శరీరమందుగూడ ప్రాణా పానరూపమున శ్వాస నడువవలయును, అకలి కలుగవలయును; భుజించి పచనము చేసికొనవలయును. కనుక "అహము" ఈశ్వరపరముగ నుపయోగింపబడియుండలేదు; ప్రాణాపాన యుక్తమై, అకలి గలిగి అన్నమును పచనముజేసికొనజాలు జీవుని పరముగ మాత్రమే ప్రయోగి పబడినది.

ఈ శ్లోకమునలన ఈ "అహము" ప్రాణాపానములు లేని దాని పరముగగాదని తెలియుచున్నది. మతఈశ్వరుడు ప్రాణాపానములు లేనిచోటనుగూడ నుండును. జీవుడు ప్రాణాపానముల నాశ్రయించియే యుండును. ఈ "అహము" శ్రీకృష్ణుని పరముగకూడ నుపయోగింపబడియుండలేదు; ఎందుచేతనన ? ఈ శ్లోకమందు-

శ్లో॥ "అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః"

అనగా- "అహం" (నేను) అనునది సమస్త జీవధారుల దేహమందు స్థిరముగ నున్నదని చెప్పబడినది. శ్రీకృష్ణుడుకూడ స్థూలదేహముగల ఒక ప్రాణిమాత్రమే! ఇతడు సమస్తప్రాణుల దేహమందుండుట యసంభవము. ఇందువలన గీతయందలి "అహము" మాననమాత్రుని "ఆత్మ"కు మాత్రమే వర్తించునదియై యున్నది. సంప్రదాయబద్ధుడగు "ఈశ్వరు"నకుగాని, దేవతకుగాని వర్తింపదు. ఈ "అహము"ను శ్రీకృష్ణునిపరముగ నర్థముచెప్పినను చాల పొరపాటును చేసినవారగుదుము.

స్వయముగ శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు-

శ్లో॥ సర్వస్యచాహం హృదిసన్నివిష్టో
మత్తః స్మృతిర్జ్ఞాన మపోహనంచ,
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో
వేదాంత కృద్వేదవిదేత చాహమ్.

(గీ. అ. 15-15)

ఈ "అహము" సర్వుల హృదయమందున్నది; అనగ అందరి అంతర్భాగములనుండి "అహము" మాట్లాడుచున్నది. ఈ "అహము" వల్లనే స్మృతి, జ్ఞానము, ఆపోహనము గలుగు చున్నది. సమస్త వేదములద్వారా ఈ "అహము" తెలిసికొన దగియున్నది. ఈ అహమే వేదాంతకర్త, వేదవేత్తకూడ నైయున్నది. ఈ "అహము" శ్రీకృష్ణభగవానుని పరముగ లేదా పరమేశ్వరపరముగ చెప్పబడియున్నయెడల "వేదవేత్త" అని ప్రయోగింపబడదు. మతవాదుల కథనానుసారము భగవంతుడు వేదకర్తయని భావము; వేదకర్తకు వేదములు తెలిసిన వాడని ప్రయోగించుట అసందర్భము. ఇదిగాక మత-ఈశ్వరునకు "ఆపోహన" వర్తింపదు. "ఇది చేయవచ్చునా? ఇది చేయకూడదా?" అని అని అనుమానించు ఒక మానసిక స్థితికి ఆపోహన మనిపేరు. ఇది జీవునియందుండును; ఈశ్వరునియందుండదు. "ఈశ్వరుడు" ఏది చేయవలయునో, ఏది చేయకూడదో నిశ్చయముగ తెలిసికొనగలిగియుండును; మతవాదులు ఈశ్వరుని సర్వజ్ఞుడని చెప్పచుందురు. కనుక ఆపోహన మను స్థితి అతనికి కలుగదు. గీతయందెక్కడెక్కడ "అహము" ప్రయోగింపబడినదో అని ఈశ్వరపరముగను, భగవంతుని పరముగను, శ్రీకృష్ణునిపరముగను అర్థముచేసికొనరాదని స్థిరపడుచున్నది.

శ్లో॥ ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా।
(గీ. అ. 10-12)

శ్లో॥ జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు।
(గీ. అ. 7-9)

ఇంద్రియములయందలి మనస్సు, ప్రాణులయందలి చేతన ఈ "అహాము" (నేను) అయిడున్నది. జీవులయందలి చేతన భగవంతుడైనయెడల జీవుడెవరు? ప్రాణులయందుగల చేతనమే జీవుడు; భగవంతుడుకాడు. ప్రాణులయందలి జీవము, సజీవతాత, తపస్యాలయందలి తపస్సు లేక తేజస్సు ఈ "అహాము" (నేను) అను పదార్థమే అయిడున్నది.

ఈ "అహమ్" (నేను) "మామ్" (నన్ను) అనువానిని గీతయందలి 10వ అధ్యాయపు మూడవ శ్లోకమందు మహేశ్వరునిగ భావించి– "యోమామజమనాదించవేత్తి లోకమహేశ్వరమ్" అని చెప్పియున్నాడు. ఈ మహేశ్వరుడనగ నెవరో గీతయొక్క– 13వ అధ్యాయపు 22వ శ్లోకమందు వివరింపబడినది.

శ్లో॥ ఉపద్రష్టానుమంతాంచ భర్తా భోక్తామహేశ్వరః।
పరమాత్మేతి చాప్యుక్తో దేహేస్మిన్ పురుషః పరః॥

ఈ మహేశ్వరుడు ఉపద్రష్టా అనగ సమీపస్థుడై నిరీక్షించువాడు, భరించువాడు, అనుభవించువాడు, అంగీకరించువాడుకూడనైయున్నాడు. భగవంతుడు అనుభవింపజేయువాడుగాని, అనుభవించువాడుకాడని మతవాదుల అభిప్రాయము; నిశ్చయించువాడుగాని అనుభవించువాడుకాడు. అనుమానించువాడు, అనుభవించువాడు జీవుడేగాని మతభగవంతుడుకాడు. రేపు ఇది జరుగునా? జరుగదా? అని అనుమానించువాడు జీవుడు మాత్రమే! భగవంతుడు పాపపుణ్యఫలములను అనుభవింపజేయువాడుగాని, అనుభవించువాడుకాడు. గీతయందలి

భగవంతుడు అనుమానించువాడని, అనుభవించువాడని, శరీర రూపియగు ఈ బ్రహ్మాండమందు అందరికన్న సమీపద్రష్టుడని చెప్పబడియున్నది. మనకు మన శరీరమందు అన్నిటికన్న అతి సమీపస్థమెయున్నది ఈ "అహము" మాత్రమే! జీవుడు ద్రష్ట, జ్ఞాతయేగాకుండ, ఉపద్రష్టకూడనై యున్నాడు. "ఉప సమీపే" అన్నిటికన్న సమీపవర్తియై పరికించువాడు జీవుడు మాత్రమే! గీతారచయిత ఈ జీవునే – "పరమాత్మా ఇతి చ అపి ఉక్తః" పరమాత్ముడని చెప్పుచున్నాడు. "దేహేస్మిన్ పురుషః పరః" ఈ దేహమందే ఆ పరమపురుషుడున్నాడు. "పర" అనగ గీతయందు "శ్రేష్ఠమైన" అని అర్థము

శ్లో॥ ఇంద్రియాణి పరాణ్యాహు రింద్రియేభ్యః పరం మనః।
మనసస్తు పరాబుద్ధిర్యోబుద్ధేః పరతస్తు సః॥
(గీ. అ 3-42)

దేహాదులకన్న ఇంద్రియములు, ఇంద్రియములకన్న సంకల్పాత్మకమగు మనస్సు, మనస్సునకన్న నిశ్చయాత్మకమగు బుద్ధి, దీనికి సాక్షీభూతమైయున్న ఆత్మ సర్వోత్కృష్టమైనదని పండితులు చెప్పుచున్నారు. కాన "పర" అనగ శ్రేష్ఠమనియే అర్థము.

గీతయందలి "అహమ్" "మామ్" అనువానిని మత ఈశ్వరపరముగ చెప్పబడియుండలేదు. ఎందువలన? ఈ అహమునకు ఉపవాసము చేయుటచే దుఃఖము కలుగును. ఇది

శుష్కించిపోవునుకూడ! ఇది శరీరమందే యుండును; వెలుపల నుండదు.

శ్లో॥ కర్శయంత శ్శరీరస్థం భూతగ్రామమచేతసః।
మాంచైవాంతశ్శరీరస్థం తాన్విద్ధ్యా సురనిశ్చయాన్॥
(గీ. అ. 17-6)

అజ్ఞానులు వ్రతోపవాసముల జేయుచు తమ శరీరమం దున్న ఇంద్రియ సమూహమును, కర్మసాక్షియగు "మామ్"ను కృశింపజేయుచున్నారు. ఇట్టివారిని అసుర ప్రకృతిసంభూతులుగ తెలిసికొనవయును. ఈ "మామ్" శరీరస్థమైయున్న కారణ మున వ్రతోపవాసములవలన కృశించిపోవుచున్నది. భగవంతుడు ఉపవాసము చేయుటవలన చిక్కిపోవునా? తినుటవలన బల పడునా? గీతయందు మిక్కిలి పొగడబడిన శరీరస్థమగు ఈ "మామ్" కృష్ణరూపియగు భగవంతుని పరముగ చెప్పబడ లేదనియు నిర్ధారణ యగుచున్నది. ఉపవాసమువలన, శుష్కించువాడు "మామ్" రూపియగు జీవుడుమాత్రమే అయిఉన్నాడు. గీతయందలి "మామ్" అను శబ్దము మతఈశ్వరపరముగ కూడ ప్రయోగింపబడి యుండలేదని తమకిపుడు విశదమై యుండును.

★ ★ ★ ★

శివ అధ్యాయము

గీత మతఈశ్వరునంగీకరించుచున్నదా?

గీత ఈశ్వరు నంగీకరింపలేదు; వాస్తవము! ఈశ్వరు డనగ మతవాదు లంగీకరించు ఈశ్వరుడని నా భావము. ఇతని వ్యక్తిత్వమును జీవునికన్న వేరుగ మతవాదు లంగీకరింపుచు న్నారు; ఈశ్వరుడు జీవుడుకాడని చెప్పుచున్నారు. కాని గీత ఈ జీవునే, ఈ యాత్మనే ఈశ్వరునిగ నంగీకరించుచున్నది.

శ్లో॥ ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి।
భ్రామయ న్సర్వభూతాని యంత్రారూఢాని మాయయా॥
(గీ. అ. 18–61)

ఓ అర్జునా! ఈశ్వరుడు సర్వప్రాణుల హృదయప్రదేశము లందున్నాడు. (తన సంకల్ప వికల్పములుగల మనస్సుద్వారా) శరీరమను యంత్రమందుండి సమస్త ప్రాణులను ఆడించుచు న్నాడు. గీతాకారచయితయొక్క భావము మతఈశ్వరుడే అయిన యెడల కేవలమతనిని హృదయప్రదేశమందే యున్నట్లుచెప్పడు. మతవాదులు మతఈశ్వరుని సర్వవ్యాపకునిగ నంగీకరించుచు న్నారు. హృదయమందే గాకుండ సమస్త ప్రదేశములందు న్నట్లంగీకరించుచున్నారు; ఇందువలన అతనిని సర్వవ్యాపకు డని చెప్పుచున్నారు.

ఇక్కడ ఒక విషయము విమర్శింపదగియున్నది. గీత

యందలి ఈశ్వరుడు మతమందు చెప్పబడిన ఈశ్వరుడుమాత్రము కాడు. గీతయందలి ఈశ్వరుడే సమస్త ప్రాణులను త్రిప్పుచు, నడిపించుచు, నాట్యమాడించుచున్నాడు. ఇట్లుచేయువాడు జీవుడుమాత్రమే! మతఈశ్వరుడు కాడు. బీసమున్నంతవరకే ప్రాణికోటియొక్క శరీరము నడచును, నాట్యముచేయును; ఇది వెడలిపోయిన తరువాత మృతమై జడపదార్థమగుచున్నది. మత వాదులు మతఈశ్వరుని అఖండరూపమున సర్వవ్యాపకుడని నమ్ముచున్నారు. మతవాదుల కథనానుసారమతడు సర్వవ్యాపకుడైయున్న కారణమున శవశరీరమందుకూడ నుండితీరవలయును. ఎవనిని సర్వవ్యాపకునిగ తలంచుచున్నారో అతడు లోపల వెలుపల సమానరూపముగ నుండవలయును. మృత శరీరమందుకూడ నుండితీరవలయును. ఇందువలన ప్రాణులను త్రిప్పువాడు జీవుడనియు, మతఈశ్వరుడు కాడనియు స్థిరపడుచున్నది. దీనికి మతఈశ్వరుడే కారణమైన శవముకూడ తిరుగుచు గంతులిడవలెను. మతఈశ్వరుడు సర్వవ్యాపకుడైనందున శవశరీరమందుకూడ నుండవలయును; ఇతడు శరీరమును విడిచి బయటకుపోవు ప్రశ్న ఉదయింపదు! సర్వవ్యాపకుడు శరీరము నుండి ఎక్కడకు పోగలడు? శవశరీరమందున్నపుడు అది యెందుకు తిరుగలేకపోవుచున్నది? కావున గీతయందు వర్ణింపబడిన ఈశ్వరుడు జీవుడే అయిఉన్నాడు; మతఈశ్వరుడు కాడు.

పాపపుణ్యములు చేయుటలో జీవుడు స్వతంత్రుడు. పాపము చేసినపుడు మాత్రమీశ్వరుడు జీవుని దండించునని

చెప్పుచున్నారు. ఒకవేళ సిద్ధాంతానుసారము తన మాయతో నడిపించుచు త్రిప్పుచున్నయెడల, పాపముకొరకు ఈశ్వరుడు మానవు నెందులకు దండించును? ఈ సిద్ధాంతానుసారము తన మాయతో అందరిని నడుపుచున్న ఈశ్వరుడే పాపపుణ్యాలకు భోక్తకావలసియున్నది.

ఈశ్వరుడే తన మాయతో మోహింపజేసి తన వశమందుంచుకొని అందరిచేత చేయించుచుండినయెడల దాని శిక్ష జీవున కెందులకు వర్తింపవలయును? జీవుడే కర్మఫలమునను భవించుట ప్రత్యక్షమేగదా! ఇందువలన ప్రాణుల నాడించునది మతఈశ్వరుడు కాడని, జీవుడేయని నిశ్చయమగుచున్నది. గీత యందీ జీవుడే ఈశ్వరుడని వర్ణింపబడియున్నాడు.

శ్లో॥ ఉపద్రష్టానుమంతా చ భర్తాభోక్తా మహేశ్వరః।
పరమాత్మేతి చాప్యుక్తో దేహేస్మిన్పురుషః పరః॥
(గీ. అ. 13-22)

ఈ శ్లోకమునకు మతస్థులు మతఈశ్వరపరముగానే అర్థము చెప్పుచున్నారు. కాని ఈ శ్లోకమందా వాసన ఏమియులేదు. మతవాదులు మతఈశ్వరుని పాపపుణ్య భోక్తగ నంగీకరింపరు. కాని ఈ శ్లోకార్థము ననుసరించి - ఏ పరమేశ్వరుని మహేశ్వరుడని చెప్పబడినదో అతడు భోక్తకూడనై యున్నాడు. మత ఈశ్వరుడు భోక్త కాజాలడు; భోక్త జీవాత్మయే కాగలడు! ఇతడే కర్త, భోక్తకూడనై యున్నాడు. భర్త అనగ - భరణ పోషణాదులను నిర్వహించువాడని యర్థము. మతఈశ్వరుడు

భర్తకూడ కాజాలడు; జీవుడు మాత్రమే! ఒకవేళ ఈశ్వరుడు భర్తయగుచో శవశరీరపు భరణపోషణాదులనుకూడ నిర్వహింప వలసియున్నది. ఈ జీవుడు గతించిన తరువాత శరీరము కుళ్ళి శిధిలమైపోవును. కారణము? – శరీరపు భరణపోషణాదులను చూచు జీవుడిపు డందులేడు. కనుక శరీరమునకు భర్త జీవుడే! ఈశ్వరుడుకాడు. ఆ పరమాత్మ, పరమ పురుషుడు ఈ దేహమందే గలడని ఈ శ్లోకమందు చెప్పబడినది. "పురుషః పరః" ఆ శ్రేష్ఠపురుషుడు, మహాత్ముడు ఈ శరీర మందే గలడు. అతనినే పరమాత్మయనికూడ చెప్పుచున్నారు. "పరమాత్మేతి చ ప్యుక్తో దేహేస్మిన్ పురుషః పరః"

"పురుషః పరః అనగ – ఆ పురుషుడు పంచభూతాత్మక మైన సమస్త ప్రపంచముకన్న శ్రేష్ఠుడని యర్థము. గీతయందలి "పరశబ్దము" శ్రేష్ఠత్వము అను అర్థమునందు ప్రయోగింపబడి నది. ఈ క్రింది శ్లోకమును గమనింపుడు–

శ్లో॥ ఇంద్రియాణి పరాణ్యాహు ఇంద్రియేభ్యః పరం మనః।
మనసస్తు పరాబుద్ధిర్యోబుద్ధేః పరతస్తు సః॥

(గీ. అ. 3–42)

పాంచభౌతికమగు ఈ జడశరీరముకన్న • ఇంద్రియములు శ్రేష్ఠమైనవి. ఈ ఇంద్రియములకన్న మనస్సు గొప్పది. మనస్సు కన్న బుద్ధి గొప్పది. బుద్ధికన్న గొప్ప వస్తువు "ఆత్మ" అయి ఉన్నది. కావున ఈ శ్లోకార్థముతో నాలోచించినయెడల గీత

యుండెదెవనిని గురించి పరమాత్మయని, పరమేశ్వరుడని కీర్తింప బడినదో అతడు జీవుడేయని తెలియుచున్నది. ఈ క్రింది శ్లోకమును చూడుడు–

శ్లో॥ శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధా నివాశయాత్॥
(గీ. అ. 15–8)

వాయువు గంధప్రదేశమునుండి గంధమును గ్రహించి దానిని మరియొక స్థానమునకు తీసికొనిపోవుచుండును; అదేవిధముగ జీవరూపియగు ఈశ్వరుడు శరీరమును త్యజించునపుడు, అందుండి జ్ఞానేంద్రియములను, మనస్సును గ్రహించి నూతన శరీరమునకు తీసికొనిపోవుచున్నాడు. శరీరమును విడుచువాడు, గ్రహించువాడు ఈశ్వరుడే! కావున గీతయందలి ఈశ్వరుడు మతఈశ్వరుడుకాడని తెలియుచున్నది. మతఈశ్వరుడు సర్వ వ్యాపకుడై యున్నంచున ఒక శరీరమును విడిచి రెండవ శరీరమందెట్లు ప్రవేశింపగలడు? అతడు మొదటినుండియు సర్వ వ్యాపకుడైయున్నాడు; గీతాఈశ్వరుడు మాత్రము జననమరణములను పొందుచున్నారు. ఇందువలన ఇతడు మానవుడే! కావున ఈ మానవుడు లేక జీవుడే ఈశ్వరుడైయున్నాడు. ఇది తమకు విచిత్రముగ తోచవచ్చును; కాని ఇదియే సత్యము! గీతయందు మానవుడు లేక ఆత్మమాత్రమే ఈశ్వరుడని అంగీకరింపబడినది.

"మానవుడు" అనునది కేవలము శరీరమునొక్క పేరు

కాదు; శరీరయుక్తమగు ఆత్మనే మానవుడు. జీవహీనమగు శరీరము మానవుడుకాడు; మృతశరీరముమాత్రమే! ఇప్పటి చట్టము ననుసరించి, నిర్జీవ శరీరమును కాల్చివేయుటనలన ఏ మానవునిపైన హత్యాపరాధము మోపబడదు. మతధర్మ శాస్త్రముల ననుసరించికూడ, మృతశరీరమును కాల్చుటవలన మానవుని చంపిన పాపమంటదు. ఇందునలన మృతప్రాయమగు మత-ఈశ్వరుడు (మజహబీ ఖుదా) ఈశ్వరుడుకాడు. శరీరమును త్యజించునట్టి, గ్రహించునట్టి జీవాత్మమాత్రమే గీతామతానుసారము ఈశ్వరుడైయున్నాడు. పక్షపాతరహితముగ గీతలోని యిట్టి శ్లోకముల యర్థమును తాము అవగాహన చేసికొనిన యెడల ఆత్మజ్ఞానప్రాప్తికి అవకాశము చిక్కగలదు. నాచే రచింపబడిన ఇతర ఆత్మజ్ఞాన గ్రంథములను తాము అధ్యయనము చేసినయెడల సత్యజ్ఞానమునుపొంది జీవన్ముక్తులగుదురు. ఈ క్రింది శ్లోకమును చూడుడు.

శ్లో॥ శ్రోత్రంచక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణ మేవ చ।
అధిష్ఠాయ మనశ్చాయం విషయా నుప సేవతే॥
(గీ. అ. 15-9)

ఈ జీవరూపియగు ఈశ్వరుడు త్వక్ చక్షుశ్శ్రోత్రరసన ఘ్రాణేంద్రియములద్వారాను, విషయములైన శబ్దస్పర్శరూప రసగంధముల ననుభవించుచున్నాడు.

కనుక ఇంద్రియములద్వార విషయముల ననుభవించు మానవుడే గీతాకథనానుసారము ఈశ్వరుడని బాగుగ స్పష్టమగు

చున్నది; గీత మత-ఈశ్వరుని ఈశ్వరుడని అంగీకరింపలేదు; మానవునే ఈశ్వరునిగ గుర్తించినది. మనోమయుడైన కారణమున మానవుడు అవశ్యము ఈశ్వరుడే! కాని అతనికి - "నేను ఈశ్వరుడను" అను నిశ్చితమగు జ్ఞానముండియుండవలయును. ఈ దృఢ జ్ఞానశూన్యుడగు మానవుడు ఈశ్వరుడు కాజాలడు. స్వస్వరూపజ్ఞానప్రాప్తికి నిశ్చయముగ ఆత్మజ్ఞానప్రదములగు గ్రంథములను స్వాధ్యాయము చేయుట, ఆత్మజ్ఞానుల సత్సంగముచేయుట మరియు నిజమగు యోగసాధనచేయుట మానవునకు ముఖ్యావసరమైయున్నది ఈశ్వరవర్ణనముగల మత గ్రంథములను స్వాధ్యాయము చేయుటవలన ఉపయోగముండదు. వేనియందు ఆత్మజ్ఞాన విషయములు వర్ణింపబడియుండునో అట్టి గ్రంథములను స్వాధ్యాయము చేయవలయును. మతగ్రంథ పఠనము స్వాధ్యాయము కాజాలదు; ఈశ్వరాధ్యాయనమగును, అసత్యాధ్యాయనమగును. మజహబీధ్యాయనమగును, గులామ్ధ్యాయనమగును

"స్వస్వఅధ్యాయః స్వాధ్యాయః" తన్ను తాను తెలిసికొనుట స్వాధ్యాయము. ఆత్మశక్తితోను, మనోబలముతోను తోను పరిచయముగల పాఠములను అధ్యయనము చేయుటయే స్వాధ్యాయము. మతగ్రంథములందుకూడ అక్కడక్కడ ఆత్మజ్ఞానము వర్ణింపబడినది; అతి స్వల్పమైన కారణమున మతము యొక్క అతిశయోక్తులలోను, అసంభవ విషయములలోను విలీనమై కొట్టుకుపోయినది. ఇందువలన మతగ్రంథముల పఠిం

చువారు, అధ్యయనము చేయువారు నిజమగు ఆత్మజ్ఞానమును పొందజాలకున్నారు.

నాచే రచింపబడిన గ్రంథములందు కేవలము ఆత్మజ్ఞానమే గలదు. ఇది ఉన్నత భావనలద్వారా మానవుని ఉన్నతస్థాయికి తీసికొనిపోయి, హృదయమందలి భయమును, దాసతాభావమును పెకలించివేయును. ఇందువలన మానవుడు పరమపదమునుపొంది జీవన్ముక్తుడు కాగలుగును.

వాస్తవముగ ఈశ్వర వ్యక్తిత్వమునకు అస్తిత్వమే లేదు. ఈశ్వరుడు, జీవుడు లేక ఆత్మ ఈ మూడు శబ్దములు గీతాసిద్ధాంతానుసారము పర్యాయపదములే! ఈ మూడు ఒకదానిపేర్లే. గీతయందలి అనేక శ్లోకములు ఈ భావమునే స్థిరపర్చుచున్నవి. మతపక్షపాతులు మూర్ఖతనలన ఈ విషయమును గ్రహింపజాలరు. -ఈ క్రింది శ్లోకమును చూడుడు.

శ్లో॥ అవజానంతి మామ్ మూఢామానుషమ్తనుమాశ్రితమ్।
పరం భావ మజానంతోమమ భూతమహేశ్వరమ్॥
(గీ. అ. 9–11)

"మహేశ్వరుడు" -ఈ మానవాత్మయే అయిఉండినట్లు గీత యందలి 13వ అధ్యాయపు 22వ శ్లోకమందు చెప్పబడియున్నది. ఈ శ్లోకమందు "భూత" శబ్దమునకు పంచభూతములని అర్థము. నాయొక్క ఉన్నతభావోపేతములగు సిద్ధాంతముల తెలిసికొనజాలనివారు ఈ భూతమహేశ్వరునికూడ (శరీరస్థ పంచభూతనాయకుని) తెలిసికొనజాలకున్నారు.

ఈ శ్లోకమందు శరీరస్థ పంచభూతములకు లేదా శరీర మునకు మహేశ్వరుడని స్పష్టముగ వివరింపబడినది.

ఇందునుగురించి కొందరు శ్రీకృష్ణుడు తన శరీరమందున్న కొన్నినే మహేశ్వరుడని చెప్పియుండునని భావించుచున్నారు. స్వయముగ శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు.

శ్లో॥ అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః
(గీ. అ. 10_20)

ఓ అర్జునా! ఈ "అహము" గీతయందు చెప్పబడిన ఆత్మయే! గీతయందు "ఆత్మ" "అహమ్" అని చెప్పబడినది. ఈ "అహమ్" రూపియగు ఆత్మ సమస్త ప్రాణుల హృదయ ములందు స్థిరమైయున్నది

మతభక్తుల కథనానుసారము శ్రీకృష్ణుడే భగవంతుడైన యెడల - ఆ భగవంతుడే సర్వప్రాణుల హృదయములందు ఉన్నట్లు "అహమే" శ్రీకృష్ణుడు; ఈ "నేను" అనునదియే భగవంతుడు అని చెప్పుచున్నాడు. ఇందువలన ఈ శ్లోకము ననుసరించి అందరియందుండి "నేను" "నేను" అని పలుకునట్టి జీవుడే శ్రీకృష్ణపరమాత్మ అయియున్నాడు.

కర్మయోగులకు కురుక్షేత్రరూపమగు ఈ స్థూలశరీరమే రణరంగము; ఇందు యుద్ధముచేయు మనస్సే అర్జునుడై యున్నాడు. ఇంద్రియములను, గుణములను పూడ్చబడిన సూక్ష్మశరీరరూపియగు రథమునకు, ఆత్మజ్ఞానమును సారథిగ చేసికొనినయెడల ఈ కర్మక్షేత్రమందు విజయమును పొంద గలుగుదుము. గీతయందు చెప్పబడిన కృష్ణుడు ఒకవ్యక్తిమాత్ర

ముకాదు! ఆత్మయని చెప్పబడు శరీరమందలి ఈ "అహమే" శ్రీకృష్ణుడైయున్నాడు. ఈ క్రింది శ్లోకమును చూడుడు.

శ్లో॥ అహ మాత్మా గుడాకేశ సర్వభూతాశయ స్థితః।
(గీ. అ. 10_20)

ఓ అర్జునా! "నేను" అని చెప్పబడునదియే సర్వహృద యాంతర్గతమైన ఆత్మ "నేను" "నేను" అని అందరి హృదయ ములనుండి ఆత్మయే పలుకుచున్నది. తమ స్వకీయమును, తమ ఆత్మను ప్రజలందరు "నేను" అని చెప్పుచున్నారు. తాము ఎవరి నైనా "నీవెవరవు?" అని అడిగినపుడు, అతడు ముందు "నేనే" అని పలుకును. గీతయందు ఆత్మకు అహమని చెప్పబడినది. ప్రజలు ఆత్మకు "ఈశ్వరుడు" అనికూడ అర్థమును చెప్పవొచ్చు లిడిరి అందుచేత గీతయందు ఆత్మకు "ఆత్మ" యని చెప్పక "అహమ్" అని సంబోధించిరి; ఎందుచేత? ఈశ్వరుడు సర్వ వ్యాపకుడైనకారణమున మృతశరీరమందు కూర్చునియున్నాడు కాని అందు నేను అని పలుకువాడెవడును లేడు. జీవముగల శరీరమునుండియే "నేను" "నేను" అను శబ్దము వెలువడుచున్నది. ఇందువలన "నేను" అని పలుకు ఈశ్వరుడే ఉన్నచోటుల, ఒక నిర్జీవ శరీరముకూడ "నేను" "నేను" అని పలుకును. కనుక దేనియందు జీవముండదో అందుండి "నేను" "నేను" అను పలుకురాదు! ఇందువలన "అహము" అను పేరు జీవునిదే! గీతయందు ఈ జీవుడే ఈశ్వరుడని అంగీకరింపబడినది. గీతయందీ సంగతి శ్రీకృష్ణుని ముఖతః అనేక పర్యాయములు "నేను"

అనునది ఆత్మయని, ఈ ఆత్మయే శ్రీకృష్ణుడని చెప్పబడినది. అందరు తమనుగురించి "మేము" "నేను" అని చెప్పచుందురు. ఆత్మకు అహమనునది మారుపేరని అందరికి తెలిసిన విషయమే! ఇందువలన గీతలో చాలచోట్ల ఆత్మకొరకు అస్మచ్ఛబ్దము యొక్క రూపములు— ("అహమ్" "మామ్" "మమ") ప్రయోగింపబడినవి. ప్రాణుల అంతర్భాగమునుగల చేతనశక్తి ఆ "అహమే" అయియున్నది.

శ్లో॥ ఇంద్రియాణాం మనశ్చాస్మి, భూతానా మస్మి చేతనా.
(గీ. అ. 10–22)

గీతయందంతట ఈ "అహమ్" "మామ్" "ఆత్మ" యొక్క గొప్పతనమే కీర్తింపబడినది. గీత మతఈశ్వరు నంగీకరింపలేదు; ఎక్కడనైన ఈశ్వరుడని ప్రయోగింపబడినయెడల "ఆత్మ" పరముగనే, "అహమ్" పరముగనే ప్రయోగింపబడినదై యున్నది.

శ్లో॥ జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు.
(గీ. అ. 7–9)

ఇందువలన "శ్రీకృష్ణ" శబ్దము, "ఈశ్వర" శబ్దము, "మహేశ్వర" శబ్దము, "అహమ్" శబ్దము, "ఆత్మ" శబ్దము, "క్షేత్రజ్ఞ" శబ్దము, "మామ్" మరియు అస్మచ్ఛబ్దరూపములు గీతయందు సమానార్థకములైన పర్యాయవాచక శబ్దములుగ నుపయోగింపబడినవి. కనుక గీతాసిద్ధాంతానుసారముగ ఈ "జీవుడు" "ఆత్మ"యే ఈశ్వరుడైయున్నాడు; ఈ యాత్మయే

శ్రీకృష్ణుడు, ఈ యాత్మయే మహేశ్వరుడు, పరమేశ్వరుడు కూడనై యున్నది. "అహమ్" అనగ ఆత్మయే! గీతాసిద్ధాంతములు ఈ ఉపనిషత్తులనుండి గ్రహింపబడినవి.

శ్లో॥ సర్వోపనిషదో గావో దోగ్ధాగోపాల నందనః।
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్॥

ఉపనిషత్తులను ఆవులనుండి శ్రీకృష్ణుడు పాలను పితికెను. గీతయందు ఆత్మపరముగ "మామ్" ప్రయోగింపబడినది. ఉపనిషత్తులయందుకూడ "ఆత్మ"ను మొదట "అహమ్" అనియే ప్రయోగింపబడినది.

ఈ క్రింది బృహదారణ్య ఉపనిషత్ యొక్క వాక్యమును చూడుడు.

శ్లో॥ ఆత్మైవేద మగ్ర ఆసీత్ పురుషవిధః సోఽనువీక్ష్య
నాన్యదాత్మనో పశ్యత్ సోఽహమస్మీత్యగ్రే వ్యాహరత్
తతోకఽహన్నామాభవత్ తస్మాదప్యేత ర్హ్యామన్త్రితోఽహమ
య మిత్యేవాగ్ర ఉక్త్వాథాన్యన్నామ ప్రకృతే యదస్య భవతి॥

(బృ-అ-1బ్రా-4 మంత్ర-1)

అర్థము= నిశ్చయముగ నీ యాత్మయే మొదట పురుష రూపముతో నుండెను. ఇతడు నాల్గువైపుల పరికించి చూచినపుడు తానుతప్ప మరి ఎవరును కనుపించలేదు. (ఇతనినే మత ఈశ్వరుడని కల్పన చేయబడినది.) ఇతరులెవరు కనుపించనందున

మునుముందు - "అహమస్మి", "అహమస్మి" ("నేనున్నాను" "నేనున్నాను") అని పలికెను. ఇందువలన ఈ యాత్మను "అహమ్" అనుపేరున పిలువబడుచున్నది.

ఇపుడుకూడ ఎవరినైన - నీవెవరవు? అని ప్రశ్నించిన యెడల మొదట "నేనే!" ("అహమస్మి") అని పలుకును. "నేననగ?" అని తిరిగి ప్రశ్నించిన మీదట తన వ్యవహార నామమును చెప్పును. ఇందువలన గీతయందుకూడ మానవ శరీరమందు ఏ "అహమ్" ("నేను") ఉండియున్నదో-అదియే "ఆత్మ", అదియే "పరమేశ్వరుడు" అని నొక్కి వక్కాణింప బడినది. గీతయందు మతఈశ్వరు నంగీకరింప లేదు. గీతాశ్లోకము లను స్వతంత్రముగ, నిష్పక్షపాతముగ ఆలోచించినయెడల నిదే విషయమే ప్రకటితమగుచున్నది. గీత ఉపనిషత్తుల నాధారము జేసికొని రచింపబడినది; కావున గీతయందుకూడ ఆత్మకు మారుపేరు "అహమ్" అనియే ప్రసిద్ధమైపోయినది.

శ్లో॥ సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్।
వినశ్య త్స్వవినశ్యంతం యః పశ్యతి నపశ్యతి॥
(గీ. అ. 13-27)

(వినశ్యత్సు) నశించు స్వభావముగల శరీరమందు (అవినశ్యంతం) నాశరహితుడైనట్టిన్ని, జీవరూపియైనట్టిన్ని, పరమేశ్వరుని సమస్త ప్రాణులయందు సమానరూపముగ నెవడు చూచుచున్నాడో అతడే తెలిసినవాడని యర్థము. అవినాశియగు జీవుడు, నాశస్వభావముగల శరీరమందు సమానరూప

మున వర్తమానుడై యున్నాడు; దీని నెనడు గుర్తించి తెలిసి కొనగలుగునో అతడే విజ్ఞుడగును.

ఈ శ్లోకమందు "సమం సర్వేషు భూతేషు" అనగ సమస్త ప్రాణులయందు సమానరూపమున వర్తమానుడై యున్నాడని అగ్గము. సాంప్రదాయికవాదులు గీతను పఠించు చున్నప్పటికి- శ్రీకృష్ణుని శరీరమందు విశేషరూపమున పరమే శ్వరుడున్నాడని, ఇతరుల శరీరమందున్న "ఆత్మ" పరమేశ్వరుడు కాడని, భావించుచున్నారు. జీవరూపియగు పరమేశ్వరుడు సమస్త ప్రాణులయందు సమానముగ ప్రకాశించుచున్నాడు; దానిని చూచువాడుమాత్రమే దృష్టిగలవాడు; చూడజాలని వాడు అంధప్రాయుడని గీత అభిప్రాయము.

ఈ గీతాసిద్ధాంతము జీవుని ఈశ్వరునిగ భావించనివారిని అంధులని వర్ణించియున్నది. పరమేశ్వరుడు సర్వాంతర్యామియని మతవాదుల భావము; ఈశ్వరుడందరియందు నుండవలయును. సర్వజ్ఞుడగు ఈశ్వరుడు సర్వవ్యాపకుడగుటవలన మానవులలో మూర్ఖులుండరాదు. మానవుని ప్రతి యణువునందు, ప్రతి కణమునందు మతఈశ్వరుడు వ్యాపకుడై యున్నపుడు, మాన వులలో మహామూర్ఖులుండవలసిన పనిలేదు. నిరామయుడని, నిర్వికారుడని, పరమ పవిత్రుడని చెప్పబడు మతఈశ్వరుడు శరీ రస్థుడై యున్నపుడు, మానవులు లౌకికయోగులు, కుష్ఠురోగులు కాగూడదు; నిర్బలులై యుండరాదు. ఇందువలన మతఈశ్వ రుడు, ప్రాణికోటియొక్క శరీరమందుకూడ లేడని స్థిరపడు

చున్నవి. శరీరమందు వ్యాపకుడై యున్నవాడు "జీవుడు" మాత్రమే! గీతామతానుసారముగ ఈ జీవుడే పరమేశ్వరుడు. మతవాదులు చెప్పినట్లు ఈశ్వరుడు లేడు; ఉండజాలడు! మత ఈశ్వరుని అస్తిత్వము అత్యంత అసత్యము, అభావముమాత్రమే నై యున్నది. మతఈశ్వరుడున్నట్లు జీవుడెట్లుండగలడు ? లేని ఈశ్వరునివలె జీవుడెవ్విధముగ నుండగలడు ? గీతాసిద్ధాంతముల తెలిసికొనజాలనివారిని మూర్ఖులని, అంధులని గీత మాటమాటకి హెచ్చరించినది.

ఈశ్వరరూపియగు జీవుని. కల్పిత ఈశ్వరునికి, బానిసగ, దాసునిగ భావించుటయే ఆత్మహత్యా సదృశము. ఇట్టి మానవు నకు పరమపదము, పరమగతి ప్రాప్తింపదు; మోక్షప్రాప్తిగూడ గలుగదు. ఇందుకు సందేహ మేమాత్రము లేదు!

ఎవడు తనయాత్మను దీనునిగ, హీనునిగ, దాసునిగ తలచుచున్నాడో అతడు తన ఆత్మయొక్క గౌరవప్రతిష్ఠలను నష్టపర్చుకొని ఆత్మహాననము చేసికొనుచున్నాడు. వాస్తవముగ నెవ్వడు ఆత్మను హత్యచేయజాలడు. కాని ఈ ఆత్మ లేక జీవుడు భావనామాయుడు, మనోమయుడు, విజ్ఞానమాయుడు, ఇచ్ఛా మయుడునై యున్నాడు. కనుక మానవుడు తన్నేవిధముగ నాలోచించుకొనుచున్నాడో అట్లే అయిపోగలడు ? ఈ జీవ రూపియగు యజమానిని దాసునిగ చేయుటయే హత్యచేయుట వంటిది. గీతానుసారము జీవుడే పరమేశ్వరుడు! ఈ జీవుడు పర మేశ్వర సమానుడుకాడు; కాని పరమేశ్వరుడే జీవునివంటివాడు!

గీతయందు బాగుగ తెలియు నిమిత్తము ఆత్మపరముగ "అహమ్" ("నేను") అను పదము ప్రయోగింపబడినది. ప్రపంచమందలి సమస్త ప్రాణులు తమను, తమ జీవుని "అహమ్" ("నేను") అనియే చెప్పుచున్నవి. "నేను" "నేను" అని చెప్పువాడే జీవుడు. ఇదియే కృష్ణునియందుకూడ గలదు. శ్రీకృష్ణుని చేత గీతయందెక్కడెక్కడ అస్మచ్ఛబ్దము ప్రయోగింపబడినదో అక్కడక్కడ దాని యర్థమును ఆత్మపరముగను, జీవుని పరముగను అర్థముచేసికొనవలసియున్నది. గీతయందలి "నేను" అను దాని యర్థము శ్రీకృష్ణుని ఆత్మపరముగ మాత్రముకాదు!

శ్లో॥ అహంవైశ్వానరో భూత్వాప్రాణినాం దేహ మాశ్రితః।
ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నంచతుర్విధమ్॥
(గీ. అ. 15-14)

నేనే వైశ్వానర అను అగ్ని (జఠరాగ్ని)ని అయి సమస్త ప్రాణుల శరీరములనాశ్రయించియున్నాను; ప్రాణాపాన వాయువులతో కలసి నాల్గు విధములగు భోజ్యపదార్థములను జీర్ణంపజేయుచున్నాను. దీనివలన శ్రీకృష్ణపరమాత్మయే "అహమ్" అను ఈశ్వరుడై యున్నాడని స్పష్టమగుచున్నది. జీవునివల్లనే శరీరమందు జఠరాగ్ని ఉండగలుగుచున్నది. జీవుడు వెడలిపోయిన తరువాత సమస్త శరీరము చల్లబడిపోవును; ఏకొద్దివేడియు నుండదు. జీవహీనమగు మృతశరీరము ఏమియు తినజాలదు; తినినదానిని జీర్ణించుకొనజాలదు.

సర్వవ్యాపకుడగు మత్ఈశ్వరుని వలన ఈ జఠరాగ్ని కలిగియున్నయెడల - శవముకూడ జీవుడు లేకుండ అన్నము తినవలసియున్నది; దానిని జీర్ణము చేసికొనవలసియున్నదికూడ ఎందువలన ? మత్ఈశ్వరుడు సర్వాంతర్యామియై శవశరీరమందు కూడ నున్నాడుగనుక! కావున శవశరీరమందు "అహమ్" ("నేను") అని పలుకు జీవుడు లేనట్లు నిశ్చయమగుచున్నది. ఇందువలన సర్వాంతర్యామియగు ఈ "అహమే" అందరి యందున్నాడు; తినిన అన్నమును జీర్ణించుచున్నాడు, అతడే జీవుడు; ఈ జీవుడే శ్రీకృష్ణుడైయున్నాడు. ఎందువలన ? అందరి లోను ఉండి ప్రాణాపానములతో కలిసి సమస్తమగు అన్నమును జీర్ణించుచున్నది. జీవుడున్నందువల్లనే శరీరమందు ప్రాణాపానములు, శ్వాసప్రశ్వాసలు నడచుచున్నవి; జీవుడు చచ్చిపోయిన తరువాత పై ప్రక్రియ లుండజాలవు.

ఏ అహమువలన ప్రాణాపానములు, శ్వాసప్రశ్వాసలు నిలుచుచున్నవో, ఏ అహమువలన శరీరమందలి జఠరాగ్ని నిలుచుచున్నదో ఆ యహమే శ్రీకృష్ణభగవానుడు, అట్టి యహమే జీవుడు! ఇందువలన గీతయొక్క "అహమ్" గీతయొక్క "కృష్ణుడు", గీతయొక్క "ఆత్మ", మరియు గీతయొక్క "జీవుడు" అందరు ఒకటియే! ఈ అస్మచ్ఛబ్దముయొక్క ద్వితీయ ఏకవచన రూపము "మామ్" అగుచున్నది. కనుక గీతయం దెక్కడెక్కడ "అహమ్" "మామ్" "మత్" ఆది శబ్దములు వచ్చుచున్నవో అక్కడ జీవాత్మపరముగనే అర్థమును గ్రహిం

పడలసియున్నది. కావున గీత ఈ యాత్మోద్ధారానే ఆత్మోద్ధార
ణము నుపదేశించుచున్నది; మతఈశ్వరునిద్వార మాత్రము
కాదు! గీత మత-ఈశ్వరు నంగీకరింపలేదు. "ఉద్ధరేదాత్మ
నాత్మానమ్" నీ యాత్మద్వారానే నిన్నుద్ధరించుకొనుము.
అని ఉపదేశించినది. ఈ అధ్యాయమందు, ఈ పుస్తకమందు
నిగూఢ సిద్ధాంతములను హృదయంగమము చేసికొనుటకు
అనేకములగు గీతాశ్లోకములు, వాక్యములు ఉపయోగింప
బడినవి.

గీతయందలి ఈశ్వరుడు

మతవాదులు గీతయందలి కృష్ణునే ఈశ్వరుడని భావించు
చున్నారు; కాని శ్రీకృష్ణుడు "నేను సర్వుల హృదయములందు
ఆత్మస్వరూపుడనై యున్నాను" అని స్వయముగ చెప్ప
చున్నాడు.

"అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః"
గీతానుసారముగ "కృష్ణుడు" "ఈశ్వరుడు" "అహమ్" అనున
వన్నియు జీవాత్మయే! ఉపనిషత్తులమందు ఆత్మకు "అహమ్"
అను పేరుకూడ నుండియుండెను. ఇందునుగురించి ఇంతకుముందు
ఉపనిషద్వాక్యము లుదహరింపబడినవి. ఆత్మ తన్ను "అహమ్"
(నేను) అని పలుకుచున్నది. ఇందువలన దానికి అహమని
పేరు వచ్చినది. ఉపనిషత్తుల ననుసరించి వ్రాయబడిన గీత

యందుకూడ ఆ సంప్రదాయము ప్రకారము "ఆత్మ"కు "జీవునికి" అహమని చెప్పబడినది. ఇందునలన – "కృష్ణుడు", "ఈశ్వరుడు" "అహమ్" మరియు "ఆత్మ" ఇవి అన్నియు పర్యాయవాచక శబ్దములే! ఇవన్నియు జీవాత్మయొక్క పేర్లే! ఈ విషయమును స్థిరపర్చుటకు అనేక గీతాశ్లోకముల నుదహరించియున్నాను. ముందుకూడ నుదాహరించుచున్నాను; గమనింపుడు.

శ్లో॥ సర్వభూతేషు యేనైకం భావ మవ్యయ మీక్షతే।
అవిభక్తం విభక్తేషు తజ్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్॥

(గీ. అ. 18–20)

• మానవుడే యద్వైత జ్ఞానముతో విభక్తమైయున్న సర్వప్రాణులయందు, అఖండమైన, నాశరహితమైన పరమాత్మను వీక్షించుచున్నాడో అట్టిదానికి సాత్వికజ్ఞానమని పేరు.

శ్లో॥ ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః।
యోలోకత్రయ మావిశ్యబిభర్త్యవ్యయ ఈశ్వరః॥

(గీ. అ. 15. 17)

ఈ అహము పేరుతో అన్యమగునది ఏదిగలదో దానిని పరమాత్మయని చెప్పుచున్నాను. ఇతడు జీవధారులుగల త్రిలోకములందు జీవరూపియై వ్యాపించియున్నాడు. ఇతడవ్యయుడు, ఈశ్వరుడు మరియు బ్రహ్మాండరూపిఅగు ఈ శరీరముయొక్క భరణపోషణాదులను చేయుచున్నాడు. అతడే ఈ ఉత్తమ పురుషుడు ? అనగా "నేను" అనునదియే! "సః" "త్వం" ఇవి

అన్యపురుషలు. ఈ "నేను" అనుదానినే గీత యందు ఈశ్వరుడని వర్ణింపబడినది. పక్షపాతదృష్టిగల కొందరు మతవాదులు "జీవునికంటె అన్యుడగు పరమాత్ముడు" అని అర్థము చెప్పుచున్నారు. దీని నంగీకరించినట్లైన గీతయందలి ఇతర శ్లోకములతో పొంతన కుదరదు; ఒకవేళ పరమాత్మ అన్యపురుషఅయిన యెడల, అతడిందు ఉత్తమ పురుషయని సంబోధింపబడడు. "అహమ్" ("నేనే") ఉత్తమ పురుష; "సః" (వాడు) అన్య పురుష "త్వం" (నీవు) మధ్యమపురుష అయిడున్నవి. గీతయందు పరమాత్మపరముగ చెప్పబడిన "అహమ్" వచ్చినపుడు అది "పురుషోత్తమ" "ఉత్తమపురుష" అని ప్రయోగింపబడినది. గీతయందు చెప్పబడిన సాధన, పూజ, ధ్యానము ఆత్మపరముగనే అర్థము చేసికొనవలసియున్నది. కనుక గీతాశ్లోకముల నాధారము జేసికొని మతఈశ్వరుని నిర్ణయింపబూనుట వ్యర్థ ప్రయత్నము!

తులసీ రామాయణమందలి కొన్ని దోహాలనుగురించి నిష్పక్షపాతముగ ఆలోచించినయెడల, గీతయందువలె జీవాత్మనే పరబ్రహ్మగ వర్ణించినట్లు కనుపించుచున్నది.

శ్లో॥ ఏతత్ క్షేత్రమితి జ్ఞేయం దేహ ఇత్యభిధీయతే।
ఏతేర్విలక్షణో జీవః పరమాత్మా నిరామయః।
జీవశ్చ పరమాత్మా చ పర్యాయో వాచ భేదవః॥

(అ-రా-సర్గ 4-శ్లో 29, 31)

నిరామయుడు, నిర్వికారుడునగు జీవుడే పరమాత్మ. శిరస్సు, కపాలము ఇవి రెండు ఒకే అర్థమును ప్రకటించు చున్నట్లు - జీవుడు, పరమాత్మ పర్యాయవాచక పదములు; ఇంతియేగాకుండ గీతయందు మతఈశ్వరు నంగీకరింపలేదు; ఇతని పూజకూడలేదు. గీతయంతటిలోను యోగముద్వార ఈశ్వర ధ్యానము చెప్పబడలేదు; ఆత్మజ్ఞానమే బోధింపబడినది. గీతాను సారముగ ఆత్మజ్ఞానము చేయుటకు, ఆత్మయందు మనస్సు లగ్నముచేయుటకు "యోగము" అని చెప్పబడినది. ముందు శ్లోకములందీ విషయము వ్యక్తము కాగలదు.

గీతయందు యోగసాధన

శ్లో॥ యోగీ యుంజీతసతత మాత్మానమ్ రహసిస్థితః।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహాః॥
(గీ. అ. 6-10)

ఇంద్రియ సహితమగు మనస్సును, శరీరమును వశమం దుంచుకొని (ఆసన ప్రత్యాహారధారణాదుల ననుసరించి)న యోగి వాసనానాపరిగ్రహముల విసర్జించి ఏకాంతమున ఏకా కియై ఎల్లపుడు ఆత్మజ్ఞానమును చేయవలెను.

మతసంబంధియగు సాంప్రదాయిక యోగి ధ్యానమందు ఏకాకిగ నుండజాలడు; తన సాంప్రదాయిక ఈశ్వరుని తన సహా చరునిగ భావించును. అపుడతడు ఆత్మను ధ్యానింపకుండ తన

మతానుసారముగ మతఈశ్వరుని ధ్యానించును. కాని పై నుదహరింపబడిన గీతాశ్లోకమందు కేవలము ఆత్మధ్యానమే చేయవలయునని చెప్పబడియున్నది.

శ్లో॥ యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః।
శాంతిమ్ నిర్వాణ పరమాం మత్సంస్థా మధిగచ్ఛతి॥
(గీ. అ. 6–15)

ఈ విధముగ మనస్సును విషయములందు ప్రవర్తింప కుండ స్వాధీనము చేసికొని, ధ్యానయోగ మభ్యసించి పరమ నిర్వాణపదమునుపొంది, యోగి పరమశాంతి ననుభవించు చున్నాడు.

శ్లో॥ శనైశ్శనైరు పరమేద్బుద్ధ్యాధృతి గృహీతయా౦।
ఆత్మ సంస్థమ్ మనః కృత్వా నకించిదపి చింతయేత్॥
(గీ. అ. 6–25)

యోగి నిశ్చయాత్మకమగు బుద్ధితో నెమ్మది నెమ్మదిగ, అంతర్ముఖుడై మనస్సు నాత్మయందు ప్రవేశింపజేసి ఇతర చింతలను విడనాడవలయును. ఇందుకూడ – మనస్సు నాత్మయందు లగ్నము చేయవలయునని చెప్పబడియున్నది. ఇంతియేగాకుండ ఏ ఇతరమునుగూడ చింతింపరాదని నిషేధింపబడెను. మతవాదులు– కన్నులమూసి, మనసు సరికట్టి కూర్చుండి, ఈశ్వరుని, దేవీదేవతలను ధ్యానించుచున్నారు; గీత ఈ విధానమును పూర్తిగ నిషేధించియున్నది.

శ్లో॥ యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరమ్।
తత స్తతో నియమ్యైత దాత్మన్యేవ వశంనయేత్॥
(గీ. అ. 6–26)

చంచలమై అస్థిరమైన మనసు ఏయే విషయములందు తిరుగుచున్నదో ఆ యా విషయములనుండి దానిని మరలించి, ఆత్మయందుండునట్లు తన స్వాధీనము చేసికొనవలయును. ఇట్టి యోగాభ్యాసములతో యోగి మనస్సు ఆత్మయందే శాంతిని పొందుచున్నది. ఈ శ్లోకమందుకూడ తన మనసును స్వాధీన పర్చుకొని తన ఆత్మయందే లగ్నము చేసికొనవయునని చెప్ప బడియున్నది; ఏదో ఒక దేవతయందుగాని, ఈశ్వరునియందు గాని లగ్నము చేయవలయునని చెప్పబడియుండలేదు. మత వాదులిట్టి గీతను అధ్యయనము జేసికూడ మత దేవుని, దేవత లను ఎందులకు ధ్యానించుచున్నారో, ఉపాసించుచున్నారో అర్థమగుటలేదు! గీతయందు ఈశ్వరపూజా ఉపాసనావిధానము ఎక్కడను కనుపించుటలేదు. ఈ శ్లోకము చూడుడు–

శ్లో॥ యుంజన్నేవమ్ సదాత్మానమ్ యోగీ విగతకల్మషః।
సుఖేన బ్రహ్మ సంస్పర్శ మత్యంతంసుఖమన్నుతే॥
(గీ. అ. 6–28)

మనోవికారరహితుడగు యోగి సదా ఈ విధముగ ఆత్మధ్యానము జేయుచు, సుఖపూర్వకముగ బ్రహ్మాను స్పృశించి, అత్యంతానందము ననుభవించుచున్నాడు.

ఏ మానవు లాత్మను బ్రహ్మగ గుర్తింపక, ఆత్మకన్న భిన్నముగ బాహ్యమందు వెదకుచు తిరుగుచుందురో వారు అత్యంత దుఃఖితులై బ్రహ్మను పొందజాలరు. ఎందువలన ? బ్రహ్మ వెలుపల లేడు, లోపలనున్నాడు, అది ఇతరము కాదు, తన ఆత్మయే! బ్రహ్మ లేక బ్రహ్మానందము తన యాత్మయే! యోగి ఆత్మకు సన్నిహితుడు కాగానే ఆనందము ననుభవింప గలడు. ఇతరమును పొందుటకు వెలుపలకు పోవలయునుగాన కష్టపడవలసియుండును. తన్నుతాను పొందుట సుఖపూర్వక ముగ నుండును. తనవద్దకు చేరుట, తన్నుతాను పొందుట అత్యంత సరళకార్యమగుచున్నది. కాని బ్రహ్మను తనకన్న భిన్నముగ భావించి వెలుపల – తీర్థములందు, ఆలయములందు, మసీదులందు, చర్చిలయందు వెదకుచుండువారు అత్యంత కష్ట ములపాలగుదురు. కాని "బ్రహ్మము"ను పొందజాలరు. కనుక ఆత్మధ్యానియగు యోగి సుఖపూర్వకముగ, అతి సరళముగ బ్రహ్మను పొందగలడు.

శ్లో॥ ప్రజహాతి యదాకామాన్ సర్వాన్ పార్థమనోగతాన్।
ఆత్మన్యేవాత్మనస్తుష్టస్థితః ప్రజ్ఞస్త దోచ్యతే॥
(గీ. అ. 2–55)

ఓ అర్జునా! ఎపుడు మానవుడు మనోగతములగు వాసన లను పరిత్యజించి తనలోతాను – అనగ ఆత్మయందు సంతుష్టిని పొందుచున్నాడో అతడు స్థితప్రజ్ఞుడని, సమాధిస్థుడని, యోగస్థ డని, స్వరూపస్థుడని చెప్పబడుచున్నాడు.

శ్లో॥ శ్రుతివిప్రతి పన్నాతే యదాస్థాస్యతి నిశ్చలా।
సమాధావచలాబుద్ధిస్తదా యోగమవాప్స్యసి॥
(గీ. అ. 2–53)

ఓ అర్జునా! సాంప్రదాయిక మతమతాంతర విషయము లను వినుచు, శ్రమతోను, అజ్ఞానముతోను విచలితమైయున్న మనస్సును, సత్యజ్ఞానము లేదా యోగముద్వారా నిరోధించి, స్వస్వరూపమందు సమాధిస్థుడవగుము; అపుడు నీవు యోగపద మును పొందగలుగుదువు.

శ్లో॥ అభ్యాసయోగ యుక్తేన చేతసా నాన్యగామినా।
పరమమ్ పురుషమ్ దివ్యమ్ యాతిపార్థానుచింతయన్॥
(గీ. అ. 8–8)

ఓ అర్జునా! యోగసాధనవలన – తీర్థవ్రత దేవీదేవతాది ఇతరములగు మతకృత్యములపైపునకు మనస్సు పోకుండ అంత ర్ముఖమైనపుడు – (ఆత్మచింతనమే చేయుచున్నపుడు) మానవుడు తన అంతర్వర్తియగు పరమ దివ్యపురుషుని (ఆత్మను) పొంద గలుగుచున్నాడు. (పురి శరీరే శేతే సః పురుషః) శరీరమను పురమందు శయనించువాడు లేదా ఉండువాడు కావున పురు షుడు. మతఈశ్వరుడు సమస్త ప్రదేశములందు నివసించువాడు గనుక – ఆ పురుషుడు మతఈశ్వరుడుకాడు. మతఈశ్వరుడు సర్వవ్యాపకుడని భావించుచున్నందున ఎన్నడును శరీరమును త్యజింపజాలడు. కావున మతఈశ్వర కల్పన మూర్ఖతాయుతమై యున్నది. ఈశ్వరుని మతగ్రంథములందు సర్వరక్షకునిగ వర్ణించి

యున్నారు. ఇట్టి రక్షకుడు నిజముగ మృతశరీరమందుకూడ నున్నయెడల ఈ మృతశరీరము కుళ్ళి నష్టపోకుండ నుండవల యును. కావున మత-ఈశ్వరకల్పన ఆధారరహితమైయున్నది. పతంజలీ యోగదర్శన శాస్త్రమందు - "తదాద్రష్టుః స్వరూపే వస్థానమ్" అనగ యోగి తన శుద్ధ స్వరూపమందే, తనయాత్మ యందే ఆనందస్వరూపమును పొందుచున్నాడు. ఇందువలన గీతయందుకూడ మాటమాటకి ఆత్మచింతనకొరకు చెప్పబడి యున్నది. ఈ శ్లోకమందు యోగియొక్క బుద్ధి - "నాన్య గామినా" అనగ ఏ యితరమును ధ్యానింపరాదని చెప్పబడినది. ఇందుమూలమునకూడ మత-ఈశ్వరధ్యానము నిషేధింపబడినది. మత-ఈశ్వరుడు జీవుడుకాడు; జీవునికన్న అన్యుడైయున్నాడు. మత-ఈశ్వరుడు స్వామి, జీవుడతని దాసుడు, ఈశ్వరుడు తండ్రి జీవుడతని పుత్రుడు, ఈశ్వరుడు సర్వజ్ఞుడు, జీవుడు అల్పజ్ఞుడు; ఇది మతవాదుల కథనము. మతమునను సరించి ఈశ్వరుడు జీవుని కన్న వేరైయున్నాడు; జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు. గీత యందు సమస్తములగు ఇతరములను మనస్సునుండి పారద్రోల వలయునన్నది భావము (నీతి) గోచరించుచున్నది. సమస్త విష యములనుండి మనసును మరలించి, తన వాస్తవరూపమందు లేదా తన యాత్మయందు లగ్నమైయుండుటయే గీతానుసార ముగ యోగమైయున్నది.

యోగసాధనము స్థిరాసనము

శ్లో॥ శుచౌదేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసన మాత్మనః।
నాత్యుచ్ఛ్రితమ్ నాతినీచమ్ చైలాజిన కుశోత్తరమ్॥
(గీ అ. 6-11)

యోగసాధనచేయు ప్రదేశము శుద్ధమై పవిత్రముగ నుండవలయును. ఈ ప్రదేశము ఎక్కువ ఎత్తు, ఎక్కువపల్లము లేకుండ నుండవలయును. ఈ వేదికపై దర్భాసనమును పరచవలెను, దానిపై మృగచర్మమును అందు శుభ్రవస్త్రమును పరచవలయును. నా అభిప్రాయానుసారము మృగచర్మము నుపయోగించుట అపరిశుభ్రము, హింసాప్రదము నైయున్నది. మృగచర్మమునకు బదులుగ ఒక పలచని పరుపు నుపయోగించుట ఉత్తమము. ఇట్టి వేదికపై స్థిరముని, తనకు అనువగు ఆసనమున సుఖాసీనుడై కూర్చుండవలెను. కష్టసాధ్యములగు ఆసనముల నుపయోగించుట మంచిదికాదు; ఆరోగ్యప్రదము కూడ కాదు.

శ్లో॥ సమంకాయ శిరోగ్రీవం ధారయన్నచలం స్థిరమ్।
సంప్రేక్ష్య నాసికాగ్రమ్ స్వమ్ దిశశ్చానవలోకయన్॥
(గీ. అ. 6-13)

ఇట్టి ఆసనములపై కూర్చుండి - నడుము, ఛాతి, గ్రీకము శిరస్సు మొదలగు అంగములను, సరళముగ, సుఖపూర్వకముగ

నిలువుగ నుంచవలెను. అపుడు దిక్కులను చూడకుండ తన నాసికాగ్రభాగమును చూచుచుండవలయును. నాసికకు రెండు కొనలు గలవు. ఒక కొన వెలుపలకుండి గంధమును స్వీకరించు చున్నది; రెండవ కొన లోపల లలాటమునకు చేరియున్నవి; దీనిని త్రికుటయని యందురు. ఈ రెండు భ్రూవముల మధ్యనుండి మనోనేత్రములతో వీక్షింపవలయును. దానిని బాగుగ గ్రహిం పవలయుననిన నా సమక్షమునగాని, అర్హతగల నా శిష్యుని సమక్షమునగాని అభ్యసించుట ఉత్తమము.

శ్లో॥ తత్రైకాగ్రంమనః కృత్వాయత చిత్తేంద్రియ క్రియః।
ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగమాత్మ విశుద్ధయే॥
(గీ. అ. 6-12).

ఈ విధముగ కనుబొమల మధ్యను - అనగ నాసిక యొక్క పై అగ్రభాగమందు మనస్సు నేకాగ్రపర్చి, చిత్త మును ఇంద్రియ వ్యాపారములను అరికట్టి ఆత్మశుద్ధికొరకు యోగసాధన చేయవలయును. గీతయందెక్కడను మతఈశ్వర పూజ లేనేలేదు. గీతయందు సర్వత్ర ధ్యానపూజ ఆత్మపూజ మరియు ఆత్మచింతనయొక్క వర్ణన కనుపించుచున్నది. గీత యందు "అహమ్" "మమ" "మామ్" "మత్" ఆదిగాగల అస్మచ్ఛబ్ద రూపములయొక్క మహత్తే గోచరించుచున్నది. మోక్షమును పొందగోరు యోగి దీనినే పొందవలసియున్నది. ఈ "నేను" అందరియందు గలదు; ఇదియే "ఆత్మ" అయి ఉన్నది. ఈ "ఆత్మ కృష్ణునియందుమాత్రమే గలదు; కృష్ణుడే

పూజనీయుడు" అని భావించుట సరిగాదు. శ్రీకృష్ణుడుకూడ ఈ ఆత్మనామధేయుడే అయిఉన్నాడు; ఇదియే తెలిసికొనదగిన విషయము. దీనిని ధ్యానించి, తత్వతః తెలిసికొనగలిగినవాడు యోగియై యున్నాడు.

శ్లో॥ సర్వభూతస్థితం యోమామ్ భజ త్యే కత్వమాస్థితః।
సర్వథా వర్తమానోఒపి సయోగీ మయి వర్తతే॥
(గీ. అ. 6.31)

ఏ మానవు డద్వైతజ్ఞానమందు స్థితుడైయుండి అనగ-తన ఒక్క "ఆత్మ"నే ఈశ్వరునిగ నంగీకరించుచు, ద్వైతజ్ఞాన భేతజ్ఞానములకు విముఖుడై, సమస్తప్రాణులయందు స్థిరమై యున్న "నన్న" లేక "మామ్" లేదా "ఆత్మ"ను ఎక్కడ ఏ స్థితిలోనున్నను భజించుచున్నాడో అతడే యోగి. కనుక గీత మత-ఈశ్వరుని, దేవీదేవతలను అంగీకరించుట లేదనియు, మా ముని సమాజమువలె కేవల మాత్మనే అంగీకరించుచున్న దనియు స్పష్టమగుచున్నది. గీత ఆత్మయోగమును చెప్పుచున్నది దీని వ్యాఖ్యానమాత్రమే చేయుచున్నది; ఆత్మధ్యానమును, ఆత్మసాక్షాత్కారమును బోధించుచున్నది. మానవు డాత్మ సాక్షాత్కారమును పొందియే నిజమగు ముక్తిని, ఆనందమును పొందగలుగుచువ్నాడు. మతకలహాములు, రాజకీయ వివాద ములు మానవున కాత్మశాంతిని కలుగజేయజాలవు!

కనుక మానవు డాత్మజ్ఞానముద్వారా "బ్రహ్మము"ను పొందగలుగును. ఈ విధముగ బ్రహ్మత్వమును పొందగలుగుట

అత్యంత సులభసాధ్యము. సంప్రదాయ పద్ధతిని మతఈశ్వరుని మానవుడు వెదకి, వెదకి మరణించుచున్నాడు; కాని ఈశ్వరుని పొందజాలకున్నాడు. అస్తిత్వమేలేని మతఈశ్వరుని పొందు కెట్లు? కనుకనే మునులు ఆత్మజ్ఞానముద్వారానే బ్రహ్మ ప్రాప్తిని పొందుచున్నారు. ఇదియే సత్యమార్గము! గీతకూడ దీనినే బోధించుచున్నది.

శ్లో॥ సన్న్యాసస్తుమహాబాహో దుఃఖిమాప్తుమయోగతః।
యోగయుక్తో మునిర్బ్రహ్మ నచిరేణాధిగచ్ఛతి॥
(గీ. అ. 5–6)

గొప్ప బాహువులుగల ఓ అర్జునా! యోగసాధనలేని సన్యాసము వ్యర్థము. ఇట్టిది కేవలము దుఃఖమునే కలుగజేయు చున్నవి. అయితే ఇట్టి యోగయుక్తుడగు ముని శీఘ్రముగ బ్రహ్మమును పొందగలుగుచున్నాడు. బ్రహ్మమునుపొందుమార్గ మిదియే! ఇట్టి యోగి గీతయందు "ముని" అని చెప్పబడెను. పూర్వమునుల వంశజులమైయున్నందున మనమందరము మును లమే! మునులయొక్క నిజమగు ఆధ్యాత్మిక జ్ఞానమును ధారణ చేసికొని మనము నిజమగు మునులము కావలసియున్నది. ఆత్మ జ్ఞానమును ధారణచేయకుండ, మతఈశ్వర సంబంధమగు సాం ప్రదాయక జ్ఞానమువలన నిజమగు యోగపదము నెవడు పొంద జాలడు. గీతయందు ఇట్టి ఆత్మజ్ఞానమునకు సంబంధించిన అనేక శ్లోకములు గలవు.

శ్లో॥ యదా వినియతం చిత్త మాత్మన్యే వావతిష్ఠతే।
నిస్పృహస్సర్వ కామేభ్యో యుక్త ఇత్యుచ్యతేతదా॥
(గీ. అ. 6-18)

ఈ అవస్థయందు అత్యంత వశమందున్న మనస్సు తన యాత్మయందే (ప్రాపంచక విషయములందు, మతఈశ్వరుని యందు లగ్నముగాకుండ) స్థిరమైయుండును. సంపూర్ణ కామ వాసనారహిత పురుషుడే యోగి యగుచున్నాడు.

శ్లో॥ యత్రోపరమతే చిత్తమ్ నిరుద్ధమ్ యోగసేవయా।
యత్రచైవాత్మ నాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి॥
(గీ. అ. 6-20)

ఇట్టి యోగియొక్క చిత్తము, యోగసాధన చేయుట వలన ఉపరామము (నివృత్తి) పొందుచున్నది; అనగ వెలుపల నుండి ముడుచుకొని అంతర్ముఖమగుచున్నది. ఇట్టి స్థితిలో యోగి తన్ను తాను చూడగలుగుచున్నాడు; తన్ను తాను పొంది, తన స్వరూపమందే స్థిరమైయుండి ప్రసన్నతను, సంతృప్తిని పొందుచున్నాడు. పూర్ణ సంతృప్తిని పొందిన తరువాత అట్టి మానవుడు - మతఈశ్వరుని, స్వర్గాదులను కాంక్షింపక సమస్త బాధనములతో విడివడి జీవన్ముక్తుడగుచున్నాడు.

శ్లో॥ తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞాని భ్యోఽపిమతోఽధికః
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున॥
(గీ. అ. -)

అనేకములైన వ్రతములు, ఉపవాసములు, మతకర్మలు చేసినట్టి తపస్వులకన్న యోగి గొప్పవాడు. ప్రాపంచక మత గ్రంథముల పరించి జ్ఞానార్జనము చేసిన విద్వాంసులు పండితుల కన్న యోగి గొప్పవాడు; ఈశ్వర ప్రార్థనాదులను, యజ్ఞ యాగాది కర్మలనుజేయు కర్మకాండులకన్న యోగి గొప్పవాడు కనుక ఓ అర్జునా! నీవు యోగివికమ్ము.

గీతయందు యోగము అను పేరున ఆత్మసాక్షాత్కారమే ప్రబోధింపబడినది.

శ్లో॥ యానిశా సర్వభూతానాం తస్యాంజాగర్తి సంయమీ।
యస్యాం జాగ్రతి భూతాని, సానిశాపశ్యతో మునేః॥
(గీ. అ. 2-69).

సర్వప్రాణులకు తెలియకపోవుటవలన ఏది రాత్రివలె తోచుచుండునో అట్టి ఆత్మను తెలిసికొని మెలుకవతో చూచు చుండును. దేనిని సమస్త ప్రాణులు జాగరూకులై చూచు చుండురో అట్టి శబ్దాది విషయములు కనుపించకయుండును. గీతయందిట్టి ఆత్మజ్ఞానమే సరోత్కృష్టముగ నంగీకరింపబడినది. అయినను ప్రజలు గీతను అధ్యయనము చేయుచున్నప్పటికి నిజ మగు ఆత్మజ్ఞానములు, యోగరహస్యములను తెలిసికొనజాల కున్నారు. గీతాధ్యయనము చేసినవారుకూడ మతఈశ్వరుని వెంట పిచ్చివారివలె పరుగిడుచున్నారు; "హరేకృష్ణ! హరే కృష్ణ!" అనుచు నాట్యము చేయుచున్నారు. గీతను పరించికూడ యోగమును, ఆత్మపూజను విడిచి రాళ్లను పూజించుచున్నారు

ఇంచుకు కారణమును గ్రహింపవలసియున్నది. మత్రగ్రంథము లాదీ యద్వైతవాదము, నిజమగు ఆత్మజ్ఞానము ప్రచ్ఛన్నముగ నుంచబడినది; ఈ కారణమున ఈ గ్రంథముల పఠించిగూడ మానవులు నిజమగు యోగమును ఆత్మజ్ఞానమును గ్రహింప జాలకయున్నారు. ఈ ఆత్మజ్ఞానమును ప్రాచీన పాషండ వ్యర్థ గాఢారూపమగు ధూళితో కప్పియుంచి, నిజతత్వమును గ్రహిం ప వీలులేకుండ చేసియున్నారు. "ఈశ్వరుడు లేడు; ఈ ఆత్మే ఈశ్వరుడు ఈ యాత్మయే సమస్తము నీయగలదు" అని ఎవరు స్పష్టముగ చెప్పియుండలేదు. ఈ ఆత్మజ్ఞానము నంతగ ప్రజలు తెలిసికొనజాలకయుండిరి; తెలిసినను చెప్పుటకు భయపడుచుం డిరి. నా ముఖతః ఈ జ్ఞానబోధనువిని, నన్ను చంపుటకుగూడ ప్రయత్నించుచున్నారు; నా కనేక అవరోధముల గలుగజేయు చున్నారు. సత్యసిద్ధాంతముల ప్రచారము చేయువారు కష్టముల పాలగుచున్నారు; అసత్యప్రచారకులకు ధనధాన్య సమృద్ధి, ప్రతిష్ఠ పెరుగుచున్నది. సత్యముయొక్క అవసరమప్పుడు వారికి కనుపించదు. సత్యమును సూర్యుడు – అసత్యాజ్ఞానములను మేఘములతో కప్పబడియున్నాడు; విద్వాంసులుకూడ ఈ సూర్యప్రకాశమున కవరోధము కలుగజేయుచున్నారు. కాని నేను దీనిని వెలుగులోనికి తీసికొనివచ్చుటకు ప్రతిజ్ఞచేసియు న్నాను. నేనీ ఆత్మజ్ఞానముపై అనేక గ్రంథములను వచించి యున్నాను. ఈ గ్రంథములను తాము పఠింపుడు, తమ హృద యములందు ఆత్మజ్ఞాన ముదయింపగలదు.

4వ అధ్యాయము

గీతపై నిష్పక్ష వ్యాఖ్య

కొద్దిరోజుల క్రిందట ఒకడు నావద్దకువచ్చి ప్రశ్నోత్తర సంభాషణ చేయసాగెను. దానినీక్రింద నుదహరించుచున్నాను. ఆయన తనపేరు ప్రకటించుట కంగీకరింపలేదు. ప్రశ్న = గీతా వచనములు భగవంతునివలన చెప్పబడినవని అంగీకరించుచున్నారా? సమాధానము = ముందు తాము గీతను భగవత్ప్రతిపాదికమని అంగీకరించుచున్నారేమో చెప్పుడు? ప్రతి మని, ప్రతి మానవుని భగవంతుడే! అపుడు గీతకూడ భగవంతునిచే చెప్పబడినదియే యగుచున్నది. ఇట్టి స్థితిలో సమస్త గ్రంథములు భగవదర్చనలసియే అంగీకరింపవలసి యున్నది.

ప్రశ్న = అన్ని పుస్తకములందు ఇట్టి ఉన్నత జ్ఞానము లేదు. మిగిలిన పుస్తకములందు సిద్ధాంత తః అసత్య విషయము లనేకములుండియున్నవి. కొన్ని గ్రంథములందు జ్ఞానాజ్ఞాన విషయములు మిళితమైయున్నవి? సమాధానము = ఈ విషయము గీతకుకూడ వర్తించుచున్నది. గీతయందు జ్ఞానాజ్ఞాన విషయములుకూడ గలవు. గీతయందలి సమస్త విషయములు నిర్దోషములు కావు! అందనేకములు నితాంతము-అసత్యములు, ఈ ప్రమాణికములుగూడ నైయున్నవి.

ప్రశ్న = గీతకూడ నొక సామాన్య గ్రంథమేనా ? కాని గీతయందు నాకిట్టి విషయములు గోచరించుట లేదు.

సమాధానము = ఒక మహమ్మదీయునకుగూడ "ఖుర్-ఆన్" నందు ఏమియు చెడ్డ కనుపించదు; క్రయిస్తువునకు "బైబిలు" నందలి చెడ్డ ఏమియు కనుపించదు. కాని "ఖుర్-ఆన్" "బైబిలు" నందలి విషయములు సరియైనవేనని తానుం గీకరించుచున్నారా ?— "కాదు కాదు! పై రెంటియందనేక అసత్యములు, అప్రమాణికములు, పక్షపాత పూర్ణములునైన సిద్ధాంతములు గలవు!"

కాని ఈ సంగతి క్రయిస్తువులకు, ముసల్మానులకు తెలి యదు. ఈ మతస్థులు క్రీస్తును, మహమ్మదును ఈశ్వరునిచే పం పబడిన దేవుని కుమారులని భావించుచున్నారు ఇందువలన ఆ మతస్థులకు "ఖుర్-ఆన్" "బైబిలు" నందలి విషయములు అసత్యములైయున్నప్పటికి యుక్తియుక్తముగ, సత్యముగ గోచరించుచుండును. క్రయిస్తవుల మహమ్మదీయులయొక్క మతపక్షపాతపూర్ణమగు బుద్ధి, మతగ్రంథము లందలి సంగతు లను సత్యముగ నాలోచింపజాలక యుండును. తాముకూడ శ్రీకృష్ణుని భగవంతునిగ భావించుట పక్షపాతపూర్ణముకాదా? గీతారచయితయగు శ్రీకృష్ణునికూడ తాము భగవంతునిగ భావించి అతని సిద్ధాంతములను ఆలోచనాదృష్టితో చూడలేక పోవుచున్నారు; అట్లు భావించినపుడు మనముకూడ పక్షపాత రహితముగ నాలోచింపజాలము. మనము మతపక్షపాతమును

విసర్జించి ఆలోచించినపుడు "ఖుర్–ఆన్" "బైబిలు" గ్రంథములందువలె గీతయందుకూడ బుద్ధి అంగీకరింపజాలని, యుక్తి యుక్తములుగాని, సత్యములుగాని విషయములనేకములు కలవని మనకు గోచరించును.

శ్లో॥ యస్యనాహం కృతోభావో బుద్ధిర్యస్య న లిప్యతే।
హత్వాపిస ఇమాన్ లోకాన్నహంతి ననిబధ్యతే॥
(గీ. అ. 18–17)

ఎవడు తన యంతఃకరణమందు – "నేనీ కర్మనుచేయుట లేదు" అని భావించునో, కర్మఫలమందాసక్తిలేక యుండునో, అట్టివాడు సమస్త ప్రపంచమును సంహరించినను అతడు సంహరించినట్లుకాదు. అనగ హంతకునిగ పరిగణింపబడడు. హత్యా దోషముకూడ నతని కంటదు.

ఒకడు – ఒకరిద్దరినికాదు, సమస్త ప్రపంచమును సంహరించినను తన హృదయమందు – "నేనీ హత్య చేయలేదని" భావించినంతమాత్రమున, అతనికి హత్యాదోషమ్ము అంటదని గీత యొక్క సిద్ధాంతమై యున్నట్లు కనుపించుచున్నది.

ఇది చాల విచిత్రమగు విషయము. ఒకని ప్రాణముతీసి "నేనీ హత్య చేయలేదని, భగవంతుడే చేసినాడని" భావించినంతమాత్రమున ఈ పాపమంటదట! పక్షపాతరహితముగ నాలోచింపుడు; ఇది సత్పురుషులుచేయు ఉపదేశమేనా! దీనిని ఏన్యాయప్రియుడైనా అంగీకరించునా! పైనుదహరించిన హంత

కుని న్యాయాధిపతి విడిచిపెట్టునా? ఇట్టి మతోపదేశముల కారణమునసే ప్రపంచమందు హత్యాకాండ చెలరేగియున్నది. మతము పేరుతో, ఖుదా పేరుతో వేలాది హిందువులను హత్య చేసినప్పటికి – "నేను హంతకుడనుకాను; మతవీరుడను, పక్కా మహమ్మదీయుడను" అని ఒక మహమ్మదీయుడు భావింపు చున్నాడు. "వేలాది హత్యలు చేసినప్పటికి వారు "కాఫిరులు" అయిఉన్నందున నేను "దోజఖ్" (నరకము) నకు వెళ్లెను. "బహిస్త్" (స్వర్గము)నకు వెళ్లగలను" అని ఒక ముసల్మాను భావించును. మతము, మతఈశ్వరుడు ఇట్టి నీతులు చెప్పచున్నం దునసే హత్యలు ప్రబలుచున్నవి.

- అర్జునుడు యుద్ధరంగమందు పాపభీతితో సంశయించి, ప్రజాక్షయమునకు సిద్ధపడలేదు. శ్రీకృష్ణుడు ఈ హత్యాకాండను అర్జునునిద్వారా చేయించుటకు గీతను రచించి అతని కుపదేశించెను. నీవు అందరిని హత్యజేసినప్పటికి మనసున – "నేనీ హత్యచేయలేదు. దీని పాపఫలము నాకంటదు" అని భావించినంతమాత్రమున పాపము కలుగదు. అని కృష్ణుడు పలికెను. ఇది గీతాసిద్ధాంతము.

ఇందువలన గీత నంగీకరించువానికి ఏమియు భయముండదు; పగలంతయు హత్యలుచేసి, రాత్రి పరుండునప్పుడు – "నేనీ హత్యలు చేయలేదు." అని భావించి హత్యాపాపమును "కృష్ణార్పణమస్తు" అన్నచో నిశ్చింతగ నుండవచ్చును. ఇట్టి ఉపదేశములు సరియైనవేనా? ప్రపంచశాంతికి తోడ్పడగలవా? నేడు

జరుగుచున్న హత్యలు కాంతించునా? ఇన్నైనన్నటికి జరుగజాలదు. ఇట్టి ఉపదేశము ప్రపంచ శాంతికి దోహదమీయదు! రక్తపు టేరులను ప్రవహింపజేయును. ఈ క్రింది గీతాశ్లోకమును చూడుడు-

శ్లో॥ సుఖదుఃఖే సమేకృత్వా లాభాలాభే జయాజయే।
తతో యుద్ధాయయుజ్యశ్వ నైవం పాపమవాప్స్యసి॥
(గీ. అ. 2-38)

సుఖదుఃఖములను, లాభనష్టములను, జయాపజయము లను సమానముగ భావించి, యుద్ధము చేయుము. నీకు పాప మంటదు. సుఖదుఃఖములను లెక్కచేయకపోవుట ఇంతవరకు సమంజసమే! ఇతరుల చంపునపుడు మీకు దుఃఖము కలుగక పోవుటకూడ సహజమే! చంపబడువానికి దుఃఖము కలుగదా? జయాపజయముల నాలోచింపకుండ ఇతరులను చంపజాలరు. ఇవి ఎంతటి చిత్రమగు సిద్ధాంతములు? ఈ సిద్ధాంతముల నాధారము జేసికొని ఎవడును చంపజాలడు.

జీవుడు అమరుడు; ఇందువలన ఎవనికి చావులేదు. ఎవడును ఎవనిని చంపజాలడు. ఇదియే గీతారహస్యము.

శ్లో॥ వేదాఽవినాశినం నిత్యమ్ యఏనమజమవ్యయమ్।
కథం స పురుషః పార్థ కంఘాతయతి హంతికమ్॥
(గీ. అ. 2-21)

ఓ అర్జునా! ఎవడీ యాత్మను నాశములేనిదనియు, నిత్య

మనియు, జన్మక్షయములు లేనిదనియు, తెలిసికొనుచున్నాడో ఆ పురుషుడెట్లు ఎవనిచేత వధింపబడును ? ఎట్లెవనిని వధించును? అట్టివాడు తాను వధింపబడుటయు, తానితరుల వధించుటయు నసంభవములు.

ఆత్మ అమరమని భావించుట సరియైనదియే! కాని ఈ సిద్ధాంతానుసారముగ ఇతరుని హత్యచేయుట, తనను నిర్దోషిగ తలచుట చాల అనర్థకరమైయున్నది. ఆత్మ అమరమైనదే. ప్రాణము శరీరముతో సంబంధము విడుచుటయే మరణమని చెప్పచున్నారు. అయినప్పటికి ఈ స్థితిలో శరీరముతో ఆత్మ యొక్క సంబంధమును ఒదులుకొనుటకు లేదా మరణమునకు ఎవడుకూడ నంగీకరింపడు. జీవుడమరుడైయున్నాడని భావించి ఎవడైన హత్యచేసి తన్ను నిర్దోషిగ భావించుట చాల గుడ్డి తనము. జీవుని అమరునిగ భావించి ఎవడుకూడ మరణింపగోరడు; ఇట్లు భావించి ఇతరుని చంపుట మహాపాపము. ఒకడు ఎవనినైన హత్యచేసి – "ఆత్మ అమరమైనపుడు నేనెవరిని చంపితిని" అని తప్పించుకొనగలడా ? ఆత్మ అమరమని భావించి, తాను తన కుమారుని, కుమార్తెను, తల్లిదండ్రులను లేదా తనను హత్య చేసికొనుటకు సిద్ధపడనపుడు, ఇతరులను చంపి తన్ను నిర్దోషిగ భావించుట చాల మూర్ఖత, అన్యాయమునైయున్నది.

శ్లో॥ యఏనమ్ వేత్తిహంతారమ్ యశ్చైనమ్ మన్యతే హతమ్
ఉభౌతౌన విజానీతో నాయంహంతి నహన్యతే॥
(గీ. అ. 2–19)

ఎవడీ యాత్మను వధించువానిగ తలుచుచున్నాడో, ఎవడీ యాత్మను వధించువానిగ తెలియుచున్నాడో, వారిద్ద రును అజ్ఞానులే! ఎందువలన ? ఈ ఆత్మ వధించునదియుగాదు, వధింపబడునదియుకాదు. కర్తృత్వ కర్మత్వము లీయాత్మకు లేవు.

ఇది సరియైనదేనా ? ఆత్మను అమరమని భావించి, ఇత రుల శిరచ్ఛేదనముల జేయుచు తిరుగుచుండుట, తనను నిష్పాపిగ భావించుట ఎంతటి మూర్ఖత! "ఇట్టి భావముతో సమస్త ప్రపం చమును సంహరించినను నీకు పాపమంటదు!" ఇది గీతాకార యితయొక్క సందేశము.

శ్లో॥ యస్య నాహం కృతో భావో బుద్ధిర్యస్య నలిప్యతే।
హత్వాపి స ఇమాల్లోకాన్ నహన్తినని బధ్యతే॥
(గీ. అ. –)

ఇట్టి అనర్థకర విషయములు మతగ్రంథములందుమాత్రమే నుండగలవు.

శ్లో॥ నద్వేష్ట్య కుశలం కర్మకుశలే నానుసజ్జతే।
త్యాగీ సర్వ సమావిష్టో మేధావీ భిన్నసంశయ॥
(గీ అ. –)

పాపకర్మలయందు ద్వేషించనట్టిన్ని, పుణ్యకర్మలయందు అనురక్తి లేనట్టిన్ని, సత్వగుణసంపన్నుడగు సంశయరహితుడైన జ్ఞానియే త్యాగియని చెప్పబడుచున్నాడు.

గీతయందు - అకల్యాణకారకములగు పాపకర్మల ద్వేషించనట్టివానిని, కల్యాణకారకములగు పుణ్యకర్మల ప్రేమించనట్టివానిని త్యాగియని, జ్ఞానియని చెప్పబడినది.

ఇపుడు తాము నిష్పక్షపాతముగ నాలోచింపుడు. జ్ఞానులకు, సత్పురుషులకు, త్యాగులకు, సాధులకు ఇదియేనా లక్ష్యము? పై సత్పురుషులు - దొంగతనమును, దోపిడీని, లంచగొండితనమును, హత్యను పాపకర్మముగ భావించి ద్వేషింపరాదా? నిందింపగూడదా? ఇక్కడ - పరోపకారము, దానము, సత్యము, న్యాయము, యోగసాధన, ఈశ్వరప్రతిధానము, ఆస్తికత్వము, జీవనదానాది పుణ్యకర్మలను హృదయపూర్వకముగ ప్రేమింపరాదా? సత్పురుషులీ శుభకర్మలను ప్రశంసించి ప్రేమింపకుండ, పాపకర్మల ద్వేషించి నిందింపకుండ నున్నయెడల ఈ ప్రపంచమే సరిగ నుండదు. జ్ఞానులు, సత్పురుషులు పాపకర్మల నిందింపకపోయినయెడల వానిని ప్రతిఘటించువారెవరు?

పుణ్యకర్మలను ప్రేమింపవలెనని, పాపకర్మల ద్వేషింపవలెనని ప్రతి మతము చెప్పుచున్నది, ఇది ప్రతిమతమునకు కర్తవ్యముకూడనైయున్నది.

హత్యాదిదుష్కర్మలగురించి మానవ హృదయమందు గట్టి ద్వేషముదయించనంతవరకు మానవుడీ పాపకార్యముల నుండి విముక్తిని పొందజాలడు. మానవుడు సామాన్యముగ కాడు; చాల గట్టిగ పాపకర్మల ద్వేషింపవలసియున్నది. గీత

యుందలి పై సిద్ధాంతము చాల అసంగతమైనది, భయంకర మైనదికూడ!

ఏ మానవుడు తన హృదయమందు కర్మల చేయుచు చున్నట్లు భావింపదో, ఎవని బుద్ధి, జ్ఞానము- తన్ను కర్తగ నంగీకరింపదో అతడు సమస్త ప్రపంచమును సంహరించినప్పటికి ఈ హత్యారూపమగు పాపమతని కంటజాలదని గీతారచయిత చెప్పచున్నాడు. గీతయందలి 18వ అధ్యాయపు 17వ శ్లోకమీ సిద్ధాంతమును బోధించుచున్నది. ఈ సిద్ధాంతమెంత భయంకర మైనది? ఎంతటి అసత్యమైనదో, అనర్థకరమైనదో తామాలో చింపుడు! ఈ సిద్ధాంతము ప్రపంచమందు అనర్థముల వ్యాపింప జేయదా? దాని మూలమునసే భారతయుద్ధము జరిగినది. ఈ యుద్ధమందు గొప్పగొప్ప భారతీయ జ్ఞానులు. ఇంజనీర్లు, పదార్థ విజ్ఞానవేత్తలు, ధనుర్వేద ఆయుర్వేద విద్యావేత్తలు, శూరులు వీరులు అందరును మరణించియున్నారు. మిగిలియున్న వీరులు శ్రీకృష్ణునిచే భీమ జరాసంధ యుద్ధమందు హతమార్చబడిరి. ఇంకను మిగిలియున్న 56 కోట్ల యదువీరులు, ద్వారకానగర మందు పరస్పర యుద్ధమున హతులైరి. అందరినిచంపి శ్రీకృష్ణు డంతమందు తన శరీరమును విడిచెను; పాండవులుకూడ కాల గర్భమున కలిసిపోయిరి. భారతభూమి సర్వశూన్యమైపోయినది; వెలుపలనుండి మ్లేచ్ఛులువచ్చి దీనినణచివేసిరి. దీని ఫలితముగ అహరహము, దుఃఖము, దరిద్రము, కలహము, రోగము, అజ్ఞా నము, అశాంతి దేశము నాక్రమించినవి.

ఇస్లాం మతవాదులు కాఫిరుల (ఇతరుల)ను వధించుటయే తమ ధర్మమని భావించుచున్నారు. తమ మతకర్తవ్యమెంత చెడ్డదియైనను వారికి మంచిదిగనే తోచును; బహిస్త్ (స్వర్గము)ను ఇవ్వగలదు. ఇట్టి సిద్ధాంతమునే గీతయందునుకూడ గలవు.

శ్లో॥ శ్రేయాన్స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్।
స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్॥
(గీ. అ. 18–47)

శ్లో॥ సహజం కర్మ కౌంతేయ సదోషమపి నత్యజేత్।
సర్వారంభాహి దోషేణ ధూమేనాగ్నిరి వావృతాః॥
(గీ. అ. 18–48)

తమ కులధర్మములు, కొద్ది గుణములు గలవైనను విశేష గుణములు కలిగి చక్కగ ననుష్ఠింపబడిన పరధర్మములకన్న శ్రేష్ఠములైనవని తెలియుము. తమతము కులధర్మముల నాచరించు జనులకు పాపములంటవు.

కౌంతేయా! దోషయుక్తమైనను, స్వభావజన్యములగు కులధర్మములను విడువగూడదు. ఎందువల్లననగ ? అగ్నిని పొగ కలిసియుండురీతిగ ఎల్ల కర్మలను దోషము లావరించియుండును.

ఒక ముసల్మాను హిందువులనబడు "కాఫిరు"లను ముక్కు ముక్కలుగ నరికి చంపివేసినను, ఈ పాపమతని కంటదు. హత్యాదోషముతో పాపయుక్తమైనప్పటికి, ముసల్మాను ఈ

కర్మను విడువరాదు; అనగా ఇట్టి హత్యలు చేయుచుండవలెను. ఇట్లే క్షత్రియునకు హత్యాది కర్మలు పాపయుక్తమైనప్పటికి అతడు చేయవలసియే యున్నది.

ఇట్టి మతనమ్మకములతో ఒక ముసల్మాను హిందూ కాఫిరును చంపుటలో పాపమని భావింపడు. ఇట్టి మతసిద్ధాంతములు నమ్మి ఆస్తికునిగ తలచి, ఒక మతవాది మరియొక మతవాదిని వధించుటకు సంశయింపడు; అది పాపమనియు భావింపడు. ఇట్లే ఒక వ్యాపారి ప్రజలను బాధించి అధికవడ్డీని వసూలుచేయుచు తనను దోషిగ తలచడు; ఇది యతని కులధర్మము!

దేవత నుపాసించువాడు ఒక మేక తల నరుకుటను పుణ్యమని భావించును. ఇట్లే ఒక సేవకుడు కుక్కవలె తోక నాడించుచు తన యజమాని ననుసరించుట తప్పుగ తలపడు. ఒక అధికారి లంచము (మామూలు) తీసికొనుట పాపయుక్తమైనప్పటికి తన ధర్మముగ భావించును.

ఇపుడు తాము నిష్పక్షపాతబుద్ధితో బాగుగ నాలోచింపుడు; గీతయందలి ఈ సిద్ధాంతములు దోషరహితమైనవేనా? ఇపుడి ప్రపంచమున రాజకీయమగు, మతసంబంధమగు హత్యలు జరుగుచునే యున్నవి; ఇందువలన ప్రపంచము ప్రమాదభరితమై యున్నది. ఇట్టి సిద్ధాంతములే దీనికి కారణములైయున్నవి. ఒక రాజకీయవాది మరియొక రాజకీయవాదిని, ఒక మతవాది మరియొక మతవాదిని చంపుట, దోచుకొనుట, దోషిగ నిర్ణయించుట తన ధర్మమని తలచుచున్నాడు. ఇట్టి విషయములు గీత

యుచున్నంతమాత్రమున తాము వాటిని సరియైనవేనని భావించెదరా!

నా అభిప్రాయప్రకారము – ప్రతి న్యాయప్రియుడు, ప్రతి నిష్పక్షపాతి, ప్రతి స్వతంత్రబుద్ధిగల విద్వాంసుడు ఇట్టి భయంకర సిద్ధాంతములను ప్రతిఘటించి తీరవలయును; ఇది వారి ధర్మము.

ఎంతటి పాపాత్ముడైనప్పటికి క్రయిస్తవ మతమును గ్రహించి క్రీస్తును శరణుపొందినయెడల అతడు సమస్త పాపములనుండి విముక్తిని పొందగలడు. ఇది పాదరీల కథనము! ఎందువలన? క్రీస్తు అందరి పాపములను గ్రహించి తాను శిలువ వేయబడెను; సమస్త క్రయిస్తవుల పాపపరిహారార్థము తన ప్రాణములు సర్పించెను. ఇట్టి అనర్గళ విషయములను క్రయిస్తవులు తప్ప మిగిలినవారందరు హసింతురు. ఇట్టి అనర్గళమగు అనర్థములు సమస్త మతములందును గలవు! గీతాభక్తులుకూడ ఇటులనే చెప్పుచున్నారు. ఈ క్రింది శ్లోకమును గమనింపుడు.

శ్లో॥ సర్వధర్మా న్పరిత్యజ్య మామేకం శరణంవ్రజ।
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామిమాశుచ॥
(గీ. అ. 18–66)

సమస్త ధర్మములను విడిచి నన్ను ఒక్కనినే శరణు పొందుము. నేను మీకు సమస్త పాపములనుండి విముక్తిని కలుగజేయుదును; సంశయింపకుము అని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు. ఇట్టి ఉపదేశములు పాపభీతినితగ్గించి ప్రజలను పాపము

వైపునకు ఆకర్షించుచున్నవి. ఇట్టి మతోపదేశముల మూలము ననే మూర్ఖప్రజలు మతమువైపునకు మొగ్గుచున్నారు; మత నాయకులను పూజించుచున్నారు. తామాలోచింపుడు గీతయం దలి ఈ విషయములు నిర్దోషమైనవేనా ? ఇట్టి అనర్గళ అసంబద్ధ విషయములు అన్ని మతములయందును గలవు; ఇందువల్లనే మూర్ఖులాకర్షింపబడుచున్నారు. మహమ్మదీయ నాయకులు, గొప్పగొప్ప "ముల్లాలు" ఎంతటి ధర్మాత్ములైనా ముస్లిమ్ మతస్థుడు గానిచో బహిస్త్ (స్వర్గము)ను పొందజాలడు. ఎంతటి హంతకుడైనా ముసల్మానుగ "తోబా"చేసినయెడల "బహిస్త్" (స్వర్గము)నకు వెళ్లగలడు. వైష్ణవ మతస్థులు ఇంతకన్న ముం దుకు పోయినారు. పొరపాటునకూడ ఒకసారి "నారాయణ" అని అన్నచో చాలును సమస్త పాపములు సమసిపోగలవట! "అజామిళోపాఖ్యానము" పై విషయమును నమ్మించుటకే కల్పింపబడినది.

ఇది యంతయు మత ఇంద్రజాలము. మతవాదులు మూర్ఖుల నాకర్షించి, మోసగించుటకు తమ తమ గ్రంథములందీ విధముగ లిఖించి, మతవ్యాప్తిని పొందించియున్నారు.

శ్లో॥ యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్।
యత్తపస్యసి కౌంతేయతత్కురుష్వ మదర్పణమ్॥
(గీ. అ. 9-27)

ఓ అర్జునా! నీవు చేయు పాపపుణ్యకర్మలను, భుజించు

పదార్థమును, చేయు దానములను, హవిస్సులను, తపస్సును నాకు అర్పణ చేయుము.

అది పాపమగుగాక, పుణ్యమగుగాక, శుభమగుగాక, యశుభమగుగాక, దానిని నీవు "కృష్ణార్పణమస్తు" అని భావించినచో ఆ కర్మబంధమునుండి మోక్షమును పొందగలవు. ఇది జరుగగలదా ? చోరీ చేయుము, దోపిడి చేయుము, లంచము తినుము, హత్యచేయుము లేదా ఏ శుభాశుభ కర్మనైనా చేయుము – "తత్కురుష్వ మదర్పితమ్" అని సమస్తము నా కర్పింపుము. నీవా బంధమునుండి విడివడగలవు. దొంగతనమందు నీవు పట్టుబడినపుడు "కృష్ణార్పణమస్తు" అని పలికిన నిన్ను విడిచెదరా ? ఒకనిని హత్యచేసినపుడు "కృష్ణార్పణమస్తు" అనిన నిన్ను విడిచెదరా ? ఒక న్యాయాధికారి "కృష్ణార్పణమస్తు" అనిన ముద్దాయిని విడుచునా ?

"నీవేమి తినినను, దేనినెవని కిచ్చినను నాకర్పించిన యెడల ఆ కర్మబంధములనుండి నీవు తప్పుకొనెదవు" ఇది శ్రీకృష్ణ ఉవాచ. ఎంతటి విచిత్రమగు సంగతి ? "ఎడ్రిన్" వంటి మహావిషమును నీవు త్రాగినను, ఇతరుల కిచ్చినను చివరకు "కృష్ణార్పణమస్తు"అని అన్నంతమాత్రమున ఆ కర్మఫలము నీకంటదా ? ఇది సంభవమా ? జ్ఞానరూపమగు, స్వాధ్యాయ రూపమగు కర్మలను నీవు పొందిన సత్ఫలమును "కృష్ణార్పణమస్తు" అనగ కృష్ణునకు, మూర్ఖార్పణమస్తు అనగ మూర్ఖునికి సంక్రమించునా ? ఇట్లైనన్నటికిని జరుగదు! అసంగతములగు సం

గతులనేకములు గీతయందు గలవు. ఇట్టి మాటలు భగవంతు నిచే చెప్పబడియుండునా ?

శ్లో॥ మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా।
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః॥
(గీ. అ. 3–30)

సమస్త పాపపుణ్యకర్మలను నాకర్పించి, వివేకబుద్ధితో ఆశ, మమకారము లేనివాడవై నిశ్చింతగ యుద్ధమును చేయుము. నీకు ఏపాపమంటదు! ఇది ఎంతటి అపభ్రంశమార్గము ?

శ్లో॥ యేత్వేత దభ్యసూయంతో నానుతిష్ఠంతి మేమతమ్।
సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టా నచేతసః॥
(గీ. అ. 3–32)

ఈ సిద్ధాంతములనంగీకరి-పనివారు మూర్ఖులని గీతా కారుడు చెప్పుచున్నాడు. ఇది పక్షపాతమునకు పరాకాష్ఠ! అనగ ? ఎవరు నన్ను నిందింపుచు ఈనా మతము నంగీకరింపరో వారందరు మూఢులనియు, అవివేకులనియు, నాశ్యముచెందువారనియు తెలిసికొనుము.

సమస్త మతములందు ఈ విధముగనే వ్రాయబడియున్నవి; మతములన్నియు నీవిధముగనే యున్నవి; అన్నియు తమ తమ ప్రశంసను చేసికొనుచున్నవి.

ముసల్మానులు "ఖుర్-ఆన్ ఏ సూత్రముల నంగీకరింపని వారిని, క్రయిస్తవులు "బైబిలు సూక్తుల" నంగీకరింపనివారిని

మూఢులుగ భావించుచున్నారు. అన్ని మతములవారు, ఇతర మతస్థులను నాస్తికులుగ తలచుచున్నారు. మన సిద్ధాంతములు నంగీకరింపనివారు మూఢులెట్లగుదురు? చెప్పు సంగతులు చెడ్డవై నపుడు, యుక్తియుక్తములు కానపుడు, తలతోక లేకుండ అసత్యములైనపుడు ఉపదేశముల నంగీకరింపవలసిన పని ఏమున్నది?

మతవాదులు తమ గ్రంథములందలి విషయముల నంగీకరింపనివారు ఘోర నరకమును పొందుదురనికూడ వ్రాసియున్నారు. ప్రజలపై ఈ ప్రభావము పడును; ఎంతటి అబద్ధమునైనా నరకభయమువలన ప్రజలు దానిని ఖండించుటకు సాహసింపరు. స్వతంత్రభావోపేతులపై ఈ ప్రభావము పడదు. నిష్పక్షపాత న్యాయప్రియులపై సత్యవిషయముల ప్రభావము మాత్రమే పడగలదు. అసత్యముల ఖండించువారెవరు నరకమును పొందజాలరు.

శ్లో॥ అన్నాద్భవంతి భూతాని పర్జన్యా దన్న సంభవః
(గీ. అ. 3-14)

సమస్త ప్రాణులు అన్నమునుండి పుట్టుచున్నవని గీత చెప్పుచున్నది. ఇది అసంభవము! ప్రాణుల అన్నమును తినుచున్నవి; అన్నమువలన అవి పోషింపబడుచున్నవి. కాని పుట్టుట లేదు.

ప్రతి ప్రాణియు తన జాతి ప్రాణివలన ఉద్భవించుచున్నది మానవుడు మానవునకు, గుఱ్ఱము గుఱ్ఱమునకు, సింహము

సింహమునకు పుట్టుచున్నది. అన్నమువలన ప్రాణి పుట్టదు; అన్నమువలన అన్నమే పుట్టుచున్నది. గోధుమవలన గోధుమ, బటాణీలవలన బటాణీ, ధాన్యమువలన ధాన్యము పుట్టుచున్నది. గీతయందిట్టి అసంగత విషయము లెన్నియో గలవు. అయినప్పటికి గీతాకారుడు – "నా మాటల నంగీకరింపనివాడు మూర్ఖులు!" అనుచున్నాడు.

శ్లో॥ ప్రకృతేః క్రియ మాణాని గుణైః కర్మాణి సర్వశః।
అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే॥
(గీ. అ. 3–27)

సర్వకార్యములు ప్రకృతిద్వారాను లేక దాని గుణముల ద్వారాను జరుగుచున్నవి, కాని అహంకార మోహితుడైన మూర్ఖుడు వీనిన న్నిటిని నేను చేయుచున్నానని భావించుచున్నాడు.

మతవాదులుకూడ భగవంతుని ఛిచ్ఛక్తిగ నంగీకరించుచున్నారు. ప్రకృతి జడము; అది ఏకొంచమైనను ఎట్లుచేయగలదు? జడప్రకృతితో తయారైన శరీరమంచు ఎంతవరకు ఆత్మ యుండునో, ఎంతవరకు "నేను" "మేము" అను ఛిద్రపాపిష్ఠగు జీవుడుండునో అంతవరకు మాత్రము, శరీరము లేక ప్రకృతిద్వార సమస్త కార్యములు జరుగుచున్నవి; ఈ "నేను" "మేము" అనుచేతన జీవుడు లేచిపోయినపుడు తరువాత, జడ ప్రకృతితో తయారైన ఈ శరీరము సర్వదా నిరుపయోగమగుచున్నది; అపుడా శరీరము ఒక్క– పనికూడ చేయజాలదు.

అట్టి నిర్జీవ శరీరము చూడజాలదు, వినజాలదు, తినజాలదు, నడువజాలదు - అనగ? ఏ శరీరమందు "నేను" "మేను" అనునది లేకుండునో ఆ శరీరము ఒక్క పనికూడ చేయజాలదు; సమస్త కర్మలజేయునది ఈ "అహమే!", ఈ "ఆత్మయే!" ప్రకృతిగాదు. మతవాదుల కథనానుసారముగూడ కర్మఫలములగు సుఖదుఃఖములను ఈశ్వరుడు ఆత్మకు కలుగజేయుచున్నాడు; ఎందువలన? సుఖము లేక దుఃఖమును ఆత్మయే ననుభవించుచున్నది. శవమనుభవించుటలేదు. చట్టరీత్యా మానవ శరీరమును కాల్చివేసిననుకూడ నేరముకాదు; శవము శవమే, మానవుడు కాదు. శరీరమేమియు చేయలేదు; శరీరముద్వార ఆత్మ చేయుచున్నది పనిచేయుటకు శరీరమొక ఉపకరణముమాత్రమే! ఒక మానవుడు మరియొక మానవుని కత్తితో కొట్టుచున్నాడు. కత్తిపై నెవడూ నేరమును మోపడు. ఎవడు కర్రతో కొట్టియున్నాడో అతనిపై మాత్రమే నేరమును మోపుచున్నారు.

ఒక వడ్రంగి ఉలితోను, బాడితెతోను పనిచేయుచున్నాడు; దీని ఫలము, దీని కూలి వడ్రంగియే అనుభవించుచున్నాడు. కాని ఉలి, బాడిత అనుభవించుటలేదు. దొంగతనము చేసినవాడు మరణించినయెడల, అతని మృతశరీరమునై నేరమును మోపరు. మృతశరీరమును జైలుకు పంపరు. దొంగతనము చేసినది శరీరముకాదు; ఆ శరీరమందున్న ఆత్మయే!

పాపకర్మయొక్క ఫలము దుఃఖము; పుణ్యకర్మయొక్క ఫలము సుఖము. సుఖదుఃఖములను ఆత్మయే అనుభవింపగలదు.

ఆత్మరహితమగు శరీరమునకు పాపపుణ్యఫలములగు సుఖదుఃఖము లుండవు. పాపపుణ్య కర్మలను శరీరముచేయదు. ఆత్మయే చేయు చున్నది. "నేను" "మేము" అని ఆత్మయే తనకొరకు చెప్ప చున్నది. ఒక శవము "నేను" అని చెప్పజాలదు.

శ్లో॥ అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయాస్థితః॥
(గీ. అ. 10–20)

ఓ అర్జునా! నేనే ఆత్మను. సమస్త ప్రాణియొక్క హృద యాంతరములయందు వర్తమానుడనై యున్నాను.

"సమస్తము ప్రకృతియే చేయుచున్నది. ఇందలి ఫలి తము ప్రకృతికే చెందగలదు. నీకుకామ" మూర్ఖుడగు మాన వుడు వ్యర్థముగ తన్ను కర్తగ భావించి, పాపపుణ్యములకు భాగస్థుడై దుఃఖము ననుభవించుచున్నాడు. కావున నీవు సమస్త ప్రపంచమును సంహరించినను– "నేనీ పని చేయలేదు" అని భావించినచో ఈ ఫలితమును నీ వనుభవింపవు! (గీ. అ. 18–17) ఇది గీతాసిద్ధాంతము. ఈ సిద్ధాంతానుసారము ఒక మానవుడు మరియొక మానవుని హత్యజేసి – "నేను చంపలేదు ప్రకృతియే చంపినది. ఆత్మ అమరమైనపుడు ఎవడు ఎవనిని చం పగలడు?" అని భావించినయెడల పాపమంటజాలదు.

శ్లో॥ అవినాశితు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్।
వినాశ మవ్యయ స్యాస్య నకశ్చిత్కర్తు మర్హతి॥
(గీ. అ. 2–17)

దేనిచేత సమస్త ప్రపంచము వ్యాపింపబడియున్నదో, అట్టి యాత్మ నాశము లేనిదని తెలియుము. నాశము లేని ఆ యాత్మకు నాశము గలిగించుట ఎవరికిని శక్యముగాదు. ఆత్మ అవినాశియైనపుడు దాని నెవరు చంపగలరు? ఇట్లు చెప్పినందు వలన నెవడైనను హత్యానేరమునుండి తప్పించుకొనగలడా? తామాలోచింపుడు - ఒకడు స్వయముగ హత్యచేసి ప్రకృతిపై దోషమారోపించి, తాను రక్షింపబడుటకు ప్రయత్నించువాడు మూర్ఖుడుకాదా?

గీతయందు స్వవచన వ్యాఘాతములు చాలగలవు. రెండవ అధ్యాయమందలి 33, 34, 35, 36 శ్లోకములను గమనింపుడు,

శ్లో॥ అథచేత్త్వ మిమం ధర్మ్యమ్ సంగ్రామం నకరిష్యసి,
తతఃస్వధర్మం కీర్తించ హిత్వా పాపమవాప్స్యసి. (33)

శ్లో॥ అకీర్తించాపి భూతాని కథయిష్యంతి తేఽవ్యయామ్,
సంభావితస్యచాకీర్తి ర్మరణాదపిరిచ్యతే. (34)

శ్లో॥ భయాద్రణాదుపరతం మన్యంతే త్వామ్ మహారథాః,
యేషాంచత్వమ్బహుమతోభూత్వాయాస్యసిలాఘవమ్35

శ్లో॥ అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాఽహితాః,
నిన్దన్తస్తవ సామర్థ్యమ్ తతోదుఃఖతరం నుకిమ్. (36)

శ్లో॥ హతోవాప్రాప్స్యసిస్వర్గం జిత్వావాభోక్ష్యసేమహీమ్,
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయకృతనిశ్చయః (37)

నీవు ఈ ధర్మ్యమైన యుద్ధమును చేయకపోదువేని, అం దువలన స్వధర్మమును, యశస్సును గోలోవ్వుటయేగాక పాప మునుగూడ పొందుదువు. (33)

ఇంతియేగాకుండ మానవులందరు బహుకాలమువరకు నీ యపకీర్తిని చెప్పుకొనుచుందురు. గౌరవముగలవానికి అప కీర్తి మరణముకన్న ఎక్కువైనది. (34)

మహారథులగు కర్ణదుర్యోధన ప్రభృతులు నిన్ను యుద్ధ మునుండి భయముచే తొలగినవానిగ భావింతురు. నిన్నిదివఅకు గౌరవించినవారే చులకనగ జూతురు. (35)

నీ శత్రువులు నీ సామర్థ్యమును నిందించుచు, నిన్ను గురించి అనరాని మాటలందురు. ఇంతకన్న నధిక దుఃఖమేమి గలదు ? (36)

యుద్ధమందు హతుడవగుదువేని స్వర్గమును పొందు దువు; జయింతువేని రాజ్యమనుభవింతువు. ఇందువలన ఓ అర్జునా! యుద్ధమునుచేయు నిశ్చయించుకొన్నవాడవై లెమ్ము. (37)

ఒక సత్పురుషునికి నిందకన్న ఎక్కువగు దుఃఖమేదియు లేదు నింద అపకీర్తులు వినుటకన్న చచ్చుటయే మేలని గీతయందలి పైశ్లోకముల భావము.

కాని ఈ గీతయందే 12వ అధ్యాయపు 19వ శ్లోకమందు పై సిద్ధాంతమునకు వ్యతిరేకముగ చెప్పబడినది; ఇందువలన స్వవచన వ్యాఘాతము సంభవించినది. ఈ శ్లోకమునుచూడుడు-

శ్లో॥ తుల్య నిందాస్తుతి ర్మౌ నీ సంతుష్టోయేనకే న చిత్,
అనికేత స్థిరమతిర్భక్తిమాన్మే ప్రియోనరః.
(గీ. అ. 12-19)

శ్లో॥ తుల్యప్రియా ప్రియో ధీరస్తుల్య నిందాత్మ సంస్తుతిః.
(గీ. అ. 14-24)

నిందాస్తుతులను సమానముగ భావించువాడు, మనన శీలుడు, యధాలాభ సంతుష్టిగలవాడు, గృహకృత్యపు మమత లేనివాడు, స్థిరబుద్ధిగల మానవుడు నాకు చాల ప్రియుడు. అట్టి వాడు ఇష్టులయందు, అయిష్టులయందును సమదృష్టిగలిగియుం డును; ధీరుడై నిందాస్తుతులయందు సమానుడై యుండును.

నిందను, అపకీర్తిని పొంది జీవించుటకంటె మరణించు టయే మేలని ముందు చెప్పియుండెను; తిరిగి ఈ గీతయందే ఈ శ్లోకమందు ఆ కృష్ణుడు - "సత్పురుషులు నిందాస్తుతులను లెక్కచేయరు" అని చెప్పుచున్నాడు. దీనినిబట్టి గీతారచయి తకు ఒక సిద్ధాంతమనునది లేనట్లు గోచరించుచున్నది.

శ్లో॥ సమశ్శత్రౌచ మిత్రేచ తధా మానావ మానయోః,
శీతోష్ణ సుఖదుఃఖేషు సమ స్సంగ వివర్జితః.
(గీ. అ. 12-18)

ఎవడు శత్రుమిత్రుని యందును, మానావమా నముల యందును, శీతోష్ణ సుఖదుఃఖముల యందును సమా నుడై, సంగరహితుడై యుండువాడు నాకు ప్రియుడు. తామా

లోచింపుడు – ఇట్టి పరస్పర విరుద్ధములగు విషయములు భగవంతునిద్వార చెప్పదగియున్నవా?

శ్లో॥ వ్యవసాయాత్మికాబుద్ధిరేకేహ కురునందన.

(గీ. అ. 2–41)

వ్యవసాయాత్మకమగు బుద్ధి ఒకే సిద్ధాంతమునకు కట్టుబడియుండును; ద్వివిధముగ నుండదు. కాని గీతయందలి ఇట్టి పరస్పర విరుద్ధ వచనములు, మానవులయందు వ్యవసాయాత్మక బుద్ధికి అవకాశ మీయజాలవు.

శ్లో॥ క్లైబ్యంమాస్మగమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే।
క్షుద్రంహృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠపరంతప॥

(గీ. అ. 2–3).

శ్లో॥ హతోవాప్రాప్స్యసిస్వర్గం జిత్వావాభోక్ష్యసేమహీమ్।
తస్మాదుత్తిష కౌంతేయ యుద్ధాయకృతనిశ్చయః॥

(గీ. అ. 2–37)

ఓ అర్జునా! నపుంసకభావమును విడువుము; ఇది నీకు తగదు. కనుక లెమ్ము! యుద్ధము చేయుము. చంపబడితివా స్వర్గమును పొందుదువు. జయించితివా భూపతివై రాజ్యభోగములనుభవింతువు.

"రణరంగమందు మరణించువారు వీర్వస్వర్గమును పొందుదురు" అను దానిని మహారాజులు, పాలకులు సృష్టించియున్నారు. ఎందువలన? సామాన్యులను సైన్యమునందు చేర్చు

కొనుటకు ప్రోత్సాహము కలిగించు నిమిత్తమో నీతివాక్యము కల్పింపబడినది.

ఈ దేశము - ప్రభువులది, పాలకులది, మంత్రులది లేదా రాజకీయనాయకులది అయిఉన్నది. వారు ప్రజలనుండి పన్నులు వసూలుజేసి డబ్బును మంచినీటిప్రాయముగ ఖర్చుపెట్టుచుందురు. ప్రజాక్షేమమనుపేర ప్రజలపై ననేక ప్రతిబంధకములను, నియమములను, చట్టములను మోపుచుందురు. పన్నులభారము ప్రజలకు భరింపశక్యముగాకుండును. స్వయముగ శాసనముల జేసి తామధికారులగుచుందురు; భోగముల ననుభవించువారు ప్రజలతో - "మీరందరు దేశముకొరకు మరణింపుడు; సేన యందుచేరి రణక్షేత్రమందు ప్రాణములర్పించినయెడల వీరస్వర్గమును పొందుదురు" అని చెప్పుచుందురు. కాఫిరులతో పోరాడి మరణించువారు స్వర్గమునకు పోవుదురుఅని మతనాయకులు ప్రబోధించుచున్నారు. ఈవిధముగ నితరుల కుపదేశింతురు గాని ఆ నాయకమ్మన్యులు స్వయముగ మరణించరు! ఇతరులకు మరణించుట నేర్పుదురు. ఇట్టి ఉపదేశములనుజేసి మతనాయకులు, రాజకీయవేత్తలు అనేక లక్షల హిందూ మహమ్మదీయులను చంపించియున్నారు. కాని వీరుమాత్రము మంత్రులుగ, ప్రధాన మంత్రులుగ, రాష్ట్రపతులుగ, గవర్నర్లుగ అధికారభోగముల ననుభవింపుచుందురు. ప్రజలుమాత్రము తమ సోదరులను, కుమారులను, ఆప్తబంధువులను కోల్పోవుచున్నారు; తమ స్త్రీలు, కుమార్తెలు అనమానములపాలై కాందిశీకులుగ అనేక బాధల

ననుభవించియున్నారు. ఈ నాయకబృందము చాల విచిత్ర స్వభావముగలది! నాయకులు ఓట్లభిక్షకు ప్రజలవద్దకువచ్చి వారి కాళ్లనుకూడ పట్టుకుందురు; తరువాత ఈ ఒట్లతో అధికారులై ప్రజల జుట్టును పట్టుకొని బాధింతురు. ప్రజలు కూడ గుడ్డలు లేకుండ బాధపడుచున్నను వారు పట్టించుకొనరు. అమాయకులైన ప్రజలు వారిని భగవంతునిగ భావింతురు.

గీతా రచయితకు ఒక సిద్ధాంతమున్నట్లు తోచదు

గీతారచయితకు ఒక ముఖ్య సిద్ధాంతమున్నట్లు తోచుట లేదు; ఎపుడేమాట అవసరమో అపుడామాట పలుకుచున్నట్లు కనుపించుచున్నది.

శ్లో॥ యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ.
(గీ. అ. 15-6)

ఏ స్థానమును పొంది మానవుడు తిరిగిరాడో - అనగ పునర్జన్మను పొందరో అట్టి ఉత్కృష్ట స్థానమే నా నివాసమని తెలియుము.

శ్రీకృష్ణుని నివాసమగు పరమ ధామమునకు చేరినవాడు ఈ ప్రపంచమునకు తిరిగిరాదు. ఈ విషయము అసంబద్ధముగనున్నది.

శ్రీకృష్ణుని ఈ పరమపదమునకు ఇతరులు చేరినను చేర కపోయినను, శ్రీకృష్ణుడూ ప్రదేశమును చేరియుండుననిగదా! ఎల్లప్పుడు ఆస్థానమందుండు శ్రీకృష్ణుడే ఈ ప్రపంచమునకు పునర్జన్మరూపమున వచ్చుచు పోవుచున్నపుడు ఇతరులెందుకు రాజాలరు? ఈ క్రింది శ్లోకమును చూడుడు-

శ్లో॥ బహూని మేవ్యతీతాని జన్మాని తవచార్జున।
తాన్యహంవేద సర్వాణి నత్వం వేద్ధ పరంతప॥
(గీ. అ. 4-5)

ఓ అర్జునా! నీకు, నాకు అనేక జన్మలు గతించిపోయినవి. ఈ సంగతి నీకు తెలియదు. నాకు తెలియును.

శ్రీకృష్ణుడు స్వయముగ - "నేను అనేక జన్మల నెత్తి యున్నాననియు, అనేక పర్యాయములు నా పరమధామము నుండి ఈ ప్రపంచమునకు వచ్చియున్నాను" అనియు చెప్పి యున్నారు. ఒకసారి నా పరమధామమునుండి ఎవరు తిరిగిరారనియు మరియొకసారి ఈ ప్రపంచమున అనేక పర్యాయములు జన్మించి యుంటిననియు చెప్పుట చాల అసందర్భముగ నున్నది.

శ్లో॥ యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత।
అభ్యుత్థానమధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహం॥
(గీ. అ. 4-7)

శ్లో॥ పరిత్రాణాయసాధూనాం వినాశాయ చ దుష్కృతాం।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే॥
(గీ. అ. 4-8)

ఓ అర్జునా! ఎపుడెపుడు ధర్మమునకు హానికలిగి అధర్మమునకు వృద్ధి గలుగుచుండునో అపుడపుడు నేనీ ప్రపంచమందు అవతరించుచున్నాను.

సత్పురుషుల సంరక్షించుటకొరకు, దుర్మార్గుల నశింపజేయుటకొరకు నేను మాటిమాటికి జన్మించుచున్నాను. ఇక్కడ శ్రీకృష్ణునకు స్వవచన వ్యాఘాతము ఏర్పడుచున్నది.

శ్లో॥ మాముపేత్యతు కౌంతేయ పునర్జన్మ నవిద్యతే.

(గీ. అ. 8–16)

ఓ అర్జునా! నన్ను పొందిన మానవుడు తిరిగి పునర్జన్మను పొందజాలడు.

శ్రీకృష్ణుడే మాటిమాటికి పునర్జన్మను పొందుచున్నపుడు శ్రీకృష్ణుని పొందినవాడు, తనయందే ఉన్నవాడు ఆ పరమధామమునుండి రాకుండ ఎట్లుండగలడు? కృష్ణుడే వచ్చుచు పోవుచున్నపుడు ఇతరుల సంగతి చెప్పవలసినదేమియున్నది?

కారాగారములో ఒకనిని బంధించినపుడు అతడు ఇటునటు రాజాలడు. శ్రీకృష్ణుని పరమధామము అట్టి కారాగారము కానపుడు ఈ ప్రపంచమునకు, రాకపోకలకు అవకాశముండితీరవలయును. అట్టి పరమధామమును పొందిన ముక్తునకు రాకపోకలకు అవకాశముండియుండును. ముక్తునకిది ముఖ్య లక్షణముగద! ఎట్లు శ్రీకృష్ణుడు పరోపకారార్థము ఈ ప్రపంచమునకు వచ్చుచు పోవుచుండునో, అటులనే జీవన్ముక్తుడుగూడ ఇక్కడకు రాగోరుచుండును. బద్ధులగువారు స్వేచ్ఛగ ఇటు

నటు తిరుగుట, ముక్తులగువారు శ్రీకృష్ణ పరమధామమును పొందిి, బద్ధులై అక్కడనే ఉండిపోవుట - ఇదియంతయు మత వాదుల విచిత్ర కథనము!

యుద్ధభూమిలో యుద్ధమధ్యమున అర్జునుడు శ్రీకృష్ణునితో "గురుజనులను, సోదరులను, పితామహులను, నా బంధువులను చంపుట చాల పాపకార్యము. ఓ కృష్ణా! ఈ యుద్ధమందు జయించి త్రిలోకాధిపత్యమును పొందినను, ఈయుద్ధము చేయరాదని నిశ్చయించుకొంటిని. నేనీ మహాపాపమును చేయజాలను" అని పలికెను. అప్పుడు శ్రీకృష్ణుడు ఒక విచిత్ర సిద్ధాంతమును సృష్టించెను. ఈ శ్లోకమును వినుడు-

శ్లో॥ అంతవంత ఇమేదేహా నిత్యస్యోక్తాశ్శరీరిణః
అవాశినోఽప్రమేయ స్యతస్మాద్యుద్ధ్యస్వ భారత॥
(గీ. అ. 2-18)

నాశరహితమగు, అప్రమేయమగు, నిత్యమగు జీవుని యొక్క శరీరమే నశించుచున్నది. చంపినను. చచ్చినను శరీరమే నశించుచున్నది. ఆత్మ నశించదు. కాని ఓ అర్జునా! నిశ్చింతగ యుద్ధము చేయుము.

చాల బాగున్నది! గురుడు చనిపోయినను, గురుని జీవుడు మరణింపడు; పితామహుడు చనిపోయినను అతని జీవుడు చనిపోడు, బ్రాహ్మణుడు చనిపోయినను బ్రాహ్మణ జీవుడు మరణింపడు. ఆవు మరణించినను ఆవు జీవము మరణింపదు. ఈ

సిద్ధాంతానుసారము మానవుడు – గోవుని, బ్రాహ్మణుని, గురుని పితృపితామహాదులను చంపినప్పటికి హత్యాపాపము ననుభవిం పడు. ఈ సిద్ధాంతము ననుసరించి పై వారినందరిని హత్యచేయు వచ్చునా. "జీవుడు మరణించుటలేదు; శరీరమే మరణించు చున్నది" అని న్యాయాధిపతి ఎటుట వాదించి తప్పకొన వీలుగలదా?

జీవునకు నాశములేని సంగతి యదార్థమే! కాని ఒక మనిషిని చంపి అతని జీవునియొక్క సంబంధము అతని శరీర ముతో లేకుండజేయుటయే హత్య! ధర్మశాస్త్రరీత్యా, చట్ట రీత్యా, సాంఘికరీత్యా ఇది పాపకార్యమే! ఈ సంగతి సామా న్య మానవులకుకూడ తెలీయును. ఈ గీతా సిద్ధాంతమును నమ్మినవానియొక్క కుమారుని ఎవడైనా హత్యచేసినపుడు అత నిని విడిచిపెట్టునా? "నాశ్-అదర్శనే" అను ధాతువువలన నాశశబ్దము కలుగుచున్నది అదర్శన లేక స్థానాంతరమును పొం దుటచేతనే దాని నాశ మంగీకరించుచున్నది. మరణించిన తరు వాత మృతప్రాణియొక్క అదర్శన మగుచున్నది; అది ఎన్నడూ ఆ రూపముతో కనుపించు అవకాశముండదు. ఇందువలన అది నశించినట్లే భావింపవలసియున్నది. దానికే నాశమనిపేరు. మర ణించిన తరువాతకూడ నాశమును పొందనట్లయితే దేనికిని, ఎప్పటికిని నాశనముండదు. నాశశబ్దము మరణించినవానికొరకు కాకుండిన దేనికొరకుపయోగింపబడగలదు? ఇట్టి అసందర్భ విషయములు మతగ్రంథములందు అనేకము లుండగలవు.

పాప మార్జనుడు యుద్ధము చేయుటకు సిద్ధముగ లేడు.
ప్రథమాధ్యాయమునందలి ఈ క్రింది శ్లోకముల చూడుడు.

శ్లో॥ నకాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖానిచ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేనవా॥
(గీ. అ. 1-32)

శ్లో॥ యేషామర్థే కాంక్షితం నో రాజ్యంభోగాస్సుఖానిచ।
తాఇమేఽవస్థితాయుద్ధే ప్రాణాం స్త్యక్త్వా ధనానిచ॥
(గీ. అ. 1-33)

శ్లో॥ ఆచార్యాః పితరః పుత్రా స్తథైవచ పితామహాః।
మాతులాః శ్వశురాః పౌత్రాఃస్యాలాస్సంబంధిన స్తథా॥
(గీ అ. 1-34)

శ్లో॥ యద్యప్యేతే నపశ్యంతి లోభోఽపహత చేతసః।
కులక్షయ కృతందోషం మిత్రద్రోహే చపాతకమ్॥
(గీ. అ. 1-38)

శ్లో॥ కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాస్స నాతనాః।
(గీ. అ. 1-40)

శ్లో॥ అహోబత మహత్పాపం కర్తుమ్ వ్యవసితావయమ్।
యద్రాజ్య సుఖలోభేన హంతుం స్వజనముద్యతాః॥
(గీ. అ. 1-45)

ఓ కృష్ణా! నాకు జయము వలదు, రాజ్యము వలదు,

సుఖము వలను; మన బంధువులందరు మృతిజెందిన పిదప మనకీ రాజ్యమేల ? భోగములేల ? బ్రతుకేల ? (32)

ఎట్టి బంధువులకొరకు రాజ్యభోగములను, సుఖములను కోరుచుందుమో అట్టివారందరు ధనప్రాణములయందలి ఆశను విడిచి, ఈ యుద్ధమందు మోహరించియున్నారు. ఈ మహా యుద్ధనుండు వారికి – "రక్షింపబడుచుము" అను ఆశ యుండదు. (చివరికి ఇదియే జరిగినది.) (33)

ఓ మధుసూదనా! వారందరు ఆచార్యులు, తాతలు, కొడుకులు, తాతలు, మేనమామలు, మామలు, బావలు, మరుదులు అయిఉన్నారు. (34)

అయినప్పటికి లోభవశమున భ్రష్టహృదయులైన దుర్యోధనాదులు, తమ కులక్షయ మిత్రనాశాది మహాపాపములను గ్రహింపజాలకపోవచ్చును; మనకీ కులక్షయ మహాపాపము స్పష్టముగ గోచరించుచున్నది. ఇందువలన సనాతన కులధర్మము నశించిపోగలదు. (38)

వంశనాశనము కలుగగనే పరంపరగ శాశ్వతములైయున్న వంశసదాచారములన్నియు నశించిపోవును. సదాచారములు నశించుటచే శిక్షకులులేనందున వంశమంతయు నధర్మము పాలగును. (40)

మనమిపుడెంత మహాపాపమును జేయ సమకట్టితిమి ? అక్కటా! రాజ్యసుఖమందలి యాశచే మన బంధువులనే చంపనుద్యమించుచున్నాముగదా! (45)

ఈ అర్జునుని వాదమును తాము ప్రశాంతహృదయముతో నాలోచించినయెడల దానియందలి గొప్పతనము తెలియగలదు. అర్జునుని ఈ సిద్ధాంతముతో శ్రీకృష్ణుడేకీభవించియున్నయెడల నేడు మన భారతదేశము సమస్త ప్రపంచమునకు శిరోమణిగ ప్రకాశించుచుండెడిది. భగవంతుడని చెప్పబడు శ్రీకృష్ణుడే పరస్పరము యుద్ధమును కల్పించి సర్వనాశముచేసియున్నాడు.

అర్జునునివంటి మహావీరుడు ఈ మహాయుద్ధమును నిరసించియుండినచో గొప్ప స్వార్థత్యాగము చేసినవాడై యుండెడివాడు. కాని అధర్మము జయించి యుండెడిది. ఇంతియే గాకుండ మహావీరుడగు అర్జునునకు, అతని కుటుంబమునకు గౌరవమగు హోదాతో జీవించు నవకాశముండియుండదు. అయినప్పటికి అర్జునుడు – తన దేశముకొరకు రాష్ట్రముకొరకు సర్వస్వమును బలిదానముచేసిన మహాపురుషునిగ కీర్తింపబడియుండెడివాడు అర్జునుడు శ్రీకృష్ణుని ఉపదేశమును వినకుండిన యెడల స్వయముగ కష్టములపాలైనను భారతదేశమునకు గొప్ప ఉపకారము జరిగియుండెడిది.

ఈ యుద్ధమువలన ఇతరులకు లాభముండదు. అర్జునునకే లాభము కలుగును. అతడు లాభమును, స్వార్థమును త్యజించుటకు సిద్ధపడెను. కాని శ్రీకృష్ణుడట్లు జరుగనీయలేదు. ఇందువలన శ్రీకృష్ణునకు లాభమేమి కలిగెను? తనముందు ఏ వీరుడు నిలబడియుండరాదు; ఉన్నయెడల తనకు స్వాధీనుడై యుండవలెను. పాండవులు తనకు మిత్రులు; వారినితప్ప శ్రీకృష్ణుడందరిని నశింపజేసెను.

అర్జునునకొక దూషిత సిద్ధాంతమును బోధించి ఆతనిని యుద్ధసన్నద్ధముజేసి సర్వనాశమును కలిగించెను. ఈ క్రింది శ్లోక ములు గమనింపుడు.

శ్లో॥ అశోచ్యా నన్వశోచ స్త్వం ప్రజ్ఞావాదాంశ్చభాషసే,
గతా సూ నగతా సూం శ్చ నానుశోచంతి పండితాః
(గీ. అ. 2-11)

శ్లో॥ నత్వేవాహం జాతునాసం నత్వంనేమేజనాధిపాః,
నచైవ నభవిష్యామో సర్వేవయ మతఃపరమ్.
(గీ అ. 2-12)

శ్లో॥ దేహినోఽస్మిన్యథా దేహేకౌమారం యౌవనం జరా,
తథా దేహాంతరప్రాప్తి ర్ధీర స్తత్ర నముహ్యతి.
(గీ. అ. 2-13)

శ్లో॥ తతో యుద్ధాయయుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి.
(గీ. అ. 2-38)

ఓ అర్జునా! నీవు శోకింపదగనివారిని గురించి శోకించుచున్నావు. పండితుసివలె మాట్లాడుచున్నావు. ఆత్మ, అనాత్మ వివేకముగల పండితులు చచ్చినవారినిగూర్చియు, బ్రతికియున్నవారలగూర్చియు దుఃఖింపరు. అనగ - మరణించినవారు ఎట్లైనను మరణించినవారే! జీవించియున్నవారు ఎన్నటికైన మరణింపవలసినవారే! ఇందు కింత ఆలోచన ఎందులకు? శ్రీకృష్ణుని ఈ ఉపదేశమెంతటి భయంకరమైనదో గమనింపుడు. (11)

ఓ అర్జునా! నేను ఇదివరకెన్నడును లేనివాడనుకాను. నీవును ఇదివరకెన్నడును లేనివాడవుకావు. ఈ రాజులును ఇదివరకెన్నడును లేనివారలుకారు. అట్లు మనమందరము నికముం దుకూడ లేకపోవువారముకాము! నేను, నీవు ఈ రాజులందరు శాశ్వతముగ నుండువారమే; కావున చావేలేనివారలగురించి దుఃఖించుట అనుచితము. నేనెట్లు నిత్యుడనో అటులనే జీవులు కూడ నిత్యులే! (12)

ఇందువలన చచ్చుటకు, చంపుటకు ఇంత ఆలోచన ఎందులకని భావము. ఇట్లు భావించి ఎవడైన తన పుత్రుని,తండ్రిని, సోదరుని, గురువును చంపగలడా ? శ్రీకృష్ణుని ఈ ఉపదేశము సమ్మతమేనా ?

జీవుడీ దేహమందు బాల్య యౌవన వృద్ధావస్థలను ఎట్లు పొందుచున్నాడో, అటులనే ఈ దేహమును విడిచి మరియొక దేహమును పొందుటకూడ జీవునకు ఒక అవస్థ వంటిదియే! ధీరులగువారు దీనినిగురించి నాలోచింపరు. (13)

మరణించుట - బాల్య యౌవన వృద్ధావస్థలవంటి ఒక అవస్థయే అయియుండినయెడల, ఈ మరణమును అన్ని మతగ్రంథములందు, రాజకీయ శాసనములందు - హత్యగ, మహాపరాధముగ భావించి ఎందుకు చిత్రించియున్నారు ? ఒక జ్ఞాని తన తన మృత్యువును ఒక అవస్థగ భావించుట తప్పుగాదు; ఇట్లు భావించి ఇతరులను చంపుట మహాపరాధము.

శ్లో॥ సుఖదుఃఖే సమేకృత్వా లాభాలాభే జయాజయే।
తతో యుద్ధాయయుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి॥
(గీ. అ. 2-38)

సుఖదుఃఖములు, లాభనష్టములు, జయాపజయములు సమముగ భావించి యుద్ధమునకు సంసిద్ధుడవుకమ్ము. ఇందువలన నీకు పాపమంటదు. సుఖదుఃఖములను సమానముగ భావించుట, భావించకపోవుట తన నిమిత్తమైనచో సహజమే! ఈ నెపము తన గురువును, తన సోదరులను, తన ఆప్తులను చంపుట ఎన్నటికిని ఉచితముగాదు. ఇట్లు భావించి హత్యచేసి, హత్యానేర మునుండి తప్పించుకొనుటకు ప్రయత్నించుట అజ్ఞానము! ఇది యేనా సనాతన ధర్మము? తామాలోచింపుడు; ఇట్టి మాటలు భగవంతుని ముఖతః ఉపదేశింపబడి యుండునా?

శ్రీకృష్ణుడే భగవంతుడైనట్లైనచో, దుర్యోధనాది మహా పాపాత్ములను వధించుటకు మహాభారతయుద్ధము లేకుండగనే చంపగలిగియుండెడివాడు; తన సుదర్శన చక్రముతో వధించి యుండెడివాడు. భగవంతుడందరి హృదయములందు నివసించి యున్నకారణమున, ఆ పాపుల హృదయ గమనమునే నిరోధించి చంపగలిగియుండెడివాడు. సర్వశక్తి సంపన్నుడగు భగవంతుడు ఈమాత్రపు పనిచేయజాలడా? ఇట్లు చేసియుండినయెడల దుష్టులుమాత్రమే మరణించియుండెడివారు. భీష్మ పితామహాది మహాజ్ఞానులు, ద్రోణాచార్యనివంటి అనేకులగు యుద్ధవిశార

దులు, శస్త్రాస్త్ర విజ్ఞానవేత్తలు రక్షింపబడియుండెడివారు. భారతదేశ మిప్పటి విధముగ మహాజ్ఞానవేత్తలతో శూన్యమై యుండెడిదికాదు. కాని ఇట్లు జరుగలేదు. శ్రీకృష్ణుడు యుద్ధ విద్యాలయందు అర్జునునితో సాటిరాడు; కేవలము సారథ్యమందే నైపుణ్యముగలవాడైయున్నాడు. గొప్ప కూటనీతిజ్ఞుడు. కను కనే ఈ కూటనీతిని ఉపదేశించి అర్జునుని యుద్ధోన్ముఖునిగ జేయగలిగెను. అర్జునునితో ఇట్లు పలికెను-

శ్లో॥ అవినాశితు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్।
వినాశ మవ్యయ స్యాస్య నకశ్చిత్కర్తు మర్హతి॥
(గీ. అ. 2-17)

దేనిచేత ఈ ప్రపంచమంతయు వ్యాపింపబడియున్నదో అట్టి ఆత్మ నాశములేనిదని తెలియుము. నాశరహితమగు నీ యాత్మకు నాశము కలిగించుట ఎవరికిని శక్యముగాదు. "ఆత్మ" అవినాశమైనదే! ఈ అవకాశము తీసికొని ఎవరినైనా హత్య జేసి "వారు వాస్తవముగ చావలేదు" అని వాదించుట సమంజసమేనా ?

ఈ సిద్ధాంతానుసారముగ ఎవడును చంపబడనందున అర్జునునకు యుద్ధాసక్తిని కలిగించి అందరిని చంపింప వలసిన పని యేమున్నది ?

శ్లో॥ యఏనమ్ వేత్తిహంతారమ్ యశ్చైనమ్ మన్యతే హతమ్
ఉభౌతౌన విజానీతో నాయంహంతి నహన్యతే.
(గీ. అ. 2-19)

ఎవడీ యాత్మను వధించువానిగ తలచుచున్నాడో, ఎవడీ వధింపబడువానిగ తెలియుచున్నాడో వారిద్దరును అజ్ఞానులే! ఎందువలన? ఈ "ఆత్మ" వధించునదియు, వధింపబడునదియు గూడ కాదు. కర్తృత్వ కర్మత్వములు రెండును ఆత్మకులేవు.

శ్రీకృష్ణుని ఈ మాట సరియైనదగుచో అర్జునుని ఎందులకు యుద్ధోన్ముఖుని చేయుచున్నాడు? అందరిని నేనే స్వయముగ చంపియున్నానని ఎందుకు చెప్పియున్నాడు?

శ్లో॥ మయైవైతే నిహతాః పూర్వమేవ,
నిమిత్తమాత్రమ్ భవ సవ్యసాచిన్.
(గీ. అ. 11-33)

ఓ అర్జునా! ద్రోణాది మహారథులు, సమస్త సైనికులు నాచే ముందే చంపబడియున్నారు. నీవు కేవలమ్ము నిమిత్తమాత్రుడవై యుండుము. ఎవడును మరణించినపుడు శ్రీకృష్ణుడు అందరు మరణించునట్లు ఎట్లు భావించెను? నేనందరిని చంపియున్నానని ఎట్లు చెప్పగలిగెను? దీనినిబట్టి చూచినయెడల శ్రీకృష్ణునకు ఒక సిద్ధాంతమే లేనట్లు గోచరించుచున్నది. ఎవడు చావనపుడు, చంపబడనపుడు ఎందుకిట్లు చెప్పచున్నాడు?

శ్లో॥ హతోవాప్రాప్స్యసిస్వర్గం జిత్వాభోక్ష్యసేమహీం.
(గీ అ. 2-37)

ఓ అర్జునా॥ చంపబడినయెడల నీవు స్వర్గమును పొందుదువు. ఇతరుల జంపి జయించితివా ఈ పృథ్వీరాజ్యమునను భవింతువు.

ఈ శ్లోకమందుకూడ మరణమున్నట్లే చెప్పచున్నాడు. శ్రీకృష్ణుడు నిష్కామకర్మను చేయుమని ఉపదేశించియున్నాడు. అతడే ఇక్కడ స్వర్గముపై, రాజ్యముపై ఆశను కల్పించుచున్నాడు. ఆ కృష్ణుడే క్రింద చెప్పచున్నాడు.

శ్లో॥ నిర్వైరః సర్వభూతేషు యః సమామేతి పాండవ.
(గీ. అ. 11–55)

శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్రఃకరుణ యేవచ.
(గీ. అ. 12–13)

సర్వప్రాణులయందు వైరభావము లేకుండువాడు నన్ను చేరుచున్నాడు. సమస్త ప్రాణులయందు ద్వేషభావము లేకుండ వలయును. అందరికిని మిత్రుడై అందరియందు దయగలిగి యుండవలెను. తిరిగి చెప్పచున్నాడు–

శ్లో॥ అహింసా సత్యమక్రోధః త్యాగః శాంతిరపైశునమ్।
దయాభూతేష్వలోలత్వం మార్దవం హ్రీ రచాపలమ్॥
(గీ. అ. 16–2)

శ్లో॥ భోగైశ్వర్య ప్రసక్తానాం తయాపహృత చేతసామ్।
వ్యవసాయాత్మికా బుద్ధిః సమాధౌ నవిధీయతే॥
(గీ. అ. 2–44)

ఇతరులను హింసింపరాదు, సత్యమునే పలుకవలయును, తనకపకారము చేయువానిపై గూడ క్రోధపడరాదు, ధనరాజ్య భోగముల కోరరాదు, చిత్తోపశమనము కలిగియుండవలెను,

ఇతరుల దోషముల చెప్పకుండనుండవలెను, ఎల్లప్రాణులయందు కనికరము గలిగి విషయవికారములు లేకుండ మృదుత్వము కలిగి లజ్జతో నుండవలయును.

భోగైశ్వర్యములందు ఆసక్తిగల పురుషులకు అంతఃకరణ మందు నిశ్చయాత్మక బుద్ధియుండదు. రాజ్యభోగములను, ఐశ్వర్యమును సజ్జనులు కోరరు; ఇక్కడ ఇట్లుపదేశించినను ఈక్రింది శ్లోకములందు శ్రీకృష్ణుడెట్లు చెప్పచున్నాడో చూడుడు.

శ్లో॥ హతోవాప్రాప్స్యసిస్వర్గం జిత్వావాభోక్ష్యసేమహీమ్।
తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయకృతనిశ్చయ॥
(గీ. అ. 2-37)

శ్లో॥ క్లైబ్యంమాస్మగమః పార్థ నైతత్వయ్యుపపద్యతే।
క్షుద్రంహృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప॥
(గీ. అ. 2-3)

శ్లో॥ అథచేత్వం మిమం ధర్మ్యం సంగ్రామం నకరిష్యసి।
తతః స్వధర్మం కీర్తించ హిత్వాపాపమవాప్స్యసి॥
(గీ. అ. 2-33)

ఓ అర్జునా! నీవు యుద్ధమున మరణించిన స్వర్గమును పొందగలవు; జయించితివా రాజ్యభోగముల ననుభవింతువు. కనుక యుద్ధముచేయ నిశ్చయించుకొని నిలబడుము. (2-37)

ఓ అర్జునా! భయపడకుము; ఇది నీకు తగినపని. ఓ పరంతప! ఈ తుచ్ఛహృదయ దౌర్బల్యమును త్యజించి యుద్ధము కొరకు నిలబడుము. (2-3)

ఒకవేళ నీవీ ధర్మయుద్ధమును చేయకపోయినయెడల స్వధర్మమును, కీర్తిని పోగొట్టుకొని పాపమును పొందుదువు. (2-33)

ఒకచోట - సర్వప్రాణులతోను విరోధింపకయుండుట, అహింసతో హత్యలుచేయకుండుట, రాజ్యభోగముల కోరకుండుట, అందరియందు దయాభావముతోనుండుట, స్వర్గాదులను మానావమానములను లెక్కచేయకయుండుట అను నీతిపాఠమును బోధించి, మరియొకచోట - కీర్తికొరకు రాజ్యసుఖము కొరకు, లాభముకొరకు, స్వర్గప్రాప్తికొరకు యుద్ధము చేయవలయునను నీతిని శ్రీకృష్ణుడు బోధించియున్నాడు. కావుననే ఈ మహాయుద్ధము దేశమంతటిని,జాతినంతటిని నాశముజేసినది.

ఇట్టి ఉపదేశములను శ్రీకృష్ణుడుగాక, మరియొకరు చేసియున్నయెడల సమస్త భారతవర్షము ముక్తకంఠముతో నిందించియుండెడిది. మతప్రవర్తకుడైయున్నకారణమున అతడేమి చెప్పినను ప్రజలు దానికి విరుద్ధముగ నేమియు మాట్లాడజాలక పోయిరి. ఇట్టి ఉపదేశముల కారణమున భారతీయులు తమలో తాము కలహించి అధోగతిని పొందుచున్నారు. తమ భగవంతుడే ఇట్టి నీతిని బోధించినపుడు ప్రజలెందుకనుసరింపరు? మతవాదులెవనిని బుద్ధిమంతునిగ, జ్ఞానిగ, దయాసాగరునిగ, భగవంతునిగ భావించుచున్నారో అతడే ఇట్లుపదేశించుట అసంగతముగ నున్నది. భగవంతుడు సర్వవ్యాపకుడైనపుడు, సర్వుల హృదయస్థుడై యున్నపుడు అతడు పాపాత్ముల హృదయగమ

నము నరికట్టి తేలికగ నశింపజేయవచ్చునుగదా! ఇంతటి మహా సంగ్రామమును కల్పించి, దేశమును సర్వనాశము చేయవలసిన పనియేమున్నది ? ఈ క్రింది శ్లోకవాక్యముల జూడుడు –

శ్లో॥ మయై వైతే నిహతాః పూర్వ మేవ,
నిమిత్త మాత్రం భవ సవ్యసాచిన్. (గీ. అ. 11–33)

ఓ అర్జునా! ఈ మహారాజులు, దుష్టులు నావలన ముందే చంపబడియున్నారు. కేవలము నీవు నిమిత్తమాత్రుడవై నిల బడుము.

సర్వశక్తిమంతుడగు మతభగవంతుడైన శ్రీకృష్ణుడు దుష్టులను సంహరించెను; వారేమాత్రము మరణించలేదు. శత్రు వులంత బలవంతులైయుండ మరణించినట్లెవరు భావింపగలరు ? భగవంతునిచే ముందే సంహరింపబడినవారైనప్పటికి, అర్జునుని వంటి మహావీరుడు ఒక్కరునికూడ ధర్మయుద్ధమందు చంపజాలక పోయెను. కర్ణుని కవచకుండలములు మోసముతో గ్రహింప బడెను. అయినప్పటికి కర్ణుడు యుద్ధరంగమందు శస్త్రరహితుడై యున్నపుడు, భూమిలో కూరుకొనిపోయిన తన రథచక్రమును ఎత్తుచున్న సమయమున అర్జునునిచే అధర్మముగ చంపబడెను.

ద్రోణాచార్యుని విషయమందుకూడ– "అశ్వత్థామ హతః కుంజరః" అను అసత్యమును పలికించి అతనిచే అస్త్రసన్యాసము చేయించెను. పుత్రశోకముతో స్పృహతప్పి పడియున్న సమయ మున ధృష్టద్యుమ్ననిచే ద్రోణుడు చంపబడెను. దుర్యోధనుడు

కూడ గదాప్రహారమున తొడలు విరగగొట్టబడి భీముసిచే అధర్మయుద్ధమున చంపబడెను. శ్రీకృష్ణుడు చెప్పినమీదటనే భీమసేను డిట్లన్యాయముగ దుర్యోధనుని సంహరించెను.

పితామహుడగు భీష్ముడు ఇటులనే మోసముతో చంపబడెను. అతనికెదురుగ శిఖండిని నిలిపిరి; భీష్ముడు శస్త్రాస్త్రములు విసర్జించియున్న సమయమున అతనిపై బాణవర్షమును కురిపించి సంహరించిరి. శస్త్రహీనునిపై శస్త్రప్రహారముజేసి చంపుట ధర్మయుద్ధముకాదు. వీరుడగు అర్జునునకు ఇట్టి పనులు చెరుగని మచ్చలుగ నుండిపోయినవి. ముందు భగవంతునిచే చంపబడినవానిని అర్జునుడు చంపుట కింతటి కష్టసాధ్యము కావలసివచ్చినది; ఎంతటి ఆశ్చర్యము! ఇందువల్లనే శ్రీకృష్ణునిచే "ముందు అందరిని చంపితిని" అని చెప్పబడినమాట యదార్థము కాసట్లు భావి పనలసియున్నది. అర్జునుని శ్రీకృష్ణుడు సవ్యసాచిమాత్రునిగ నుండుమని చెప్పెను. మతవాదులు ఎవనిని భగవంతునిగ, ధర్మరక్షకునిగ భావించుచున్నారో అట్టి శ్రీకృష్ణుడు అసత్య వాక్యములతో ప్రోత్సహించి యుద్ధమున అధర్మముగ అనేకమంది మహావీరులను చంపించెను.

శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషుకదాచన,
మాకర్మఫలహేతుర్భూ ర్మాతే సంగోఽస్త్వకర్మణి,
(గీ. అ. 2-47)

శ్లో॥ త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః,
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవకించిత్కరోతిసః.
(గీ. అ. 4–20)

నీకు కర్మచేయుటయందే అధికారము గలదు. దాని ఫలమును పొందుటయందు లేదు. నీవు కర్మను చేయవలసియే యున్నది. కాని ఫలమును కోరకుము. (2–47)

అర్జునుడు యుద్ధమును చేయనని విషాదమును పొంది – "ఈ పాపకర్మ నేను చేయజాలను" అని అన్నపుడు శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు – "పాపపుణ్యములు కర్మయొక్క ఫలములు. కర్మమాత్రముకాదు. నీకు కర్మచేయుటకే అధికారము గ్గలదు; దాని ఫలితమునుపొందు హక్కు లేదు"

నిత్యుడై నిరాశ్రయముగనుండి కర్మయొక్క ఫలమును కోరకుండ, కర్మను చేయుచుండినప్పటికి అతడేమియు చేయనట్లే యగును. ఎందువలన ? – ఫలాపేక్ష లేనివాడు సమస్తము చేసిన వాడయ్యును చేయనివానితో సమానుడే! కావున అతనికి పాప మంటదు. అనగా – మానసికముగ కర్మాసక్తి, కర్మఫలాసక్తి లేకుండ – ఎవరినైనను చంపవచ్చును; గురువులను, పితృపితా మహులను, గోబ్రాహ్మణులనుకూడ చంపుము; పాపముం డదు! (4–20)

శ్లో॥ నమాంకర్మాణి లింపంతి నమే కర్మఫలే స్పృహా।
ఇతిమాంయోఽభిజానాతి కర్మభిర్నసబధ్యతే॥
(గీ. అ. 4–14)

కర్మలు నన్నంటవు. కర్మసిద్ధియందు నాకాసక్తి లేదు. ఇట్లు నన్ను తెలిసికొనిన జ్ఞానికి కర్మఫలము లంటవు.

ఎంతటి విచిత్రమగు ఉపదేశము! పితృపితామహులను, భారతీయ సోదరులను హత్యజేసినప్పటికి, "ఈ ఫలము నాకంటదు" అని భావించినంతమాత్రమున పాపవిముక్తిని పొందవచ్చును. ఇట్టి శాసన మేదేశమందైన గలదా? న్యాయాధీశుని ముందు ఇట్లు వాదించి హత్యానేరమునుండి తప్పించుకొన గలడా?

నీ విషయమై దేనినైనను ధర్మముగ భావించుటకైనను నీకుస్వతంత్రత గలదు; ఇతరుని చంపుటయందు నీకేమి హక్కు గలదు?

ఆత్మహత్య చేసికొనువానిని ఎవరును నిరోధింపజాలరు. అయినప్పటికి ఆత్మహత్య మహాపాపమని చెప్పుచున్నారు. అట్లగుచో యదేచ్ఛగ ఇతరులను హత్యజేసి "ఈపాపఫలము నాకంటదు" అని తలచినంతమాత్రమున ఇది తప్పిపోవునా! మతముల యొక్క మతఈశ్వరులయొక్క ఇట్టి భయంకరోపదేశముల మూలమునసే ఈ ప్రపంచమందు అశాంతి, దురాచారములు వ్యాపించియున్నవి. ఇట్టి ఉపదేశముల చేయువానినే – కరుణాసాగరుడని, దీనదయాళుడని, దయాసముద్రుడని పొగుడుచున్నారు; ఇట్టి ఉపదేశములను బహిరంగముగ ఖండింపజాలకున్నారు.

మీరు ఏ కర్మచేసినను దాని పరిణామమును, ఫలమును

గురించి ఆలోచించకుండినయెడల అది మీకంటదు; ఇది గీతా సిద్ధాంతము. కుళ్లిన అన్నమును అధికముగ తినినయెడల మీరు కోరినను కోరకపోయినను ఈ దుష్కర్మయొక్కఫలము ననుభవించి తీరవలసియే యుండును. భ్రష్టాచారము, దురాచారము, దొంగతనము, వ్యభిచారము ఇట్టి మీ కర్మలయొక్క ఫలితమును, మీరు కోరినను కోరకపోయినను ఏదోఒకరూపమున అనుభవించితీరవలసియేయుండును. చెడ్డకర్మలపరిణామము అంతమున చెడ్డగనే యుండును; ఇట్లే సత్కర్మలయొక్క, శుభకర్మలయొక్క ఫలితము తప్పక మంచిగనే పరిణమించును.

శ్లో॥ అవశ్యమేవ భోక్తవ్యం కృతం కర్మ శుభాఽశుభమ్।

తనచే చేయబడిన శుభాశుభ కర్మలు అవశ్యమనుభవింపవలసియే యుండును. ఎవడట్టి పనిని జేయునో అతడట్టి ఫలితమునే రుచిచూడవలసియుండును; ఇది విశ్వప్రకృతియొక్క స్థిరమగు నియమము.

క్రైస్తవ మతస్థులు మహమ్మదీయ మతస్థులు "నిత్యము ప్రార్థననమాజు చేయుచుండినయెడల దేవుడు లేక ఖుదా మా యందరిపాపములను క్షమింపగలరు" అని భావింపుచుందురు. ఇది సర్వాబద్ధము. వైష్ణవమతమందు అజామిళుని చరిత్రకూడ ఇట్టి కల్పనయే!

మతగ్రంథములందలి ఇట్టి అసందర్భ విషయములను అంగీకరించుచున్నంతవఱకు ఈ ప్రపంచమందీ యశాంతితప్పదు;

నిజమగు శాంతిని, నిజమగు స్వతంత్రతను ఆశించుటకూడ వ్యర్థము!

మతగ్రంథములందు గీత ఒక మంచి గ్రంథమని భావింప బడుచున్నది. గీతయందే ఇట్టి అసందర్భ విషయములు గోచరించుచున్నపుడు, ఇతర మతగ్రంథముల విషయమై చెప్పవలసిన పనియేమున్నది? గీతయందనేక దోషపూర్ణసిద్ధాంతములున్నవి; మతగ్రంథములు నిర్దోషములైయుండుట అసంభవము! మతగ్రంథములందుకూడ కొన్ని మంచి సిద్ధాంతములు లేకపోలేదు; ఎక్కువ అసత్య విషయములతో నింపబడియున్నందున ఆచరణసాధ్యములు కాకుండ నున్నవి. సత్యజ్ఞానము సంక్రమించినవానిని ఈ గ్రంథము లేమియు చెరుపజాలవు!

శ్లో॥ ఏతా న్యపి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలానిచ।
కర్తవ్యా నీతి మే పార్థ నిశ్చితం మత ముత్తమమ్॥
(గీ. అ. 18-6)

ఓ పార్థ! ఈ సమస్త కర్మలను ఆసక్తిరహితముగ, ఫలేచ్ఛ లేకుండ చేయవలయును. ఇదియే నా స్థిరమగు మతము, ఈ మతమే ఉత్తమమైనదై యున్నది.

శ్లో॥ సంగం త్యక్త్వా ఫలం చైవ సత్యాగస్సాత్త్వికో మతః
(గీ. అ. 18-9)

ఫలమును త్యజించి, ఫలేచ్ఛ లేకుండ కర్మను చేయు టయే సాత్విక త్యాగమని అంగీకరింపబడు చున్నది.

శ్లో॥ అనాశ్రితః కర్మఫలమ్ కార్యంకర్మకరోతి యః।
ససన్న్యాసీచ యోగీచ ననిరగ్నిర్నచాక్రియః॥
(గీ. అ. 6–1)

ఏ మానవుడు కర్మఫలాపేక్ష లేక చేయతగు కర్మలను చేయుచున్నాడో అతడు కర్మ వదిలిన సన్యాసియు, యోగియు త్యాగియు నగుచున్నాడు.

శ్లో॥ యస్తు కర్మఫలత్యాగీ సత్యాగీత్యభిధీయతే॥
(గీ. అ. 18–11).

ఎవడు కర్మల నాచరించి, కర్మఫలముల త్యజించుచున్నా డో అతడే త్యాగియని చెప్పబడు చున్నాడు.

శ్లో॥ కర్మజమ్ బుద్ధియుక్తా హి ఫలంత్యక్త్వా మనీషిణః
జన్మబంధవినిర్ముక్తః పదంగచ్ఛంత్యనామయమ్॥
(గీ. అ. 2–51)

జ్ఞానయుక్త పురుషులు కర్మజములగు ఫలములను త్యజించి, జన్మబంధనములతో విడువడి నిర్దోషమగు పరమపదమును పొందుచున్నారు.

గీతయందలి ఈ శ్లోకములను గమనించినయెడల "కర్మను చేయుట కర్మఫలమును కోరకుండుట" అను సిద్ధాంతమే అన్నిటి కన్న గొప్పదిగ కనుపించుచున్నది. శ్రీకృష్ణుడి సిద్ధాంతమునే

గీతయందనేక పర్యాయములు పేర్కొనియున్నాడు. గీతయందీ సిద్ధాంతమే చాల ముఖ్యమైనది; దీనిని గీత కర్మయోగమని అంగీకరించినది.

లక్ష్యమును నిశ్చయించుకొని తన కర్మఫలప్రాప్తికై దృఢవిశ్వాసముతో కార్యమును నిర్వహించువారే ఈ ప్రపంచమున సఫలీకృతులైనారు; లక్ష్యములేని అర్థనిహీనములైన వ్యర్థమని నా అనుభవము. "వి" ఉపసర్గకుముందు "అర్థ" అని వచ్చినంమవల్లనే "వ్యర్థ శబ్దము" తయారైనది. వి+అర్థ = వ్యర్థ; "వి" అనగ విగత, విహీనము అని యర్థము. ఏది అర్థ విహీనమైనదో, నిష్ఫలమైనదో అదియే వ్యర్థము. ఫలరహిత ముగ, వ్యర్థముగ పనిచేయువాడు ప్రపంచమందు సఫలీకృతుడు కాజాలడు: ఎన్నడు ఔన్నత్యమును పొందజాలడు.

ప్రతీకార్యారంభమునందు నియతఫలప్రాప్తికొరకు దృఢ సంకల్పమును చేసికొనుట, భారతీయ సంప్రదాయానుసారము ఒక ఆచారమైయున్నది. సనాతన ధర్మావలంబులైన భారతీయులుకూడ ఇట్టి సంకల్పమును చేయుచుందురు. భారతవర్షమందలి ప్రతి ముని, ప్రతి మహాపురుషుడు ఈ పద్ధతి ననుసరించుచునే యున్నారు.

శ్రీరామచంద్రుడు రావణ విజయముకొరకు, సీతా ప్రాప్తికొరకు యుద్ధమునుచేసి యుండెను. విజయప్రాప్తికొరకు దృఢసంకల్పమును చేసికొని కార్యనిమగ్నుడైనందుననే విజయమును పొందగలిగెను.

శివుడు దృఢసంకల్పుడు. ఇందువల్లనే అతడు ప్రతికార్య మందు విజయమును సాధింపగలిగెను.

"నెపోలియన్ బోనపార్టు" దృఢమగు ఫలాపేక్షతో అతి కష్టసాధ్యములగు అనేక కార్యములందు విజయమును పొందగలిగెను. సంకల్పమెంత దృఢతరమగునో అంతశీఘ్రముగ ఫల ప్రాప్తి కలుగుచుండును.

ఒక విద్యార్థి పరీక్షయందు తీర్ణుడగుటకు దృఢసంకల్పమున్నగాని ఉత్తీర్ణుడు కాజాలడు. దృఢమగు ఫలేచ్ఛ యున్నపుడే స్థిరబుద్ధితో పనిజేయగలుగును. వ్యర్థముగ నెవడూ శ్రద్ధగ పనిజేయజాలడు. కావున ఇట్టివారు జ్ఞానులు, సన్యాసులుకారు!

ధనరూపమగు ఫలప్రాప్తికొరకు వ్యాపారి వర్తకము చేయుచున్నాడు; ధాన్యరూపమగు ఫలప్రాప్తికొరకు కర్షకుడు వ్యవసాయము చేయుచున్నాడు, వేతనరూపమగు ఫలప్రాప్తి కొరకు నౌకరు నౌకరీ చేయుచున్నాడు.

ఒక మహాలోభి కలడు. అతని కుమారుని చెండ్లికి కట్నమడుగలేదు. "ఎందువలన కట్నము నిర్ణయింపబడలేదు" అని అతని స్నేహితుడడిగెను. "నిర్ణయింపనందువల్లనే కట్నమధిక ముగ పొంద నవకాశముండును" అని అతడనెను. అతనిని త్యాగియని భావింపవచ్చునా? ఇందువలన పరమార్థముకొరకు ప్రయత్నించువాఁడుకూడ త్యాగి కాజాలడు. "అర్థము" అనగ-స్వార్థము, ప్రయోజనము అని భావము. దీనికి "పరమ" అని కలుపుటవలన "పరమార్థ" అయినది; అనగ - గొప్ప స్వార్థి,

గొప్ప ప్రయోజనకారి అని భావము. "స్వ" (తాను) తన ఆత్మోన్నతికొరకు సమస్తములను చేయుచున్నాడు. పూర్ణ స్వతంత్రతను పొందుటకు లేదా సమస్త బంధనములనుండి విడివడుటకు "ముక్తి" యని పేరు. ముక్తిని పొందుట పరమ స్వార్థమే! లేదా చాల గొప్పకార్యమే! కావున ముక్తిని పొందువాడు త్యాగికాడు; సన్యాసికాడు. గొప్ప స్వార్థి, గొప్ప అభిలాషియై యున్నాడు.

ఆత్మోన్నతిని అందరు కోరుకొందురు; కోరుకొనవలయునుకూడ. కనుక ఇట్టి మహాఫలప్రాప్తికొరకు లక్ష్యమును నిశ్చయించుకొని, దృఢవిశ్వాసముతోను, మనోబలముతోను, ఆత్మబలముతోను కార్యక్షేత్రమందు అగ్రేసరుడగుటవల్లనే "ఫలప్రాప్తి" లభింపగలదు.

ఇదియే సాఫల్యమునుపొందు గుప్తరహస్యము. గీతా సిద్ధాంతముల సంగీకరించువారికి మనోబలము, ఆత్మబలము, ఇచ్ఛాశక్తి సడలిపోగలదు; ఇందువలన ఫలప్రాప్తి కష్టసాధ్యమగును. ఫలమునుకోరి చేయుటయే సహజము. గీతాసిద్ధాంతానుసారముగ భారతీయుల ఆత్మబలము ద్వివిధమై బలహీనమై పోయినది.

తన కర్మఫలప్రాప్తికొరకు దృఢమగు ఇచ్ఛను కలిగియుండుట సఫలతకు పూర్వరూపము. ఫలరహితమగు శూన్యమనో భావములతో కర్మక్షేత్రమందు ప్రవేశించుట అసఫలతవైపునకు పోవుటయే! నిష్కామకర్మచేయువానికి ఒక లక్ష్యముండదు;

లక్ష్యహీనముగ పనిచేయువానికి జీవితమంతయు వ్యర్థముకాగ లదు! కర్మఫలమే కర్మకు లక్ష్యమగుచున్నది. ఫలేచ్ఛ లేకుం డుటయే - లక్ష్యహీనత, వ్యర్థత, నిష్ఫలతకూడనైయున్నది.

శ్రీకృష్ణుని జీవితచరిత్రనంతయు తాము పఠించినయెడల, అతడెల్లప్పుడు సకామకర్మనే చేసియున్నట్లు, నిష్కామకర్మ చేయనేలేదనియు తమకు తెలియుగలదు; ఇతరులకు మాత్రము నిష్కామకర్మ నుపదేశించెను. ఎపడును ఫలమును కోరకుండ కర్మను చేయడు. కాని శ్రీకృష్ణునియొక్క జన్మమే ఫలేచ్ఛతో కూడుకొనియున్నది; నిష్కామముకాదు! ఈ క్రింది శ్లోకమును పరికింపుడు.

శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్।
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే॥
(గీ. అ. 4-8)

సాధువుల సంరక్షణార్థము, దుష్టుల సంహరణార్థము, ధర్మమును స్థాపించుటకొరకు నేను ప్రతియుగమందు జన్మించు చున్నాను. శ్రీకృష్ణుని జననము నిష్కామమో, సకామమో ఇపుడాలోచింపుడు. సత్పురుషులను, సాధువులను రక్షించుట, దుష్టులను సంహరించుట రూపమగునదియే శ్రీకృష్ణునకు కర్మ ఫలమైయున్నది; ఇది ఎన్నటికిని నిష్కామకర్మకాదు; సకామ కర్మయే! ఇతరులకు మాత్రము నిష్కామకర్మను బోధించెను.

గీతయందు మరియొక చోట తమ తమ కర్తవ్యపాలన నెరవేర్చ వలసియున్నదని బోధించెను.

శ్లో॥ స్వే స్వేకర్మణ్యభిరతఃస్సంసిద్ధిం లభతే నరః.
(గీ. అ. 18–45)

శ్లో॥ సహజం కర్మ కౌంతేయ సదోషమపి నత్యజేత్.
(గీ. అ. 18–48)

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ.
(గీ. అ. 18–66)

మానవుడు తన స్వీయకర్మలయందు ఆసక్తుడైనవాడై సిద్ధిని పొందుచున్నాడు. (45)

ఓ అర్జునా! దోషయుక్తమైనదైనను స్వభావజన్యమగు కులధర్మముల విడువకూడదు. (48)

సమస్త ధర్మములను విడిచి ముఖ్యుడనైన నన్ను రక్షకునిగ పొందుము. (66)

గీతయందిట్టి పరస్పర విరుద్ధ విషయము లనేకములు గలవు. భగవంతుడిట్టి విషయముల బోధించునా ?

ఇది మతగ్రంథమైయున్న కారణమున వ్యతిరేకముగ నెవరును విమర్శించుటకు సాహసింపలేకుండినారు.

తాము ఆత్మజ్ఞానాభివృద్ధిని కాంక్షించునెడల శ్రీ యోగేశ్వర మునీశ్వర శ్రీ శివమునిచే రచింపబడిన (1) 'యోగదర్శన శాస్త్రము' (2) 'సచిత్రయోగ సాధనము' (3) 'సత్య సుందర్ అవుర్ స్వతంత్ర విచార్' (4) 'వేదాంత సిద్ధాంత్' ఆదిగాగల హిందీ గ్రంథములను అధ్యయనము చేయవలసియున్నది. జ్ఞానశక్తి ప్రెస్, గోరఖపూర్ నుండి వీనిని పొందవచ్చును.

EM

RETH302L185

114

	మవసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	REAI2024185
పుస్తకం పేరు	గొల్ల
తారీఖు	27,1,2024
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	181
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	CI, iv, vi, 113
లేవి పేజీలు	no
తయారు చేసినది	Lakshmi
పేజీలు విడదీసినది	Lakshmi
స్కాన్ చేసినది	Heema
పరీక్ష చేసినది	NANDHU
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	no
పరిస్థితి	good